www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 1-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 107 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ. 3.29 తదుపరి త్రయోదశి; నక్షత్రం: మృగశిర ఉ 10.24 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా. 7.00-8.38; దుర్ముహూర్తం: ఉ. 10.13-11.04, మ. 3.20-4.11; అమృతఘడియలు: రా. 12.44-2.22; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీ

బీసీఏ, బీబీఏ కోర్సులకు సర్కారు అనుమతి

కోర్సుల కనీస ఫీజు రూ.18 వేలుగా ఖరారు

ఒకట్రెండు రోజుల్లోనే ఉత్తర్వులకు అవకాశం

బీసీఏకు కొన్ని కాలేజీల్లో అదనపు వసూళ్లు?



12

4 నెలలు..

1.29 లక్షల కోట్లు

ఓటాన్ అకౌంట్‌పై ఆర్డినెన్స్ జారీ

రూ. 1,29,972 కోట్ల వ్యయ అంచనాలకు గవర్నర్ ఆమోదం

ఆగస్టు నుంచి నవంబరు వరకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వానికి అనుమతి

ఆర్థిక విధ్వంసంపై స్పష్టత వచ్చాకే పూర్తిస్థాయి బడ్జెట్

12

వెనక్కి వచ్చేయండి!

వైసీపీ వేధింపులతో వెనక్కి వెళ్లిన పారిశ్రామికవేత్తలతో చర్చలకు నిర్ణయం

వారికి భరోసా కల్పించే దిశగా చర్యలు

రాష్ట్రంలో పారిశ్రామిక పునరుత్తేజానికి

5 పాలసీలు

4 కొత్త క్లస్టర్లు

ఏడాదికి లక్ష కోట్ల పెట్టుబడులు..1.36 లక్షల ఉద్యోగాలు

ఇదే లక్ష్యంతో పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక

పరిశ్రమలపై సమీక్షలో సీఎం కీలక నిర్ణయాలు

పెండింగ్ ప్రోత్సాహకాల చెల్లింపుపై సానుకూలత

మల్లవల్లి భూముల ధరలు తగ్గింపునకు ఆదేశాలు



గనుల శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులు

2014-19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలను గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు గురిచేసి తరిమివేసింది. వారందరినీ తిరిగి రాష్ట్రానికి తీసుకువచ్చి పారిశ్రామికాభివృద్ధిని తిరిగి పరుగులు పెట్టించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. భయపడాల్సిన పనిలేదనే భరోసాను పారిశ్రామికవేత్తలకు ఇవ్వనుంది. ఐదేళ్లూ కుంటుబడిన పరిశ్రమలను గాడిలో పెట్టేందుకు ఐదు పారిశ్రామిక పాలసీలను, అదనంగా నాలుగు ఇండస్ట్రియల్ క్లస్టర్లను తీసుకురావాలని పరిశ్రమల శాఖపై జరిపిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకుంది.

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లూ సాగిన ఆర్థిక అరాచకానికి బలైన పారిశ్రామిక రంగాన్ని తిరిగి గాడిలో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుంటుపడిన పారిశ్రామికాభివృద్ధిని మళ్లీ పరుగులు పెట్టించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో సిద్ధమైంది. 2014-19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలను గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు గురిచేసి తరిమివేసింది. రాష్ట్రంలో బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పారిశ్రామికవేత్తలు భయపడాల్సిన

మిగతా 12వ పేజీలో...

ఇసుకలో ఎందుకీ గందరగోళం?

తవ్వకం, రవాణా చార్జీలు ఎందుకు పెరిగాయి?

ప్రజలే రవాణా చేసుకునేలా వెసులుబాటు

గ్రామ సచివాలయాల ద్వారా ఆన్‌లైన్ పర్మిట్లు

గనుల్లో నాటి వైసీపీ అక్రమాలు తవ్వితీయండి

గనుల శాఖ సమీక్షలో సీఎం ఆదేశాలు

12

గనుల వెంకటరెడ్డిపై వేటు!



సస్పెన్షన్, కేసు నమోదుకు రంగం సిద్ధం

సీఎంకు గనుల శాఖ సిఫారసు.. కోస్ట్ గార్డ్ నుంచి డిప్యుటేషన్‌పై

రెండు కీలక పదవులు ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్

11

ఇసుక, బీచ్‌శాండ్, బొగ్గు, సర్వే రాళ్లపై అడ్డగోలుగా నిర్ణయాలు

ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం.. నిన్నటితోనే ముగిసిన డిప్యుటేషన్

సస్పెండ్ చేస్తే రిలీవ్ కావడం కుదరదు

న్యూ రూల్స్



ఐదేళ్లు దాటితే కొత్త ఫాస్ట్ ట్యాగ్

మూడేళ్లు దాటితే కేవైసీ చేయించాలి

నేటి నుంచి నిబంధనల్లో మార్పు

అమలుకు అక్టోబరు 31 చివరి తేదీ

న్యూఢిల్లీ, జూలై 31: ఫాస్ట్ ట్యాగ్ నిబంధనలు గురువారం నుంచి మారుతున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. మారిన నిబంధనలకు అనుగుణంగా వినియోగదారులు, ట్యాగ్ సేవలను అందిస్తున్న సంస్థలు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఐదేళ్లు దాటిన ట్యాగ్‌లన్నింటినీ కచ్చితంగా మార్చాలి. మూడేళ్లు దాటితే తప్పనిసరిగా కేవైసీ చేయించాలి. వాహనం రిజిస్ట్రేషన్, ఛాసిస్ నంబర్లతో ట్యాగ్‌ను అనుసంధానం చేయాలి. అలాగే ప్రతి ఫాస్ట్‌ట్యాగ్ ఒక మొబైల్ నంబరుతో అనుసంధానమై ఉండాలి. కొత్త వాహనమైతే కొనుగోలు చేసిన 90 రోజుల్లోపు వాహనం నంబరును ఫాస్ట్‌ట్యాగ్ డేటాబేస్‌లో అప్‌డేట్ చేయించాలి. అలాగే వాహనం ముందు భాగం స్పష్టంగా కనిపించేలా ఫొటో అప్‌లోడ్ చేయాలి. గడువు అక్టోబరు 31.

హితవు



2

జీవిత, వైద్య బీమాలపై జీఎస్టీ తొలగించండి

వాటిపై 18% అంటే.. జీవితంలోని అనిశ్చిత పరిస్థితులపై పన్ను వేయడం లాంటిది

నిర్మలా సీతారామన్‌కు నితిన్ గడ్కరీ లేఖ

నియామకం



2

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతి సుదన్

1983 బ్యాచ్ ఏపీ క్యాడర్ ఐఏఎస్

బై బై

ప్రత్యక్ష రాజకీయాలకు ధర్మాన గుడ్‌బై?

11

ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయం

మొన్నటి ఎలక్షన్లలో కూడా అయిష్టంగానే పోటీ

బలవంతంగా బరిలో దిగి ఘోర ఓటమి

అస్త్రసన్యాసం దిశగా మరికొందరు వైసీపీ నేతలు

అడ్డగోలుగా ఆనాడు

12

సంజయ్, పొన్నవోలుకు హైకోర్టు నోటీసులు

దర్యాప్తులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కేసుపై మాజీ సీఐడీ చీఫ్, మాజీ అదనపు ఏజీ ప్రెస్ మీట్

దీనిపై అప్పట్లో అభ్యంతరాలు.. పిల్ దాఖలు

తదుపరి విచారణ సెప్టెంబరు 9కి వాయిదా

నేరము - శిక్ష

2

పూజా ఖేద్కర్‌పై వేటు

ట్రైనీ ఐఏఎస్‌గా నియామకం రద్దు

మళ్లీ పరీక్షలు రాయకుండా నిషేధం

ఆరని చిచ్చు

హమాస్ చీఫ్ హనియా హతం

హెజ్‌బొల్లా కమాండర్ షుక్ర్ కూడా..

ఇజ్రాయెల్ పనేనన్న హమాస్ ప్రతీకారం తప్పదని హెచ్చరిక

2

ఎక్కడ చూసినా.. విషాదమే

చురుల్‌మలలో తాడు సాయంతో బయటపడుతున్న బాధితులు



వయనాడ్‌లో మృత్యువు విలయ తాండవం

సోఫాలో కూర్చునే మరణించిన ఓ కుటుంబం

పరుగెడుతూ.. బురదలో ఇరుక్కుని కొందరు

శునకాలు గుర్తించినా.. మృతదేహాల వెలికితీతకు బండరాళ్ల అడ్డంకులు

భారీ వర్షాలతో మరిన్ని ఆటంకాలు

1000 మందిని కాపాడిన సైన్యం

వారం క్రితమే హెచ్చరించాం: అమిత్ షా

అంతా అబద్ధం.. రాజకీయాలకు సమయం కాదు: కేరళ సీఎం పినరయి

270కి పెరిగిన మృతుల సంఖ్య

240 మందికి పైగా గల్లంతు

విపత్తును సుమోటోగా తీసుకున్న ఎన్‌జీటీ

వయనాడ్, జూలై 31: టీవీ ముందు.. సోఫాలో కూర్చున్న ఐదుగురు కుటుంబ సభ్యులు.. కొండచరియల ధాటికి.. అదే సోఫాలో విగతజీవులుగా మారిపోయారు..! భారీ వర్షం, చలిని తాళలేక.. రెండుమూడు బెడ్‌షీట్లు కప్పుకొని పడుకున్నవారు.. ఆ దుప్పట్ల కిందే మృతదేహాలుగా కనిపించారు..! కొండచరియలు పెళపెళా విరిగిపడుతున్న శబ్దాలు విని.. బయటకు పరుగులు తీయాలనే ప్రయత్నంలో ఉన్నవారు.. అదే భంగిమలో బురదలో కూరుకుపోయి చనిపోయారు..! ఘటన జరిగిన

మిగతా 2వ పేజీలో...



ఆప్తులను పోగొట్టుకున్న వారి దుఃఖం

మానవ చర్యల వల్లే..

- వయనాడ్ విలయానికి కారణం అదే
- కేరళలో తరచూ ప్రమాదాలు అందుకే
- పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ ధ్వజం
- పశ్చిమ కనుమలు పర్యావరణపరంగా సున్నితమైనవంటూ 2011లో నివేదిక
- అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు, మైనింగ్‌పై ఆంక్షలు విధించాలని సూచన
- తిరస్కరించిన కేరళ రాజకీయ పార్టీలు
- ఇప్పటికీ అమలు చేయని ప్రభుత్వాలు

2

పోర్టులో 'భూ'చోళ్లు!

కోరగాని కంపెనీలకు కాకినాడ యాంకరేజ్ పోర్టు భూములు

వ్యాపారం పేరుతో లీజుకు తీసుకుని ఏళ్ల తరబడి ఖాళీగానే

వైసీపీ ప్రభుత్వంలో మంత్రి అనుచరుడి కోసం కేటాయింపు

మేట్ మెరైన్ కంపెనీ పేరిట ఐదెకరాలకు పైగా అప్పగింత

జీఎమ్మార్, శక్తిగ్యాస్, ఈస్ట్ వెస్ట్ మెరైన్ కంపెనీలదీ అదేబాట

ఒక్కో కంపెనీ రూ.7.50 కోట్లకు పైగా లీజు బకాయిలు

కారుచౌక ధరలతో భూములు కొట్టేసి డబ్బులు కట్టని వైనం

భూములు వినియోగించుకునే కంపెనీలకు భారీ లీజుల బాదుడు

338 ఎకరాలు రూ.1,500 కోట్లకు గత వైసీపీ సర్కారు తాకట్టు



మాజీ మంత్రి వేణు అనుచరుడికి కేటాయించిన పోర్టు భూమి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడలో అత్యంత విలువైన ప్రభుత్వ యాంకరేజ్ పోర్టు భూములు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. ఉత్పత్తి లేని కంపెనీల చేతుల్లో చిక్కి విలవిల్లాడుతున్నాయి. ఒకపక్క లీజు పేరుతో ఎప్పుడో కారుచౌకగా భూములను కొట్టేసిన కంపెనీలు... వాటిని పోర్టు ఆధారిత కార్యకలాపాలకు వినియోగించకుండా, అటు రూ.కోట్ల లీజులు చెల్లించకుండా డ్రామాలాడుతున్నాయి. ఒకపక్క తమ కంపెనీ అవసరాలకు భూములు లీజుకు ఇవ్వాలని పలు సమర్థ కంపెనీలు అడుగుతున్నా పట్టించుకోకుండా గత వైసీపీ పాలనలో కీలక నేతలు అడ్రస్ లేని తమ అనుయాయ కంపెనీలకు అడ్డగోలుగా భూకేటాయింపులు చేసుకున్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు అనుచరుడి కంపెనీకి అయిదెకరాలు కట్టబెట్టేశారు. ఆ కంపెనీ ఇప్పటికీ ఉత్పత్తే మొదలుపెట్టకుండా భూములను ఖాళీగా పెట్టింది. శక్తిగ్యాస్, ఈస్ట్‌వెస్ట్ మెరైన్ తదితర కంపెనీలు ఎప్పుడో భూములు తీసుకుని ఖాళీగా ఉంచేశాయి. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వం యాంకరేజ్ పోర్టు అభివృద్ధికి

మిగతా 3వ పేజీలో...

శ్రీశైలం ఫుల్.. సాగర్‌లో ఇంకా సగం ఖాళీ



శ్రీశైలానికి 'ప్లంజ్ పూల్' దెబ్బ!

భారీ గొయ్యితో డ్యాం పునాదులు, గట్లకు ముప్పు!

2009లో 25.5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద.. నాటి నుంచి అధ్యయనాలతోనే సరి

భారీ గొయ్యితో ప్రమాదమని ఈ ఏడాది ఫిబ్రవరిలో తేల్చిచెప్పిన ఎన్‌డీఎస్‌ఏ బృందం

డ్రిప్-2 కింద రూ.203 కోట్లివ్వాలని కేంద్రానికి డ్యాం ఇంజనీర్ల ప్రతిపాదనలు

అయినా రూపాయి కూడా రాని వైనం.. నేడు ప్రాజెక్టును సందర్శించనున్న చంద్రబాబు

మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించాలని సాగునీటి నిపుణుల డిమాండ్

11

భీమిలి బీచ్ భూములపై విజయసాయి పంజా

ఆక్రమణలంటూ నాడు విశాఖ-భీమిలి రోడ్‌లో ప్రైవేట్, టీడీపీ ఆస్తుల కూల్చివేత

11

కానీ అక్కడే విజయసాయి నిర్మాణ పనులు

భీమిలి బీచ్‌లో కుమార్తె పేరిట భూమి

నిర్మాణం కుదరదన్న కోర్టు.. జీవీఎంసీ నోటీసు

96 మంది డీఎస్పీలు 'బదిలీ'

57 మందికి నో పోస్టింగ్

శాంతి భద్రతల విభాగంలోనే 35 మంది బదిలీ

11

సాయం కోసం బేలీ వంతెనలు

వయనాడ్‌లో బురద ప్రవాహంలో చిక్కుకుపోయినవారిని రక్షించేందుకు, రోడ్డు మార్గాలు పూర్తిగా ధ్వంసమైన చోట బాధితులకు సహాయం అందించేందుకు సహాయక బృందాలు ఉక్కుతో నిర్మించే తాత్కాలిక వంతెనలను ఉపయోగిస్తున్నాయి. వీటిని బేలీ వంతెనలు అంటారు. వరదలు సంభవించినప్పుడు ప్రాణనష్టాన్ని తగ్గించడంలో ఇవి చాలా కీలకంగా మారాయి. ఈ వంతెనలను చిన్న, తేలికైన వస్తువులతో వేగంగా నిర్మించవచ్చు.
వయనాడ్‌లో ఈ బ్రిడ్జిల నిర్మాణానికి పరికరాలను ఢిల్లీ, బెంగళూరు నుంచి తరలించారు. వీటికి బ్రిటన్ సివిల్ సర్వెంట్ డొనాల్డ్ బెయిలీ రూపకల్పన చేశారు. ఆయన పేరు మీదుగానే వీటికి బెయిలీ బ్రిడ్జి అని పేరు వచ్చింది. ఈ తరహా వంతెనలను బ్రిటిష్ సైనికులు రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఉపయోగించడం విశేషం.



ఎక్కడ చూసినా విషాదమే


చూరల్‌మల ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో వారి ఆందోళన.. భయాన్ని, నిస్సహాయతను స్పష్టంగా చెబుతున్నాయా? అన్నట్లుగా ఉన్న ఆ మృతదేహాల కళ్లు..! ఇవీ కొండచరియలు బీభత్సం సృష్టించిన కేరళలోని వయనాడ్ జిల్లా.. ముండక్కై, చురల్‌మలలో సహాయక సిబ్బందికి బుధవారం ఎదురైన దృశ్యాలు..! వయనాడ్ విషాదంలో మృతుల సంఖ్య 270కు పెరిగినట్లు, మరో 240 మంది జాడను ఇంకా గుర్తించాల్సి ఉందని కేరళ మీడియా వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని పేర్కొంది. అయితే.. భారీ వర్షాలు, దట్టమైన పొగమంచు కారణంగా.. సహాయక చర్యలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకే నిలిపివేయాల్సి వచ్చిందని విపత్తు నివారణ అధికారులు వెల్లడించారు. బుధవారం సాయంత్రానికి 143 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయినట్లు తెలిపారు. వీరిలో 89 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. 148 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు.

ఎక్కడ చూసినా మృతదేహాలే..

బుధవారం ఉదయం సహాయక చర్యలు ప్రారంభమయ్యాక.. ఎక్కడ చూసినా మృతదేహాలు కనిపించాయని సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు తెలిపాయి. చలియార్ నదిలో కొట్టుకొచ్చిన మృతదేహాల సంఖ్య 52గా ఉన్నట్లు వెల్లడించాయి. ముండక్కై, అట్టమల, చురల్‌మలలో 72 వరకు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు, వేర్వేరు ప్రాంతాల్లో 1000 మందిని కాపాడి, సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నాయి. "ఆర్మీ శునకాలు మృతదేహాలను గుర్తించడంలో కీలకంగా ఉపయోగపడుతున్నాయి. అయితే, బురద, భారీ బండరాళ్ల కారణంగా వాటిని వెలికితీయలేకపోయాం. ఎక్స్‌కవేటర్‌లు వస్తే గానీ, బండరాళ్లను, కుప్పకూలిన కాంక్రీట్ దిబ్బలను తొలగించలేం" అని ఓ అధికారి జాతీయ మీడియాకు వివరించారు. ముండక్కైలో 150 వరకు ఇళ్లు ఉండగా.. వాటిల్లో 65 పూర్తిస్థాయిలో నేలమట్టమైనట్లు తెలిపారు. శిథిలాలను తొలగిస్తేగానీ లోపల ఎంత మంది ఉన్నారనేది తెలియదని పేర్కొన్నారు. చురల్‌మలలో కూడా నదికి సమీపంలో ఉన్న నీళ్లు నేలమట్టమైనట్లు వెల్లడించారు. కాగా, వయనాడ్ ఘటనపై జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) స్పందించింది. ఈ విపత్తుపై సుమోటోగా కేసును స్వీకరించింది. మరోవైపు, వయనాడ్‌లోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదముందంటూ అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. హెచ్చరికలు జారీ చేసినట్లుగానే.. కన్నడిపుళ, విలంగాడు, చురల్‌మల ప్రాంతాల్లో మధ్యాహ్నం కొండచరియలు విరిగిపడ్డాయి. ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణనష్టం జరగలేదని అధికారులు పేర్కొన్నారు.

ముందే హెచ్చరించాం: అమిత్‌షా

కేరళలో కొండచరియలు విరిగిపడే ప్రమాదముందని ముందే హెచ్చరించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో వెల్లడించారు. "ఈ ముప్పు గురించి జూలై 23నే అప్రమత్తం చేశామన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పౌరులను సకాలంలో తరలించలేదు. వయనాడ్ విషాదాన్ని ఎదుర్కొనేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం బాసటగా నిలుస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ కోరారు. దీనిపై అమిత్‌షా స్పందించలేదు. మరోవైపు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా వయనాడ్ బాధితులకు సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాహుల్, ఆయన సోదరి ప్రియాంక వయనాడ్‌లో పర్యటించనున్నారు.

ప్రముఖుల సాయం

వయనాడ్ విపత్తుపై ప్రముఖ వ్యాపారవేత్తలు స్పందించారు. సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.5 కోట్ల చొప్పున విరాళాలు ఇస్తామని లులూ గ్రూప్ చైర్మన్ ఎంఎ యూసుఫ్ అలీ, రవి పిళ్లై, కల్యాణ్ జ్యువెల్లర్స్ యజమాని కల్యాణరామన్, విజింజం పోర్ట్ అదానీ గ్రూప్ ప్రకటించాయి. తమిళ నటుడు విక్రమ్ రూ.20 లక్షల సాయాన్ని ప్రకటించారు. ఒమన్ సుల్తాన్ పాలకుడు సుల్తాన్ హైతం-బిన్-తారీఖ్ వయనాడ్ ఘటనపై ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రాష్ట్రపతి ముర్ము కూడా కొండచరియలు విరిగిపడి పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అంతా అబద్ధం: విజయన్

లోక్‌సభలో అమిత్‌షా చేసిన ప్రకటనను కేరళ సీఎం విజయన్ ఖండించారు. బుధవారం ఆయన తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. "ప్రమాదం జరిగిన రోజు తెల్లవారు జామున మాత్రమే రెడ్ అలెర్ట్ జారీ అయ్యింది. అమిత్‌షా చెప్పిన దాంట్లో వాస్తవం లేదు. ఇది ఒకరిపై మరొకరు నిందలు వేసుకునే సాయం కాదు. కేంద్ర ప్రభుత్వం వారం రోజుల నుంచి వయనాడ్‌కు ఆరెంజ్ అలెర్ట్ మాత్రమే జారీ చేసింది. కానీ, భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయానికి (గడిచిన 48 గంటల్లో) 57.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది" అని పినరయి వ్యాఖ్యానించారు.

బెంగళూరు నుంచి వయనాడ్‌కు హనీమూన్ కోసమని వెళ్లిన రెండు జంటల్లో ఇద్దరు గల్లంతయ్యారు. ఒడిశాకు చెందిన రెండు జంటలు వయనాడ్‌లోని ఓ రిసార్టులో బస చేశాయి. రాత్రి నిద్రలో ఉండగానే రిసార్టు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. ఒడిశా నుంచి బెంగళూరుకు వచ్చిన రెండు జంటలు.. బెంగళూరులో ఓ కారు అద్దెకు తీసుకొని వయనాడ్ వెళ్లారు. ఆ కారును హావేరికి చెందిన డ్రైవర్ మంజునాథ్ నడిపారు. ఆ రాత్రి రిసార్టుకు 300 మీటర్ల దూరంలో మంజునాథ్ కారులోనే నిద్రించాడు. కారుకు జీపీఎస్ ఉండడంతో అక్కడి ప్రమాదకర పరిస్థితుల కారణంగా కారు యజమాని సచిన్‌కు మెసేజ్ చేరింది. అర్ధరాత్రి కారు ఆన్ కావడంతో డ్రైవర్ మంజునాథ్‌కు ఆయన ఫోన్ చేశారు. 'మీరున్న ప్రాంతంలో ఏదో ప్రమాదం జరుగుతోంది' అని అప్రమత్తం చేశారు. రిసార్టు సమీపంలోనే చామరాజనగరకు చెందిన ఓ కుటుంబం నివసిస్తోందని, వారిని సంప్రదించాలని సూచించారు. మంజునాథ్ అక్కడికి వెళ్లేలోగా సచిన్.. చామరాజనగర్‌కు చెందిన నలుగురిని అప్రమత్తం చేశారు. దీంతో, ఆ ఇంట్లో ఉన్న అందరూ అర్ధరాత్రి బయటకు వచ్చి దూరంగా పరిగెత్తారు. ఆ తరువాత కాసేపటికే ఇల్లు నీటిలో కొట్టుకుపోయింది.

ఐదుగురిని కాపాడిన ఫోన్ కాల్


సివిల్స్ అభ్యర్థులు చనిపోయిన రావూస్ స్టడీ సర్కిల్ ఎదుట నిలిచిన వరద

లోకం తీరు



నేడు వయనాడ్... నాడు కోడిపుంజువలస

- 18 ఏళ్ల క్రితం ఏపీలోని గిరిజన గ్రామంపై విరుచుకు పడిన కొండచరియలు
- 19మంది సజీవ సమాధి

అరకులోయ, జూలై 31: కేరళలోని వయనాడ్‌లో బురదతో కూడిన వరద ముంచెత్తడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. సరిగ్గా ఇలాంటి ఘటనే 18ఏళ్ల క్రితం నాటి విశాఖపట్నం జిల్లా అరకులోయ మండలం శిరగాం పంచాయతీ కోడిపుంజువలస గ్రామంలో చోటుచేసుకుంది. 2006 ఆగస్టు 3వ తేదీ అర్ధరాత్రి అందరూ గాఢనిద్రలో ఉండగా కొండచరియలు విరుచుకుపడ్డాయి. వాయుగుండం ప్రభావంతో అప్పటికే 4రోజులుగా భారీవర్షాలు కురుస్తుండటంతో వరద బురద రూపంలో పోటెత్తింది. దీంతో 19మంది సజీవ సమాధి అయ్యారు. గ్రామానికి కిలో మీటరు దూరంలో ఉన్న చౌంపికొండ పైనుంచి బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చాయి. వరద ఉధృతికి మూగజీవాలతో పాటు చాలామంది నిద్రలోనే దిగువనున్న గెడ్డలోకి కొట్టుకుపోయారు. అదే తరహాలో 2014 అక్టోబరు 8న హుద్‌హుద్ తుఫాన్ వల్ల మాదల పంచాయతీ మేదరశాల గ్రామంపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు సజీవసమాధి అయ్యారు. నాటి ఘటనలను ఈ ప్రాంతవాసులు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.

మానవ చర్యల వల్లే..

వయనాడ్ విలయానికి కారణం అదే.. కేరళలో తరచూ ప్రమాదాలు అందుకే

పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ ధ్వజం

మనిషి అత్యాశకు పోయి ప్రకృతితో ఆటలాడితే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది! అలనాటి కేదారనాథ్ వరదల నుంచి.. కేరళను ఏటా కుదిపేస్తున్న వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటి ఉత్పాతాలన్నీ ఇందుకు ఉదాహరణలే. పశ్చిమ కనుమల స్థితిగతులపై అంచనా వేయడానికి 2010 మార్చిలో అప్పటి కేంద్ర పర్యావరణ శాఖ ఏర్పాటు చేసిన 14 సభ్యుల కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన మాధవ్ గాడ్గిల్ అదే మాట చెబుతున్నారు. మంగళవారం నాడు వయనాడ్‌ను వణికించిన విలయం మానవుల పాపాల ఫలితమేనని ఆయన తేల్చిచెప్పారు. అద్భుతమైన జీవావరణానికి, అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్న జీవజాతులకు ఆలవాలమైన పశ్చిమ కనుమలను.. పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన (ఎకలాజికల్లీ సెన్సిటివ్) మూడు జోన్లు(ఈఎస్‌జెడ్ 1, 2)గా విభజించాలంటూ ఆయన నేతృత్వంలోని కమిషన్ 2011 ఆగస్టు 31న కేంద్రానికి నివేదిక ఇచ్చింది. దేశ పడమటి తీరాన గుజరాత్ నుంచి తమిళనాడు దాకా ఆరు రాష్ట్రాల పరిధిలో విస్తరించి ఉన్న పశ్చిమ కనుమల్లో దాదాపు 70 శాతం ప్రాంతంలో ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలకూ, మైనింగ్‌కు, అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని గాడ్గిల్ కమిషన్ తన నివేదికలో సూచించింది. ఈఎస్‌జెడ్-1లో మైనింగ్ అనుమతులను తగ్గించుకుంటూ వెళ్లి.. 2016 నాటికి అక్కడ మైనింగ్‌ను పూర్తిగా నిషేధించాలని.. రెండుజోన్లలోనూ 2015 నాటికి ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని, 2020 నాటికి అన్ని రకాల క్రిమిసంహారక పురుగుమందుల వినియోగాన్ని నిషేధించాలని సూచన చేసింది. తాజాగా ప్రమాదం జరిగిన ప్రాంతం గాడ్గిల్‌కమిషన్ గుర్తించిన జోన్-1 లోనిదే కావడం గమనార్హం. ఇక, ఈఎస్‌జెడ్-2లో మాత్రం మైనింగ్ కార్యకలాపాలను అత్యంత కఠినమైన ఆంక్షలతో కొనసాగించవచ్చని, ఎప్పటికప్పుడు మైనింగ్‌పై సోషల్ ఆడిట్ నిర్వహించాలని కమిషన్ సూచించింది. రెండు జోన్లలోనూ.. కొత్తగా ఎలాంటి డ్యాములు, రైల్వే లైన్లు, పెద్ద పెద్ద రహదారులు నిర్మించకూడదని.. అటవీ భూమిని అటవీయేతర అవసరాలకు మళ్లించడంపైన నిషేధం విధించాలని.. పశ్చిమ కనుమల్లో 75% ప్రాంతాన్ని పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతంగా ప్రకటించాలని, అక్కడ ఏ ప్రాజెక్టుకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ అనుమతులు ఇవ్వరాదని ఇలా సూచనలు చేసింది.





పార్టీలకతీతంగా ఆగ్రహం

కేరళలో అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సర్కారు, ప్రతిపక్ష పార్టీలు, సైరో-క్యాథలిక్ మలబార్ చర్చ్.. ఆ నివేదిక అమలును ఆపేయాలంటూ సుప్రీంకోర్టు దాకా వెళ్లాయి. కానీ, సర్వోన్నత న్యాయస్థానం వారి అభ్యర్థనను తోసిపుచ్చింది. అప్పటి కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ అత్యవసరంగా అఖిలపక్ష సమావేశం నిర్వహించి.. గాడ్గిల్ కమిషన్ నివేదికను తిరస్కరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, వామపక్షాలు.. ఇలా పార్టీలకు అతీతంగా కేరళలో రాజకీయ నాయకులందరూ కమిషన్ నివేదికను చెత్తగా అభివర్ణించారు. ఆ ప్రాంతవాసుల జీవనోపాధి గురించి పట్టించుకోకుండా కమిషన్ ఆ నివేదిక ఇచ్చిందని.. పర్యావరణ పరిరక్షణ పేరుతో ఆ నివేదిక పశ్చిమ కనుమల ప్రాంతంలో అభివృద్ధిని పూర్తిగా నిలిపివేస్తుందని మండిపడ్డారు. దీంతో, కేంద్రం గాడ్గిల్ కమిషన్ నివేదికను పరిశీలించడానికి ప్రముఖ స్పేస్ సైంటిస్ట్ డా.కస్తూరి రంగన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి వర్కింగ్ గ్రూపును నియమించింది. కానీ.. కస్తూరి రంగన్ కమిటీ కూడా జోనల్ వర్గీకరణలో చిన్నచిన్న మార్పులు సూచించింది. పశ్చిమకనుమల్లో 37% ప్రాంతాన్ని (గాడ్గిల్ కమిషన్ సూచించిన 75 శాతంలో సగం ప్రాంతం) పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంగా ప్రకటించాలనే సవరణతో ఆ నివేదికను ఆమోదించింది. కానీ, ఇప్పటికీ ఆ ఈఎస్‌జెడ్‌లను నోటిఫై చేయకపోవడం గమనార్హం. కాగా, కస్తూరి రంగన్ కమిటీ సూచించిన చిన్నచిన్న మార్పులను సైతం మాధవ్ గాడ్గిల్ వ్యతిరేకించారు. ఆ చిన్నచిన్న వెసులుబాట్లు కూడా పశ్చిమ కనుమలకు తీరని నష్టం చేస్తాయని హెచ్చరించారు. తన హెచ్చరికలను కేరళ సర్కారు పట్టించుకోలేదని.. అందుకే ఆ రాష్ట్రంలో తరచుగా ప్రకృతి ఉత్పాతాలు సంభవిస్తున్నాయని గాడ్గిల్ బుధవారం పేర్కొన్నారు. - సెంట్రల్ డెస్క్

జీవవైవిధ్యానికి పట్టుగొమ్మ

పశ్చిమ కనుమలు.. మన భారతదేశ మ్యాప్‌లో పడమటివైపున గుజరాత్ నుంచి మొదలై మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, కేరళ మీదుగా తమిళనాడులోని కన్యాకుమారి దాకా.. 1600 కిలోమీటర్ల పొడవున ఒక పచ్చటి గీతలాగా విస్తరించిన పర్వత శ్రేణులు! దేశ జనాభాలో 40% భూభాగానికి... దాదాపు 24.5 కోట్ల జనాభాకు నీటివనరులను అందించే జలప్రదాతలు ఈ పశ్చిమ కనుమలు. కృష్ణా, గోదావరి, కావేరి వంటి ప్రధానమైన నదులకు.. తుంగ, భద్ర, భీమా, మలప్రభ, ఘటప్రభ, హేమావతి, కాబిని వంటి ఉపనదులకు పుట్టినిల్లు. అంతరించే ముప్పును ఎదుర్కొంటున్న జీవుల జాబితాలో ఉన్న 325 జీవజాతులు ఈ పశ్చిమకనుమల్లో ఉన్నాయి. ఇంతటి జీవవైవిధ్యానికి, పర్యావరణ అద్భుతాలకు ఆటపట్టయిన పశ్చిమ కనుమలపై మనిషి అత్యాశ అనే పడగ నీడ ఉన్నంతకాలం అవి ప్రమాదంలో ఉన్నట్టే! వాటితోపాటే మనుషులు కూడా ప్రమాదంలో ఉన్నట్టే!!

పూజా ఖేద్కర్‌పై వేటు

- ట్రైనీ ఐఏఎస్‌గా నియామకం రద్దు
- మళ్లీ పరీక్షలు రాయకుండా నిషేధం



న్యూఢిల్లీ, జూలై 31: మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్‌పై యూపీఎస్సీ వేటు వేసింది. ట్రైనీ ఐఏఎస్‌గా ఆమె ఎంపికను రద్దు చేయడంతో పాటు జీవితంలో మళ్లీ అన్ని ప్రవేశ పరీక్షలు/యూపీఎస్సీ సెలెక్షన్స్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది. యూపీఎస్సీకి పూజా ఖేద్కర్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్టు రుజువు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బుధవారం అధికారులు వెల్లడించారు. 34 ఏళ్ల పూజపై ఆరోపణల నేపథ్యంలో 2009-2023 మధ్య ఐఏఎస్ స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసిన 15 వేలమందికి పైగా అభ్యర్థుల డేటాను పరిశీలించినట్టు ప్యానల్ వెల్లడించింది.

వ్యవస్థలోని ఖేద్కర్‌లనూ గుర్తించాలి

- సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్

హైదరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పూజా ఖేద్కర్‌పై యూపీఎస్సీ అనర్హత వేటువేయడంపై సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సభర్వాల్ స్పందించారు. ఇప్పుడు వ్యవస్థలోని పూజా ఖేద్కర్‌లనూ గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. యూపీఎస్సీ చైర్మన్‌గా కొత్త సారథి వచ్చినందున ఇందులో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని, తప్పులను దిద్దుబాటు చేయాల్సిన బాధ్యత ఆమెపై ఉందన్నారు.

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతిసూదన్

న్యూఢిల్లీ, జూలై 31: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) చైర్‌పర్సన్‌గా ప్రీతిసూదన్ నియమితులయ్యారు. ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా ఉన్న ఆమె ఆగస్టు 1న ఈ మేరకు బాధ్యతలు స్వీకరించనున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రీతి సుదన్ 1983 బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2020 జూలై వరకు మూడేళ్ల పాటు కేంద్ర ఆరోగ్య కార్యదర్శిగా ఆమె సేవలందించారు. కాగా, వ్యక్తిగత కారణాల వల్ల జూలై 4న యూపీఎస్సీ చైర్మన్ పదవికి మనోజ్ సోని రాజీనామా చేశారు.

గాలి మనవైపే

- ఆ రాష్ట్రాల్లో గెలిస్తే దేశంలో రాజకీయ మార్పు
- మెజారిటీ తగ్గినా మోదీ పాఠాలు నేర్వలేదు
- మతవిద్వేషం కొనసాగిస్తున్నారు: సోనియా


బుధవారం పార్లమెంటు ఆవరణలో సోనియా, రాహుల్


న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్మన్ సోనియాగాంధీ అన్నారు. మరో 2-3 నెలల్లో మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని.. మనం మంచి పనితీరును ప్రదర్శిస్తే జాతీయ రాజకీయాల్లో పరివర్తనం ఖాయమని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఎన్నికల్లో కూడా ప్రతిఫలించాలని చెప్పారు. బుధవారమిక్కడ సీపీపీ సమావేశంలో ఎంపీలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. 'కాంగ్రెస్ ఇక తన వేగాన్ని ఆపకూడదు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేస్తూనే ఉండాలి. అతి విశ్వాసం గానీ, ఉదాసీనత గానీ కూడదు. దేశంలో పార్టీకి అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. అందరూ ఒకే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేయాలి' అని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ గణనీయంగా పడిపోవడం చూసి మోదీ ప్రభుత్వం పాఠాలు నేర్చుకుంటుందని భావించామని.. కానీ వారు మతాలను విడదీసే విధానం కొనసాగిస్తున్నారని.. భయం, విద్వేష వాతావరణాన్ని వ్యాప్తి చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో విద్యావ్యవస్థను కుప్పకూల్చారని ఆరోపించారు. జాతీయ భద్రత ఆందోళనకరంగా ఉందని.. జమ్మూకశ్మీర్లో మళ్లీ తీవ్రవాదం ప్రబలుతోందని అన్నారు. ఇదిలా ఉండగా, ఉభయసభల్లో సమర్థంగా మాట్లాడారంటూ రెండు సభల్లో ప్రతిపక్ష నేతలైన రాహుల్ గాంధీ, ఖర్గే, ఇతర నేతలను సోనియా అభినందించారు. ఆర్థిక, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో బడ్జెట్ విఫలమైన తీరును వారు బాగా ఎండగట్టారని కొనియాడారు. బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా అసంతృప్తి నెలకొందన్నారు. "2021లో జరిపించాల్సిన జనగణనను చేపట్టే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోంది. దేశ జనాభా సంఖ్య, ముఖ్యంగా దళితులు, ఆదివాసీల సంఖ్య గురించి అంచనా లేదు. యూపీఏ ప్రవేశ పెట్టిన ఆహార భద్రతా చట్టం పేరు మార్చి 'ప్రధాని గరీబ్ కల్యాణ్ అన్న యోజన'గా వ్యవహరిస్తున్నారు' అని విమర్శించారు.

మోదీపై సభా హక్కుల తీర్మానం

న్యూఢిల్లీ, జూలై 31: ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో సభా హక్కుల తీర్మానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ మేరకు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు పంజాబ్ మాజీ సీఎం, కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ బుధవారం ఫిర్యాదు చేశారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ సభలో చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను సభాపతి రికార్డుల నుంచి తొలగించారని, అయితే ఆ తొలగించిన వ్యాఖ్యలతో సహా మొత్తం ప్రసంగం వీడియోను మోదీ 'ఎక్స్'లో పోస్టు చేయడం దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆ ఫిర్యాదు లేఖలో చన్నీ పేర్కొన్నారు. కాగా, ఇండియా కూటమి మురికి రాజకీయాలను బహిర్గతం చేస్తూ... వాస్తవాలు, హాస్యచతురతతో అనురాగ్ ఠాకూర్ చేసిన ప్రసంగాన్ని తప్పనిసరిగా వినాలంటూ ప్రధాని ఎక్స్‌లో కితాబిచ్చారు.

హమాస్ చీఫ్ హనియా హతం

- హెజ్‌బొల్లా కమాండర్ షుక్ర్ కూడా
- టెహ్రాన్‌లో హనియా ఇంటిపై క్షిపణి దాడి
- ప్రతీకారం తప్పదన్న హమాస్



బీరుట్, జూలై 31: ఇజ్రాయెల్‌కు శత్రువులు, ఇద్దరు కీలక వ్యక్తులు కొన్ని గంటల వ్యవధిలోనే హతమయ్యారు. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా(62)ను ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హతమార్చగా.. హెజ్‌బొల్లా కమాండర్ ఫాద్ షుక్ర్‌ను బీరుట్‌లో మట్టుపెట్టారు. హనియా హత్యపై ఇజ్రాయెల్ స్పందించలేదు. మరోవైపు హెజ్‌బొల్లాపై ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరిస్తున్న ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి లెబనాన్ రాజధాని బీరుట్‌పై క్షిపణులు ప్రయోగించింది. తమ దేశంపై ఇటీవల రాకెట్ దాడికి పాల్పడి.. 12 మంది చిన్నారులు, యువత మృతికి కారణమైన హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ కమాండర్ ఫాద్ షుక్ర్ లక్ష్యంగా ఈ దాడి జరిపింది. ఈ దాడిలో తమ షుక్ర్ మరణించినట్లు బుధవారం రాత్రి హెజ్‌బొల్లా ప్రకటించింది. టెహ్రాన్‌లోని హనియా ఇంటిపై కూడా క్షిపణి దాడి జరిగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ దాడిలో హనియా, ఆయన అంగరక్షకుడు మృతి చెందినట్లు వెల్లడించారు. హనియా ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై ఇంటికి వచ్చిన తర్వాత దాడి జరిగినట్లు చెబుతున్నారు. హమాస్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. దీన్ని ఇజ్రాయెల్ దాడిగా అభివర్ణించింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హనియా ముగ్గురు కుమారులు, నలుగురు మనవళ్లు, మనవరాళ్లు మరణించినట్లు అప్పట్లో హమాస్ ప్రకటించింది. హనియా, షుక్ర్ హత్యలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరగనున్నాయి. గాజాలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం మరిన్ని ప్రాంతాలకు విస్తరించే ముప్పు ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

జీవిత, వైద్య బీమాలపై జీఎస్టీ తొలగించండి

ముంబై, జూలై 31: జీవిత బీమా, వైద్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. నాగపూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం నేతలు.. బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలను తనకు విన్నవించారని, అందులో వారు ప్రధానంగా జీవిత, వైద్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని ఉపసంహరించాలని డిమాండ్ చేశారని గడ్కరీ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ రెండు బీమా ప్రీమియంలపై జీఎస్టీ 18 శాతంగా ఉందని, వాటిపై జీఎస్టీ విధించడమంటే జీవితంలోని అనిశ్చిత పరిస్థితులపై పన్ను విధించడమేనని ఆయన అన్నారు. కుటుంబానికి భరోసా కల్పించే ఉద్దేశంతో జీవిత బీమాను కొనుగోలు చేస్తుంటారని, అలాంటి ప్రీమియంలపై పన్ను విధించకూడదని ఉద్యోగుల సంఘం భావిస్తోందని చెప్పారు.

రాయల్టీని తిరిగి చెల్లిస్తే పీఎస్‌యూలు దివాలా

న్యూఢిల్లీ, జూలై 31: గనులు, ఖనిజాలపై ఇప్పటి వరకూ వసూలు చేసిన రాయల్టీని తమకు చెల్లించాలంటూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న డిమాండ్‌ను కేంద్రం వ్యతిరేకించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. రాష్ట్రాలు కోరుతున్నట్లు, 1989 నుంచి ఇప్పటి వరకూ వసూలు చేసిన రాయల్టీని చెల్లించాల్సి వస్తే, అది దాదాపు రూ.70 వేల కోట్లు అవుతుందని, మైనింగ్ రంగంలో ఉన్న పలు ప్రభుత్వ రంగసంస్థలు దివాలా తీస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. గనులు, ఖనిజాలపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలదేనని జూలై 25వ తేదీన 9మంది సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 1989 నుంచి ఇప్పటి వరకూ ఈ 35 ఏళ్లలో కేంద్రం భారీ ఎత్తున వసూలు చేసిన రాయల్టీని తమకు చెల్లించేలా ఆదేశించాలని ఝార్ఖండ్ తదితర రాష్ట్రాలు ధర్మాసనాన్ని కోరాయి.

విశాఖలో ముందుకొస్తున్న సముద్రం

- 2040 నాటికి 5శాతం భూభాగం కడలిపాలు: సీఎస్‌టీఈపీ

ముంబై, జూలై 31: వాతావరణ మార్పులతో పెరుగుతున్న సముద్ర మట్టాలు తీరాలను వడివడిగా కబళిస్తున్నాయని ఓ అధ్యయనం తెలిపింది. విశాఖలో సముద్రం ముందుకొస్తున్నదని హెచ్చరించింది. ఇదే పరిస్థితి కొనసాగితే 2040 నాటికి విశాఖ నగరంలో ఐదు శాతం భూభాగం సముద్రంలో కలిసిపోతుందని తెలిపింది. ఇక.. ముంబై నగరం అప్పటికి 10 శాతం పైగానే తన భూభాగాన్ని కోల్పోతుందని తెలిపింది. ముంబై, విశాఖ సహా సముద్ర తీరాలు కలిగిన దేశంలోని 15 నగరాలపై బెంగళూరుకు చెందిన అధ్యయన సంస్థ 'స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ) పరిశీలన జరిపి ఒక నివేదికను విడుదల చేసింది. పలు చారిత్రక కారణాలు, వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావం ఈ నగరాలపై ఎలా ఉండబోతోందనేది ఈ సంస్థ పరిశీలించింది. దాని ప్రకారం, అత్యధికంగా ముంబై నగరంలో 1987-2021 మధ్యకాలంలో గరిష్ఠంగా 4.440 సెంటీమీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. విశాఖలో ఈ కాలంలో 2.381 సెంటీమీటర్ల భూభాగం సముద్రంలో కలిసిపోయింది. ఈ రెండు నగరాలతోపాటు చెన్నై, తిరువనంతపురం, ఉడిపి, పూరి, పారాదీప్, కొచ్చి, మంగళూరు, కోజికోడ్, హల్దియా, కన్యాకుమారి, పణజి, తూత్తుకూడి, యానాం నగరాలపై ఈ పరిశీలనలు సాగాయి.

పోర్టులో 'భూ'చోళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

ఏమాత్రం సహకరించకపోగా ఏకంగా 388 ఎకరాల పోర్టు భూములు తాకట్టుపెట్టి రూ.1,500 కోట్ల అప్పు తెచ్చింది.


నిరుపయోగంగా శక్తి గ్యాస్ కంపెనీకి కేటాయించిన భూములు

వినియోగించరు.. ఖాళీ చేయరు..

కాకినాడ నగరానికి అతి సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే యాంకరేజ్ పోర్టు ఉంది. దీనికి కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజక వర్గాల పరిధిలో 600 ఎకరాలకుపైగా సొంత భూములున్నాయి. ఈ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం, సిమెంటు, మొక్కజొన్న భారీగా ఎగుమతి అవుతాయి. దీనికి సంబంధించి గోదాముల నిర్మాణం, సముద్రపు కాలువ వెంబడి మధ్యతరహా నౌకలు, బార్జీల తయారీ చేపట్టే కంపెనీలకు భూములను పోర్టు లీజుకు ఇస్తుంది. వీటిని వినియోగించుకుని ఆయా కంపెనీలు పోర్టు అధారిత కార్యకలాపాలు చేపట్టాలి. ఇలా ఇప్పటివరకు జీఎంఆర్ 15 ఎకరాలు, ఈస్ట్‌వెస్ట్ మెరైన్ కంపెనీ 8 ఎకరాలు, శ్రీశక్తి గ్యాస్ 6ఎకరాల చొప్పున లీజుకు తీసుకున్నాయి. దాదాపు 12 నుంచి 15ఏళ్లు గడుస్తున్నా ఈ కంపెనీల కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. దీంతో ఆ భూములన్నీ నిరుపయోగంగా మారాయి. వాస్తవానికి ఈ కంపెనీలకు ఎకరాకు ఏడాదికి రూ.3.19లక్షల చొప్పున లీజుకు పోర్టు భూములు కేటాయించింది. కానీ ఈ కంపెనీలు లీజు చెల్లించకుండా మొండికేశాయి. ఈస్ట్‌వెస్ట్ మెరైన్ కంపెనీ 15ఏళ్ల నుంచి భూములు ఖాళీ చేయలేదు సరికదా, రూ.20 కోట్లకు పైగానే లీజు బాకీలు కట్టలేదు. శక్తి గ్యాస్ కంపెనీ కొన్నేళ్ల కిందట గ్యాస్ ఆధారిత ట్యాంకు నిర్మించి పక్కన పడేసింది. అటు భూములు వినియోగించకపోగా, రూ.2.93 కోట్ల వరకు లీజు డబ్బులు బాకీ పడింది. జీఎంఆర్ సంస్థ తను తీసుకున్న భూముల్లో ఎప్పుడో ఫ్లోటింగ్ విద్యుత్ ప్లాంట్ నిర్మించి, వదిలేసింది. కొన్నేళ్లుగా భూములు ఖాళీ చేయడం లేదు. ఈ కంపెనీ ఇప్పటివరకు రూ.7.70కోట్ల వరకు లీజు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇలా భూములు వినియోగించకుండా, లీజు డబ్బులు చెల్లించకుండా అనేక సంస్థలు చుక్కలు చూపిస్తున్నాయి. ఆ భూముల లీజు రద్దుచేసి వేరొకరికి ఇవ్వాలని పోర్టు అధికారులు ప్రయత్నం చేశారు. అయితే సదరు కంపెనీలు గత ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో వాటి జోలికి వెళ్లడం మానేశారు.

అనర్హులకు భూ కేటాయింపులు

పోర్టు భూములను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అధికారులు వైసీపీ ప్రభుత్వంలో అనర్హులకు అడ్డగోలుగా కేటాయించేశారు. అప్పటి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అనుచరుడి కంపెనీ అయిన మేట్ మెరైన్‌కు ఏడాదిన్నర కిందట ఐదెకరాల పోర్టు భూములను కారుచౌకగా కట్టబెట్టేశారు. ఈ సంస్థ నౌకల నిర్మాణం చేపడుతుందని, ఇందుకు భూమి అవసరమని అప్పటి మంత్రి ఒత్తిడి చేయడంతో అధికారులు భూములు కేటాయించేశారు. కానీ ఇంతవరకు ఈ కంపెనీ వాటిని వినియోగించకుండా ఖాళీగా వదిలేసింది. ఇదిలా ఉంటే కాకినాడ పోర్టు భూములకు బయట అనేక కంపెనీల నుంచి డిమాండ్ భారీగా ఉంది.. కానీ వీటికి కేటాయింపులు మాత్రం జరగడం లేదు. అటు ఇప్పటికే సమర్థంగా పనిచేస్తోన్న కంపెనీలకు సైతం చాలినంత భూమి ఇవ్వడం లేదు. స్థానికంగా ఉన్న కొన్ని కంపెనీలు భారీగా ఉపాధి కల్పిస్తూ ఎకరంన్నర స్థలాల్లోనే నౌకల నిర్మాణాలు చేపడుతున్నాయి. వీటికి ఏడాదికి ఎకరా లీజుకు ఏకంగా రూ.11.75 లక్షలు బాదేస్తున్నారు. దీంతో తమకు తగిన ప్రోత్సాహం లేదని చిన్న సంస్థలు వాపోతున్నాయి.

ప్రోత్సాహం లేకపోగా తాకట్టు

కాకినాడ యాంకరేజ్ పోర్టు అత్యంత పాతది. దీన్ని ఆధునికీకరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. కానీ గత వైసీపీ పాలనలో ఈ పోర్టును పూర్తిగా గాలికి వదిలేశారు. ఏటా కోట్ల ఆదాయం ఇస్తున్నా దీని ఆలనాపాలనా పట్టించుకోలేదు. పోర్టు భూములపై కన్నేసిన జగన్ ప్రభుత్వం గుట్టుగా 388 ఎకరాలు ఎస్‌బీఐకి తాకట్టు పెట్టేసి రూ.1,500కోట్లు అప్పు తెచ్చేసింది. పోనీ ఈ అప్పుతో పోర్టును బాగు చేసిందా అంటే అదీ లేదు. ఇతర పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేసే నెపంతో ఇక్కడి భూములను తాకట్టు పెట్టేయడం విశేషం.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వయనాడ్ విలాపం

కేరళలోని వయనాడ్‌జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఏకంగా గ్రామాలకు గ్రామాలు ఆనవాళ్ళు లేకుండా పోయాయి. వందలాది ఇళ్ళు నేలమట్టమై, మొత్తం కుటుంబాలు ప్రాణాలు వదిలేసిన ఘోర విషాదం ఇది. బురదలో చిక్కుబడిన మృతదేహాలను వెలికి తీయడం అత్యంత కష్టమైపోతున్నది. వందలాదిమందిని ఒకేసారి ముంచేసిన ఈ అతిపెద్ద విపత్తులో సహాయక చర్యలు మరింత కాలం కొనసాగక తప్పదు.

విపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలను సమస్యలు వెంటాడినప్పుడు కేంద్ర మంత్రుల స్పందన సామాన్యంగా ఉండదు. గత చరిత్రనంతా తవ్వితీసి అక్కడి పాలకులు అసమర్థులనీ, బధిరులనీ విరుచుకుపడతారు. విషాద సమయాల్లో ఈ తుచ్ఛరాజకీయాలేమిటని ఉపన్యాసాలు ఇస్తూనే వయనాడ్ దారుణంమీద కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు రాజకీయ యుద్ధం చేసుకుంటున్నాయి. భయంకరమైన వర్షాలు పడతాయనీ, కొండచరియలు విరిగిపడి ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయనీ ఎంతో ముందుగా హెచ్చరించినా పినరయ్ ప్రభుత్వం పెడచెవినపెట్టిందని హోంమంత్రి దాడికి దిగారు. ఆయన మాటలు కేంద్రప్రభుత్వాన్ని సమర్థించుకోవడానికి పరిమితం కాలేదు. తాము హెచ్చరించినా రాష్ట్రప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు, ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నదని చెప్పినా సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా వారి కర్మానికి వారిని వదిలివేసినట్టు ఆయన వ్యాఖ్యలు అర్థాన్నివ్వడంతో పినరయ్ సమర్థింపులతో పాటు విమర్శలకు కూడా దిగారు. ఎవరిది నిజం అన్న ప్రశ్నను అటుంచితే, భారీ వర్షాలు కురుస్తాయని కేంద్రం వారం ముందుగానే హెచ్చరించివుండవచ్చు, ఎన్డీఆర్ఎఫ్‌ను సైతం పంపివుండవచ్చు కానీ, ఒక్కసారిగా హెచ్చిన ముప్పును ముందుగా అంచనావేయడం కష్టమైన విషయమే. కేంద్రం తన హెచ్చరికలో పేర్కొన్న వర్షపాతానికీ, కొద్దిగంటల్లోనే కురిసిన కుంభవృష్టికీ హస్తిమశకాంతరం ఉన్నది. ఆ మూడు రంగుల హెచ్చరికలు తమకు ఏయే దశలో ఎప్పుడెప్పుడు అందాయో, అప్పటికే అక్కడ జరిగిందేమిటో పినరయ్ వివరించారు. అంతమాత్రాన రుతుపవనాల కాలంలో ప్రతీ హెచ్చరికనూ తీవ్రంగా తీసుకోవాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించలేదు.

కేరళలోని పద్నాలుగు జిల్లాలో పదిజిల్లాలు కొండచరియలు విరిగిపడే ప్రమాదం అధికంగా ఉన్నవి. ఏడేళ్ళకాలంలో దేశం మొత్తం మీద 3782ఘటనలు జరిగితే, అందులో 2239 ఘటనలు కేరళలోనే జరిగాయి. ఏటా కేరళలోని ఏదో ఒకజిల్లాలో కొండచరియలు విరిగిపడి కొందరు మరణించడం జరుగుతూంటుంది. వర్ష విషాదాలు దానిని వెన్నాడుతూనే ఉంటాయి. 2018 ఆగస్టులో వర్ష బీభత్సం వందలాది ప్రాణాలు తీసింది, లక్షల మందిని పునరావాస శిబిరాలకు తరలించాల్సివచ్చింది. ఒక ఏడాది రాష్ట్ర బడ్జెట్ అంత ఆర్థిక నష్టాన్ని మిగల్చిన విషాదం ఇది.

వయనాడ్‌లో ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా ఉన్న ప్రాంతాలన్నీ ఇప్పుడు నేలమట్టమైపోయాయి. పెను విషాదం కమ్మేసిన ఈ ప్రాంతాలన్నీ పర్యాటకులు మెచ్చినవే. పెరుగుతున్న పర్యాటకం, తదనుగుణంగా సాగుతున్న భారీ నిర్మాణాలు సున్నితమైన ఈ ప్రాంతాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నమాట నిజం. ఆచరణకు దూరంగా మిగిలిపోయిన గాడ్గిల్ కమిటీ నివేదికలను ఇలాంటి విషాదాలు సంభవించినప్పుడల్లా స్మరించుకోవడం వినా ఏమీ జరగడం లేదు. ప్రకృతితో చెలగాటం ఎంత ప్రమాదకరమో, వాతావరణమార్పు ఎంతటి ఉపద్రవాన్ని సృష్టిస్తుందో ఈ ఘటన గుర్తుచేస్తోంది. వేడెక్కిన అరేబియా సముద్రం కుంభవృష్టికీ ఎడతెగని భారీ వర్షాలకూ కారణమవుతోంది. ఒక ఆనకట్ట ఒక్కసారిగా బద్దలైనట్టుగా ఏకంగా ఎనిమిదికిలోమీటర్ల మేరకు కొండచరియలు కొట్టుకు రావడం, భారీ పరిమాణంలో నీరూ, బురదా ప్రజలను సజీవంగా కప్పివేయడం ఇప్పటివరకూ అరుదు.

బిల్లులు సమర్పించలేదనీ, నిధులు సక్రమంగా వినియోగించలేదనీ అభ్యంతరాలు వెలిబుచ్చుతూ నిధుల విడుదలలో అడపాదడపా ఆటంకాలు కల్పిస్తున్న కేంద్రప్రభుత్వం ఈ విషాదసమయంలో కేరళపట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వయనాడ్ ఘోరాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న విపక్షపార్టీల అభ్యర్థనను పరిశీలించి, కేరళను భారీ ఆర్థికసాయంతో ఆదుకోవాలి. మిగతారాష్ట్రాలు తమకు తోచిన సాయం చేస్తున్నాయి, ధనికులూ ప్రముఖులూ విరాళాలు ప్రకటిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సహా, అన్ని రకాల సహాయసహకారాలు ఉంటాయని హామీ ఇచ్చిన కేంద్రప్రభుత్వం తక్షణమే నిధుల విడుదలతో ఈ కష్టంనుంచి బయటపడేవరకూ రాష్ట్రాన్ని కాపుగాయాల్సిన అవసరం ఉంది.



ఇంత గొప్ప కీర్తిని సొంతం చేసుకున్నా ఎక్కడా ఉద్వేగానికి, ఆవేశానికి చోటివ్వని మను భాకర్ పరిపక్వత, పతకం సాధించిన తర్వాత గీతాశ్లోకాన్ని (కర్మణ్యే వాధికారస్తే..) గుర్తుచేసిన తీరు ప్రతి భారతీయుడినీ ఉద్వేగానికి గురిచేసింది. ప్యారిస్ వేదికపై రెండు ఒలింపిక్స్ మెడల్స్ సాధించి, జాతీయంగా, అంతర్జాతీయంగా గొప్ప పేరు తెచ్చుకోవడంతోపాటుగా, కేంద్ర ప్రభుత్వ TOPS (టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్) పథకం ద్వారా అందుతున్న సానుకూల ఫలితాలకు చక్కటి ఉదాహరణగా నిలిచిందీ యువ తరంగం.

అమృతకాలపు స్ఫూర్తిపతాక ‘మను’

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మ ఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణీ

“పని చేయాల్సిన బాధ్యత మాత్రమే నీది. ఫలితాన్ని ఆశించే హక్కు నీది కాదు. అలాగని నీ పని చేయడం మాత్రం ఆపొద్దు. ప్రతిఫలాన్ని ఆశించకుండా పని చేయాలి,” ఇది కురుక్షేత్రం వేదికగా పార్థుడికి శ్రీకృష్ణ పరమాత్ముడు చేసిన గీతాబోధలోనిది. గత రెండు రోజులుగా ఈ శ్లోకం ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. దీనికి కారణం మను భాకర్ అనే భారత యువ కెరటం. 2024 ఒలింపిక్స్‌లో దేశానికి తొలి పతకాన్ని అందించడంతోపాటుగా ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత క్రీడాకారిణిగా, షూటింగ్‌లో భారతదేశానికి పతకం తీసుకొచ్చిన తొలి మహిళగా రికార్డు సృష్టించిందీ యువతరంగం. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలను గెలవడం స్వతంత్ర భారత చరిత్రలోనే ఇది తొలిసారి.

ఇంత గొప్ప కీర్తిని సొంతం చేసుకున్నా ఎక్కడా ఉద్వేగానికి, ఆవేశానికి చోటివ్వని మను భాకర్ పరిపక్వత, పతకం సాధించిన తర్వాత గీతాశ్లోకాన్ని (కర్మణ్యే వాధికారస్తే..) గుర్తుచేసిన తీరు ప్రతి భారతీయుడినీ ఉద్వేగానికి గురిచేసింది. దేశం కోసం కష్టపడటం మాత్రమే నాకు తెలుసు, ఫలితం నా చేతిలో లేదని ఒక్క మాటలో ఆమె చెప్పిన తీరు 140 కోట్ల మంది భారతీయుల గుండెలను గర్వంతో నింపింది. ప్యారిస్ వేదికపై రెండు ఒలింపిక్స్ మెడల్స్ సాధించి, జాతీయంగా, అంతర్జాతీయంగా గొప్ప పేరు తెచ్చుకోవడంతోపాటుగా, కేంద్ర ప్రభుత్వ TOPS (టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్) పథకం ద్వారా అందుతున్న సానుకూల ఫలితాలకు చక్కటి ఉదాహరణగా నిలిచిందీ యువ తరంగం. ప్రపంచ క్రీడావేదికల మీద భారత్ సామర్థ్యాన్ని పెంచేలా అవసరమైన ప్రోత్సాహాన్ని, వసతులను కల్పించడం కోసం 2014లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ TOPS పథకం అనుకున్న లక్ష్యాల దిశగా వెళ్తోందని మరోసారి నిరూపితమైంది.

2018 కామన్వెల్త్ గేమ్స్ క్రీడల్లో బంగారు పతకాన్ని సాధించి అందరి దృష్టినీ ఆకర్షించిన మను భాకర్ కెరటం సామర్థ్యానికి కేంద్ర ప్రభుత్వం TOPS పథకం చేయూతనందించింది. దీంట్లో భాగంగా మను భాకర్ శారీరక, మానసిక, నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందుకుంది. ‘2020 టోక్యో ఒలింపిక్స్’ టార్గెట్‌గా మిషన్ మొదలైంది. అంతా సరిగ్గానే జరుగుతోందనుకున్న సమయంలో టోక్యో ఒలింపిక్స్‌లో మను పిస్టల్ మాల్‌ఫంక్షన్ (మొరాయించడం) కారణంగా పతకం చేజారింది. కానీ ఆమె ఏ మాత్రం కలత చెందలేదు. ఇవాళ పతకం గెలిచిన తర్వాత ఎంత స్థితప్రజ్ఞతనైతే ప్రదర్శించిందో అదే పరిపక్వతను టోక్యో పతకం చేజారిన తర్వాత కూడా చూపించింది.



‘కర్మణ్యే వాధికారస్తే..’ అన్నట్లుగా తన వంతుగా 100 శాతం ప్రయత్నించింది. ఫలితం గురించి కలత చెందకుండా తర్వాతి ఈవెంట్లపై దృష్టిసారించింది. ప్యారిస్ ఒలింపిక్స్ కోసం పూర్తిగా సన్నద్ధమైంది. టాప్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ మానసికంగా మరింత దృఢత్వాన్ని పొందడంపై దృష్టిసారించింది. దీని ఫలితమే ప్యారిస్ వేదికగా ముచ్చటగా మూడు ఘనతలను తన ఖాతాలో వేసుకుంది.

2014లో TOPS పథకాన్ని ప్రారంభించిన తర్వాత ఇలాంటి ఆణిముత్యాలను వెలికితీసి సానబెట్టే ప్రయత్నం జోరందుకుంది. అథ్లెట్లు, ప్లేయర్ల క్రీడానైపుణ్యాన్ని సానబెట్టేందుకు అవసరమైన ఆర్థిక సహకారం, ప్రపంచస్థాయి కోచింగ్, అత్యాధునిక స్పోర్ట్స్ సైన్స్ సపోర్ట్, ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించడం వంటివాటితోపాటుగా, వారి శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంచేందుకు జరిగిన ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తోంది. టాప్స్ పథకంలో భాగంగా భారతదేశ మిషన్ ఒలింపిక్స్ సెల్ (MOC) అనే ఓ కమిటీని ఏర్పాటుచేసి ఇందులో మాజీ అథ్లెట్లు, కోచ్‌లు, వివిధ క్రీడాసంఘాలకు సంబంధించిన సమర్థులైన అధికారులను కేంద్రం నియమించింది. ఈ ఏర్పాట్ల ద్వారా క్రీడాకారులు పథకాలు సాధించేందుకు ఏమేం కావాలి, వాటిని ఎలా సమకూర్చాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఖేలో ఇండియా, టాప్స్ వంటి పథకాల ప్రభావంతో 2023 ఆసియా క్రీడల్లో 107 మెడల్స్ సాధించిన భారత దేశం, ప్రపంచ క్రీడావేదికలపై ‘హమ్ కిసీసే కమ్ నహీ’ అన్నట్లుగా ముందుకెళ్తోంది.

టాప్స్ పథకం ఎలా పనిచేస్తుందనడానికి ఒక ఉదాహరణ బ్యాడ్మింటన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్స్ మెడలిస్ట్ పీవీ సింధు. తెలుగుతేజమైన పీవీ సింధు మూడోసారి ఒలింపిక్స్ పతకాన్ని సాధించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలనూ కేంద్ర ప్రభుత్వం టాప్స్ ద్వారా కల్పించింది. ఈ యువ క్రీడాకారిణి సామర్థ్యాన్ని మరింతగా పెంచేందుకు 12 మంది ప్రత్యేక నిపుణుల బృందం ఆధ్వర్యంలో జర్మనీ–ఫ్రెంచ్ సరిహద్దుల్లోని ‘సార్ బ్రూకెన్’ అనే పట్టణంలో సింధుకు బూట్ క్యాంప్ ఏర్పాటుచేసి శిక్షణనిస్తున్నారు. ఇది కేంద్రప్రభుత్వ క్రీడాభివృద్ధి సంకల్పానికి ఒక ఉదాహరణ. టేబుల్ టెన్నిస్ చాంపియన్ మానికా బాత్రా ప్రాక్టీస్ కోసం పారిస్ వాతావరణం లాగా బాల్ బౌన్సింగ్, పేస్, స్పిన్ ఉండే ఇంపోర్టెడ్ టేబుల్ టెన్నిస్ బల్లను సిద్ధం చేశారు. హార్స్ రైడింగ్‌లో భాగమైన ఈక్వెస్ట్రేన్ పోటీలో పాల్గొనే అనుష్ అగర్వాల్ కోసం ఆయన గుర్రానికి అవసరమయ్యే ప్రత్యేక ఫీడ్, బ్లాంకెట్లు, బూట్స్, సాడిల్స్ వంటివి సమకూర్చారు. ఇలా ప్రతి క్రీడాకారుడికి అవసరమైన వసతులను సమకూర్చి ఒలింపిక్స్ పథకాలు సాధించడమే లక్ష్యంగా ‘టాప్స్’పై చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోంది. ఇందుకోసం ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా ఖర్చుచేసింది.

టాప్స్‌లో ఇప్పటివరకు 230 మంది అథ్లెట్లకు 40కి పైగా పారాఅథ్లెట్లు శిక్షణ పొందారు. ప్రస్తుతం 120మంది అథ్లెట్లు, 60కి పైగా పారా అథ్లెట్లు శిక్షణ పొందుతున్నారు. వీరంతా కోర్ టీమ్ కాగా మరో 130 మంది అథ్లెట్లు డెవలప్‌మెంట్ స్టేజ్‌లో ఉన్నారు.

ఇలాంటి పథకాల ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం జరుగుతుండగానే దేశంలోనే మొట్టమొదటి స్పోర్ట్స్ యూనివర్సిటీని రూ.634.34 కోట్లతో మణిపూర్‌లో కేంద్రం ఏర్పాటుచేసింది. స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మ్యానుఫ్యాక్చరింగ్, కోచింగ్, స్పోర్ట్స్ సైకాలజీ వంటి కీలకమైన అంశాలపై ఈ యూనివర్సిటీ ప్రత్యేక దృష్టి సారించింది. దీంతోపాటుగా కేంద్రం క్రీడాభివృద్ధికోసం బడ్జెట్ విషయంలో రాజీలేని నిర్ణయాలు తీసుకుంటోంది. దీని ఫలితాలు క్షేత్రస్థాయిలో కనబడుతున్నాయి. చాలా మంది ఔత్సాహికులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇవాళ దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా ‘ఖేలో ఇండియా’ కేంద్రాలు, 30కి పైగా ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’లు పనిచేస్తున్నాయి. ఖేలో ఇండియాలో భాగంగా రూ.2,168 కోట్లతో దేశవ్యాప్తంగా క్రీడారంగంలో చేపట్టిన మౌలికవసతులు ఔత్సాహిక యువతకు నిరంతరం ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి. ఖేలో ఇండియా ద్వారా గుర్తించబడి అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చిన 28 అథ్లెట్లు ఇవాళ పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నారు.

మోదీ ప్రభుత్వ ప్రయత్నాల కారణంగానే మను భాకర్, సరబ్ జోత్, నీరజ్ చోప్రా, పీవీ సింధు, లవీనా బోర్గోహైన్, మీరాబాయి చానూ, నికత్ జరీన్ వంటి క్రీడాకారులు దేశం కోసం మెడల్స్ తీసుకొచ్చారు. భారత హాకీ జట్టు కూడా 41 ఏళ్ల తర్వాత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకుంది. ఇదే స్ఫూర్తితో ప్యారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత జట్టు సత్తా చాటి 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను సాకారంచేస్తారనే బలమైన విశ్వాసం నాకుంది. ఈ క్రీడోత్సవాల ఫలితాలు ఎలా ఉంటాయనేదానికన్నా భారతదేశంలో క్రీడాభివృద్ధికి, రేపటి క్రీడా బంగారు భవిష్యత్తుకు బాటలు పడుతుండటం చాలా సంతోషకరమైన విషయం.


■ జి. కిషన్ రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

తల్లుల గర్భశోకం, దయలేని లోకం!

హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హానియేను టెహరాన్‌లో ఆయన బస చేసిన చోటనే రాకెట్ దాడితో హత్య చేశారు. ఇది దుర్మార్గమైన యూదు ఉన్మాద హత్య అని హమాస్ చెబుతోంది. ఇంకా ఒప్పుకోలేదు కానీ, ఇది ఇజ్రాయిల్ చేసిన హత్యే అని తెలిసిపోతోంది. ప్రపంచంలో చెడును తగ్గించడానికి ఇదే సరైన పద్ధతి అని ఇజ్రాయిల్ మంత్రి ఒకరు ట్వీట్ చేశారు కూడా. పాలస్తీనా పోరాట చరిత్రలో ఇటువంటి హత్యలు పెద్ద ఆశ్చర్యం ఏమీ కాదు. కానీ, ఇటువంటి బోరవిరుపు, అంతర్జాతీయ సమాజాన్ని ఖాతరు చేయని తనం మాత్రం పశ్చిమాసియా సంఘర్షణలోనే కాదు, ప్రపంచమంతటా కూడా పెరిగిపోతున్న ధోరణి. ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రమాణస్వీకారానికని హానియే ఇరాన్ వెళ్లారు. మన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పాటు హానియే కూడా ఆ వేడుకలో పాల్గొన్నారు. ప్రమాణకార్యక్రమం తరువాత అర్ధరాత్రి ఈ హత్య జరిగింది. ఒకపక్కన శాంతిచర్చలు జరుగుతుండగా, అమెరికా ఎన్నికల్లో సైతం పాలస్తీనా సమస్య ప్రముఖ అంశంగా పరిణమిస్తుండగా, ఈ హత్య జరిగింది. దీనికి గొలుసుకట్టు పర్యవసానాలు అనేకం ఉంటాయి. ఈ ఏడు గ్లోబల్ రాజకీయాలు మరింత ఉద్రిక్తం అవుతాయి.

చంపుతామని ఇజ్రాయిల్ ముందే చెప్పింది. చిట్టచివరి హమాస్ సభ్యుడిని చంపేవరకు వదిలిపెట్టబోమని చెబుతూనే ఉంది. ఇక అధినేతను వదులుతుందా? ఏ టర్కీలోనో, ఖతార్‌లోనో ఉండగా చంపవచ్చుకదా? ఎందుకు చేయలేదు? పోయిన ఏడాది అక్టోబర్ 7నాడు హమాస్ చేసిన హత్యాకాండ వెనుక ఇరాన్ దన్ను ఉందని ఇజ్రాయిల్‌కూ, లోకానికీ కూడా తెలుసు. ఇరాన్ గడ్డ మీదనే, హమాస్ నేతను చంపి చూపించాలని ఇజ్రాయిల్ అనుకున్నది. ‘గుస్ గుస్ కే మారా’ అని తన గురించి నాయకుడు, నాయకుడి గురించి ప్రజలు గర్వంగా చెప్పుకుంటున్న రోజుల్లో, ఇజ్రాయిల్ చర్య సాహసోపేతమైనదిగా, ‘మగతనానికి’ ఆనవాలుగా కనిపించడంలో ఆశ్చర్యం ఉండదు.

ఇజ్రాయిల్ మొదటి నుంచీ దాదాపుగా ఇంతే, 1948లో, 1967లో కూడా ఆ దేశానిది క్రూరమైన తెంపరి తనమే. ఐక్యరాజ్యసమితిని కానీ, ప్రపంచ దేశాల అభిప్రాయం కానీ లెక్కచేయకపోవడమే దాని నైజం. అప్పుడప్పుడు మాట వరసకు పాలస్తీనాకు న్యాయం గురించి, రెండుదేశాల పరిష్కారం గురించి మాట్లాడుతూ, చేతల్లో మాత్రం ఇజ్రాయిల్‌ను పెంచి పోషించింది అమెరికాయే. సోవియట్ రష్యా విచ్ఛిన్నమయిన తరువాత, ఇజ్రాయిల్ ప్రాధాన్యం, దుందుడుకుతనం మరింత పెరిగాయి. ఓస్లో ఒప్పందం ద్వారా పాలస్తీనా ఉద్యమం రెండడుగులు కిందికి దిగినా, ఇజ్రాయిల్ దాన్ని గౌరవించలేదు. మొత్తంగా దేశ మంతటినీ యూదుల సెటిల్‌మెంట్లతో నింపేసి, పాలస్తీనా జీవితాలను అతిచిన్న భూభాగంలో శరణార్థి శిబిరాలకు, లేదా కిక్కిరిసిన జనావాసాలకు పరిమితం చేయడం దాని లక్ష్యంగా ఉంది. ఇజ్రాయిల్ దక్షిణ సరిహద్దులో ఉన్న ఎడారి ప్రాంతంలోకి గాజావాసులను పూర్తిగా తరిమేసి, వారిని అక్కడే ఉంచడం పరిష్కారమన్న జియోనిస్టుల ప్రతిపాదనకు ట్రంప్ ప్రభుత్వం వంతపాడింది కూడా. మరోపక్క, ఆరంభంనుంచి పాలస్తీనా పక్షాన ఉన్న దేశాలు ఒక్కొక్కటిగా జారిపోవడం మొదలుపెట్టాయి. చిట్టచివరగా సౌదీ అరేబియా కూడా ఇజ్రాయిల్‌తో సంబంధాలు పెట్టుకోబోతున్నప్పుడు, దానిని నివారించడానికి హమాస్ గత అక్టోబర్‌లో హంతక దాడులు చేసింది. హమాస్ 1100 మంది ఇజ్రాయిలీలను చంపగా, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ 40 వేల మంది పాలస్తీనియన్లను చంపింది. ఈ లెక్క ఇంకా పెరుగుతోంది.



పశ్చిమాసియా, ఉక్రెయిన్ మాత్రమే కాదు, ప్రపంచమంతా ఒక కొత్త అమానవీయ పతనస్థాయికి చేరుకున్నట్టు కనిపిస్తున్నది. రాజకీయ వ్యూహాలు అతి కర్కశంగా అనైతికంగా మారుతున్నాయి. మన దేశంలోనూ అంతే. మణిపూర్ హాహాకారాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఎంతకీ కదిలించలేదు. దేశరాజకీయాల ప్రాతిపదికన మణిపూర్‌పై స్పందన కూడా చీలిపోయింది. బాధితులనే అన్యాయంగా నిందించే మనుషులు పెరిగిపోయారు. కానీ లెమ్మని, జరగనిమ్మని, జరగవలసిందేనని అనుకుంటున్నారు. అట్లాగే, ఛత్తీస్‌గఢ్.

హానియే హత్య తరువాత ఏం జరుగుతుంది? ఈ ఘాతుకానికి జవాబు తప్పక ఇస్తామని హమాస్ సహజంగానే అంటుంది, అంది. ఇరాన్ కూడా బాధ్యులను కనుగొని చర్యలు తీసుకుంటామని అంది. హమాస్ ఎంతగా ప్రతికూల ప్రచారానికి లోనయిందంటే, ఈ చర్యను నేరుగా ఖండించేందుకు ప్రపంచ నేతల్లో చాలా మందికి నోరు రావడం లేదు. ఒకపక్క చర్చలు జరుగుతుండగా, ఇదేమిటని శాంతిప్రక్రియలో పాలుపంచుకుంటున్న ఖతార్ బాధపడింది. చైనా మాత్రం హత్యను తీవ్రంగా ఖండిస్తూ, తక్షణం కాల్పుల విరమణ జరగాలని కోరింది. తనకు ఎటువంటి సంబంధం లేదని అమెరికా చేతులు దులుపుకుంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

హమాస్, హిజ్బొల్లా వంటి సంస్థల వెనుక ఇరాన్ ఉంటే, ఇజ్రాయిల్ చర్యల వెనుక అమెరికా ఉండాలి కదా? బైడెన్ ప్రభుత్వం ఎంతటి అవకాశవాద వైఖరితో వ్యవహరించి, ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలిచినా, రెండు దేశాల పరిష్కారం మీద, గాజాలో కాల్పుల విరమణ మీద సూత్రప్రాయంగా ఆమోదంతో ఉన్నది. ఒక సందర్భంలో 2000 పౌండ్ల బాంబులను పంపడానికి నిరాకరించింది కూడా. మునుపెన్నడూ లేని విధంగా అమెరికాలో పాలస్తీనాకు మద్దతు పెరిగింది. ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. మరి తన పెద్దన్న దేశానికి ఇబ్బందికరమైన పని ఇజ్రాయిల్ ఎందుకు చేస్తుంది? ఇజ్రాయిల్ ప్రస్తుత తీవ్రవాదానికి అమెరికా అండలో కాక, మరెక్కడైనా మూలాలు ఉన్నాయేమో చూడాలి. బహుశా, ప్రపంచ వ్యవస్థలో ఇప్పుడు ఏకధ్రువత కూడా చెదిరిపోవడం వల్ల పెద్ద దేశాలతో పాటు, కొంత బలమూ బలగమూ ఉన్న అనేక చిన్నా చితకా రౌడీ దేశాలు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నాయనిపిస్తుంది. కాకపోతే, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ అమెరికన్ కాంగ్రెస్‌లో మాట్లాడిన తీరు ఏమిటి? ఒక పక్కన బైడెన్ అతనితో శాంతి చర్చల ప్రక్రియ గురించి మాట్లాడుతుంటే, గాజా మీద బాంబుదాడులు పెంచడమేమిటి? ఇద్దరూ కూడబలుక్కుని చేశారనుకోవడానికి కూడా లేదు. తాను నష్టపోతూ అందుకు అమెరికా ఎందుకు సిద్ధపడుతుంది?

ఏ విలువలూ విధానాలూ లేకుండా పోయిన అంతర్జాతీయ రాజకీయాలలో, పాలస్తీనా సమస్య ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి కొనసాగుతున్న పురాతన అంశం. భారతదేశం సంగతే చూద్దాము. ఇప్పటికీ అధికారికంగా పాలస్తీనాకు రెండు దేశాల పరిష్కారాన్ని భారత్ కోరుకుంటుంది. సార్వభౌమాధికారాన్ని, ప్రతిపత్తిని గుర్తిస్తుంది. కానీ, మరోవైపు 1960లలో రహస్యంగా మొదలుపెట్టి, 1970ల మీదుగా, 1990లలో ఇజ్రాయిల్‌తో అధికారిక సంబంధాలను ఏర్పాటు చేసుకున్నది. బీజేపీ హయాంలో నైతే పట్టపగ్గాలు లేని దౌత్యం మొదలయింది. కానీ, పాలస్తీనాకు మద్దతుగా నిలబడి, ఇజ్రాయిల్ మీద కత్తులు దూస్తున్న ఇరాన్ కూడా భారత్‌కు చాలా గట్టి నేస్తం. మొన్నటి దాకా ఇరాన్ మీద యుద్ధానికి కాలుదువ్విన అమెరికాను అదుపు చేయడంలో రష్యా ముందుంది. ఈ రష్యా భారత్‌కు సోవియట్ కాలం నుంచి కొనసాగుతున్న పాత భల్లూకపు నేస్తం. అమెరికా పక్కన నిలిచీ, దౌత్యాన్ని పెంచీ ఇజ్రాయిల్‌కు అండగా ఉన్నట్టు కనిపిస్తున్న భారత్, మరో కోణంలో, రష్యా పక్కన నిలిచి ఇరాన్‌కు, హమాస్‌కూ కూడా మద్దతు తెలుపుతున్నట్టే. ఈ విదేశాంగ వైఖరుల్లో ఏ విలువలూ లేవు. రేపు ట్రంప్ గెలిస్తే, అతను అనుసరించే తీవ్ర ఇజ్రాయిల్ అనుకూల విధానాలతో బహుశా, రష్యాకు కూడా పెద్ద అభ్యంతరం ఉండదు. ఉక్రెయిన్ మీద అదనంగా నాలుగు బాంబులు వేస్తానని రష్యా అంటే, ట్రంప్ కూడా కాదనడు. ఈ ఇద్దరితో సఖ్యంగా ఉంటూ, పాలస్తీనా విముక్తిని కోరుకుంటూ, ఇజ్రాయిల్ దాడులకు కళ్లు మూసుకుంటూ, ఇండియా లౌక్యంగా మెసలగలదు!

బాహాటంగా రష్యాతోను, చాటుగా చైనాతోను గట్టి స్నేహాలున్న ఇండియాను తొందరపడి దూరం చేసుకోవాలని అమెరికా అనుకోదు. కానీ, ఉక్రెయిన్ మీద రష్యా దాడి విషయంలో భారత్ వైఖరి అమెరికాకు సంతృప్తికరంగా లేదు. ఆ అసంతృప్తిని అతిగా ప్రకటించకుండా, “తలచుకుంటే మోదీ యుద్ధాన్ని ఆపగలరు” అన్న ప్రశంసాత్మక అభిప్రాయాన్ని ప్రచారంలో పెట్టారు. ఎక్కడ మోదీ దానికి ప్రభావితమవుతారో అనుకున్న పుతిన్, మోదీ మాస్కోలో ఉన్నప్పుడే, ఉక్రెయిన్‌లో పిల్లల ఆస్పత్రి మీద బాంబు వేశాడు. దానితో జెలెన్స్కీ మోదీకి నైతికమైన సవాల్ విసిరాడు. మోదీ చాలా ఇబ్బంది పడ్డారు. ఎంతో కొంత అప్రదిష్ట వచ్చిందని గ్రహించో, లేదా, అమెరికాను ఊరడించడానికో మోదీ ఇప్పుడు ఉక్రెయిన్‌కు ఒక ప్రత్యేక యాత్ర చేయబోతున్నారు. మరి అప్పుడు పుతిన్ మరో దాడిచేస్తే? అలా చేయబోమని, అనధికార హామీ ఏదో లభించి ఉండవచ్చు. లేకపోతే, కష్టమే.

ఇక్కడ మళ్లీ అనేక అనుబంధ ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఉక్రెయిన్‌లో పిల్లల మరణాలు మానవీయమైన స్పందనల అవసరాన్ని చాటిచెప్పినప్పుడు, గాజా పట్టీలోని వేలాది మంది పిల్లల చావులు ఎందుకు ఎవరినీ కదలించలేకపోతున్నాయి? దుఃఖాలకు లెక్కలుండకూడదు నిజమే కానీ, అధికారికంగా 1139 మందిని చంపిన అక్టోబర్ 7 నాటి హమాస్ దాడిలో పిల్లలు 33 మంది, మరి ఆ తరువాత ఇజ్రాయిల్ చేసిన ఆకాశ, భూతల దాడుల్లో గాజాలో మరణించిన పిల్లల సంఖ్య 13,800 మంది. ఏ పక్షానికి చెందిన ఏ ఒక్క చిన్నారీ ఈ సంఘర్షణల్లో చనిపోకూడదనే అందరం కోరుకుంటాం. కానీ, పదులకు స్పందించిన గుండెలు, వేల మరణాలకు ఎందుకు మౌనంగా ఉంటున్నాయి?

ఇజ్రాయిల్ మొదటి నుంచీ దాదాపుగా ఇంతే, 1948లో, 1967లో కూడా ఆ దేశానిది క్రూరమైన తెంపరి తనమే. ఐక్యరాజ్యసమితిని కానీ, ప్రపంచ దేశాల అభిప్రాయం కానీ లెక్కచేయకపోవడమే దాని నైజం. అప్పుడప్పుడు మాటవరసకు పాలస్తీనాకు న్యాయం గురించి, రెండుదేశాల పరిష్కారం గురించి మాట్లాడుతూ, చేతల్లో మాత్రం ఇజ్రాయిల్‌ను పెంచి పోషించింది అమెరికాయే.

ఘర్షణలో ఉన్న పక్షాలకు, చంపడానికి, చావడానికీ వాటి సమర్థనలు, కారణాలు వాటికి ఉంటాయి. కానీ, జీవిత పోరాటంలోనే మునిగిపోయిన నిరాయుధులు దాడులకు ఎందుకు లక్ష్యం కావాలి? ఏ పక్షం వైపు న్యాయం ఉన్నదో చెప్పలేకపోవచ్చు, కానీ, అమాయకుల మరణాల గురించి ప్రపంచం ఎందుకు మాట్లాడదు? పశ్చిమాసియా, ఉక్రెయిన్ మాత్రమే కాదు, ప్రపంచమంతా ఒక కొత్త అమానవీయ పతనస్థాయికి చేరుకున్నట్టు కనిపిస్తున్నది. రాజకీయ వ్యూహాలు అతి కర్కశంగా అనైతికంగా మారుతున్నాయి. మన దేశంలోనూ అంతే. మణిపూర్ హాహాకారాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఎంతకీ కదిలించలేదు. దేశరాజకీయాల ప్రాతిపదికన మణిపూర్‌పై స్పందన కూడా చీలిపోయింది. బాధితులనే అన్యాయంగా నిందించే మనుషులు పెరిగిపోయారు. కానీ లెమ్మని, జరగనిమ్మని, జరగవలసిందేనని అనుకుంటున్నారు. అట్లాగే, ఛత్తీస్‌గఢ్. అక్కడి మరణాల గురించి మాట్లాడడానికి నక్సలైట్ల మీదనో, ప్రభుత్వ విధానాల మీదనో ఏదో ఒక వైఖరి అవసరమా? అమాయక ఆదివాసుల మరణాలు సమాజాన్ని కుదిపివేయకూడదా?

రెండవ డిపిఆర్‌తోనే పోలవరం భవిష్యత్తు!

ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలల సౌధం పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించ లేదు. ఆ మాటకొస్తే ఈ పదేళ్ల కాలంలో ఎప్పుడూ బడ్జెట్‌లో నేరుగా నిధులు కేటాయించలేదు. అయితే ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తాము తీసుకొంటున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ హామీ ఏ మాత్రం సరిపోదు. వాస్తవంగా రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 90 మేరకు కేంద్రమే తన నిధులతో పూర్తిగా నిర్మించవలసిన ప్రాజెక్టు ఇది. ఆర్థిక మంత్రి హామీ కన్నా చట్టబద్ధత ఈ పాటికే ఆంధ్రప్రదేశ్ దక్కించుకొని ఉంది. బడ్జెట్‌కు ముందు రోజు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రివర్గం ఆమోదంతో అడ్‌హాక్‌గా 12 వేల కోట్లు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి సంకేతాలు ఇచ్చారు. ఫలితంగానే బడ్జెట్‌లో హామీలు తప్ప, నిధుల కేటాయింపు జరగలేదు.

ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే చంద్రబాబు నాయుడు పోలవరం క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం గొప్పలకు పోకుండా నాలుగేళ్ల నాటికి 41.15 మీటర్ల ఎత్తుకు నిర్మాణం పూర్తి చేస్తానని ప్రకటించారు. ఈ నాలుగేళ్లు కేంద్రం నుండి అడ్‌హాక్‌గా నిధులు తెచ్చి ప్రాజెక్టు నిర్మాణం చేస్తే సరిపోదు. తొలి దశ, రెండవ దశ పక్కన పెట్టి 2019లో సాంకేతిక సలహామండలి ఆమోదించిన డిపిఆర్‌కు ఆమోదముద్ర వేయించుకొంటేనే పోలవరం ప్రాజెక్టు భవితవ్యానికి రక్షణ కవచం ఏర్పడుతుంది.



కేంద్ర ప్రభుత్వం అడ్‌హాక్‌గా నిధులు మంజూరు చేస్తే... కొత్త సీసాలో పాత సారా పోయడం తప్ప వేరు కాదు! గతంలో జగన్మోహన్ రెడ్డి అనుసరించిన తాత్కాలిక విధానాన్నే కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించదలచినట్లవుతుంది. అయితే పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల ఎత్తుకు నిర్మించే వ్యయం మొత్తం కేంద్రమే భరించాలని తాజాగా రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానం చేయడం శుభపరిణామమే. భవిష్యత్తులో రానున్న ప్రమాదాన్ని ముఖ్యమంత్రి గుర్తించినట్లుంది.

2022, జూలై 19వ తేదీన జగన్మోహన్ రెడ్డి సర్కారు పోలవరం ప్రాజెక్టుకు తొలి దశ అనే పేరు బెట్టి 36,449.83 కోట్లతో అంచనాలు రూపొందించి అడ్‌హాక్‌గా పది వేల కోట్లు విడుదల చేస్తే 41.15 మీటర్ల స్థాయికి నిర్మాణం పూర్తి చేస్తానని కోరి ఉన్నారు. కాని కేంద్ర జలసంఘం పరిశీలన అనంతరం ఈ మొత్తాన్ని 31,625.38 కోట్లకు కుదించారు. ఇప్పుడు కేంద్రం కూడా దీన్నే కొనసాగించేందుకు సిద్ధపడినట్లుంది. ప్రాజెక్టు మొత్తంగా డిపిఆర్ ఆమోదం పొందకుండా తొలి దశ, మలి దశ అనే విధానం భవిష్యత్తులో ప్రాజెక్టు మొత్తం 45.72 మీటర్ల స్థాయికి సాఫీగా నిర్మాణం జరిగేందుకు ఎన్నో అగడ్తలను దాటవలసి ఉంటుంది. ప్రాజెక్టుకు రెండవ డిపిఆర్ ఆమోదం పొందాలనే ఉద్దేశంతోనే గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన హయాంలో పెద్ద కసరత్తు చేసి సాంకేతిక సలహా మండలిచే రెండవ డిపిఆర్ ఆమోదం పొంది వున్నారు.

గతంలో కర్నాటకలో బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పర్ భద్ర జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే సమయంలో బడ్జెట్ ముందు కార్యదర్శుల సమావేశం ఆగమేఘాల మీద నిర్వహించి డిపిఆర్ ఆమోదం పొంది జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. తదనంతరమే బడ్జెట్‌లో 5300 కోట్లు కేటాయించారు. నదుల అనుసంధానం కింద చేపట్టిన కెన్ బెత్వా ప్రాజెక్టు అంశంలో కూడా ఇదే విధానం అవలంబించారు. అయితే జాతీయ ప్రాజెక్టు పోలవరం భిన్నంగా ఉంది ప్లానింగ్ కమిషన్ ఆమోదించిన తొలి డిపిఆర్ తప్ప, పదేళ్లు గడిచినా కేంద్రం ఇంతవరకు రెండవ డిపిఆర్ ఆమోదించలేదు. జగన్మోహన్ రెడ్డి అయిదేళ్ల కాలంలో ఏనాడూ రెండవ డిపిఆర్ గురించి పట్టుపట్టని కారణంగా గాడి తప్పింది.


పోలవరం ప్రాజెక్టు పూర్వాపరాల్లోకి వెళ్లితే చంద్రబాబు నాయుడు అధికారం నుండి దిగిపోయే ముందు 2019 ఫిబ్రవరి నెలలో కేంద్ర జలవనరుల శాఖకు చెందిన సాంకేతిక సలహామండలి 2017–18నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం పోలవరం ప్రాజెక్టు రెండవ డిపిఆర్ 55,548.87 కోట్ల రూపాయలకు ఆమోదించింది. తదుపరి అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్టరు మార్పు, అవినీతి వెలికితీత పేరుతో సంవత్సరం కాలం గడిపేశారు. తిరిగి కేంద్ర జలవనరుల శాఖకు చెందిన రివైజ్డ్ కాస్ట్ అంచనాల కమిటీ 2020లో సమావేశమై 2017–18 నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం 47,725.24కోట్లుగానూ ఇందులో సాగునీటి ఖర్చు 35,950.16 కోట్లుగా సవరిస్తూ అదే సమయంలో 2013–14 షెడ్యూల్ రేట్ల మేరకు ప్రాజెక్టు వ్యయం 29,927 కోట్లుగానూ, ఇందులో సాగునీటి వ్యయం 20,398.81 కోట్లుగా తేల్చి.. రెండు డిపిఆర్‌లను కేంద్ర ఆర్థిక శాఖకు పంపింది. 2017లో కేంద్ర మంత్రివర్గం ఆమోదించినదని 2013–14నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం డిపిఆర్ ఆర్థిక శాఖకు పంపినట్లు తెలిపింది. 2020 నుండి ఈ రగడకు పరిష్కారం లభించలేదు. కొంతకాలం 2013–14 నాటి షెడ్యూల్ రేట్లకే కేంద్రం కట్టుబడినట్లు చట్టసభలో ప్రకటనలు వెలువడ్డాయి.

ఇప్పటికైనా కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని చెబుతున్న నోట్‌ను కేంద్రం వెనక్కి తీసుకొనేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేయవలసి ఉంది. చట్టసభలు ఆమోదించిన చట్టానికి కేంద్ర మంత్రివర్గం ఎలా సవరణ చేయగలదని ఏనాడూ జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపాన పోలేదు. అయితే ఇద్దరూ కూడ బలుక్కొని జగన్మోహన్ రెడ్డి సర్కారు ప్రాజెక్టు తొలి దశ 41.15 మీటర్ల ఎత్తు నిర్మాణం తెర మీదకు తెచ్చారు. ఇదిలా ఉండగా జగన్మోహన్ రెడ్డి తన హయాంలోనే వివిధ పనుల కింద హెడ్ వర్క్స్ అంచనాలు పెంచి కాంట్రాక్టు సంస్థకు భారీ ఎత్తున లాభం చేకూర్చారు. తాజాగా మంత్రి వర్గం ఆమోదించినట్లు కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేపట్టాలంటే 990 కోట్ల రూపాయలు అవసరమౌతుంది. కేంద్ర జలసంఘం కూడా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని చెప్పింది. ఈ అదనపు వ్యయాలు ఎవరు భరిస్తారు?

మున్ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పెను సవాలే. ఇప్పుడున్న క్షేత్ర స్థాయి పరిస్థితుల దృష్ట్యా 2017–18 నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం కూడా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి అవకాశాలు చాలా తక్కువ. ఈ దశలోనే కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రాజెక్టు మొత్తం డిపిఆర్ ఆమోదం పొందకపోతే, నాలుగేళ్ల నాటికి రాజకీయంగా ఎవరికి ఎవరో తెలియని అస్తవ్యస్త రాజకీయ పరిస్థితులు దేశంలో నెలకొని వున్న నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు భవితవ్యం గోదావరి వరదల పాలు కాక తప్పదు. క్షేత్రస్థాయి పరిస్థితి అంచనా వేస్తే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భూసేకరణ నష్ట పరిహారం పునరావాసమే అతి పెద్ద సమస్య. 2017–18 షెడ్యూల్ రేట్ల మేరకే సాంకేతిక సలహా మండలి అంచనా 33,108.23 కోట్లు, రివైజ్డ్ కాస్ట్ అంచనాల కమిటీ ప్రకారం 28,172.21 కోట్ల రూపాయలు అవసరం. ఈ మొత్తం కేంద్రం భరించకపోతే ఆంధ్రప్రదేశ్ ప్రజలు పోలవరం ప్రాజెక్టు గురించి మరచిపోవచ్చు.

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా ఉంది. జగన్మోహన్ రెడ్డి మిగిల్చిపోయిన అస్తవ్యస్త ఆర్థిక పరిస్థితి ఊహకందనిదే. రాష్ట్రంలో ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ మెట్ట ప్రాంతాల ప్రజలు ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తుందని గంపెడాశలు పెట్టుకుని ఉన్నారు. వాటికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టుకు ఇంత భారీ స్థాయిలో మరో పదేళ్లు గడిచినా నిధులు ఖర్చు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి వీలు పడదు. ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టుపై అవసరానికి మించి శ్రద్ధ వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితి పరిశీలన అనంతరం గొప్పలకు పోకుండా నాలుగేళ్ల నాటికి 41.15 మీటర్ల ఎత్తుకు నిర్మాణం పూర్తి చేస్తానని ప్రకటించారు. ఈ నాలుగేళ్లు కేంద్రం నుండి అడ్‌హాక్‌గా నిధులు తెచ్చి ప్రాజెక్టు నిర్మాణం చేస్తే సరిపోదు. తొలి దశ, రెండవ దశ పక్కన పెట్టి 2019లో సాంకేతిక సలహామండలి ఆమోదించిన డిపిఆర్‌కు ఆమోదముద్ర వేయించుకొంటేనే పోలవరం ప్రాజెక్టు భవితవ్యానికి రక్షణ కవచం ఏర్పడుతుంది.

• వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు







జనరల్ కష్టాలు..!

రైళ్లలో ప్రయాణం సామాన్యులకు నరకం

సరిపడా జనరల్ బోగీలు లేక జనం విలవిల

- కిక్కిరిసిన బోగీల్లో ప్రమాదకరంగా ప్రయాణం
- పెరుగుతున్న గొడవలు, కొట్లాటలు
- జనరల్ బోగీల కుదింపుతో తంటాలు
- గతంలో 4 జనరల్ బోగీలు.. ఇప్పుడు ఒక్కటే

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వ్యాపారమే పరమావధిగా మారిన రైల్వేకు పేదల ఇబ్బందులు పట్టడం లేదు. లాభార్జన కోసం జనరల్ బోగీలను కుదించడంతో సామాన్య ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. స్లీపర్ కోచ్‌లను కూడా రెట్టింపు సంఖ్యలో కుదించేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. కరోనా తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైల్వే సామాన్యుడికి దూరమవుతూ వస్తోంది. ఓ పథకం ప్రకారం రైల్వేను ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో విజయవాడ రైల్వే పరిధిలోనూ సామాన్య ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పాసింజర్ల రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చేయడం, జనరల్ బోగీలను నాలుగు నుంచి దశలవారీగా ఒక్క బోగీకి తీసుకురావడం, స్లీపర్ కోచ్‌లు 15 నుంచి 5కు పరిమితం చేయడం చేస్తున్నారు. ఏసీ బోగీల సంఖ్యను రెండు, మూడు రెట్లు పెంచుకుంటూ పోతున్నారు. రైళ్లలో సింహభాగం పేద, మధ్య తరగతి వర్గాలే ప్రయాణిస్తుంటారు. కానీ, ధనిక వర్గాలకే ప్రాధాన్యమిచ్చేలా ఏసీ బోగీలను పెంచడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కిక్కిరిసిపోతున్న బోగీలు

విజయవాడ డివిజన్ పరిధిలో ఏ రైలు చూసినా ఒకే ఒక్క జనరల్ బోగీ, ఐదు స్లీపర్ కోచ్‌లు ఉంటున్నాయి. ఇవి సామాన్యులకు సరిపోవట్లేదు. పోనీ కోచ్‌ల్లో ప్రయాణికులకు సరిపడా టికెట్లు ఇస్తున్నారా అంటే అదీ లేదు. పరిమితిని మించి టికెట్లు జారీ చేస్తున్నారు. దీనికితోడు టికెట్ తీసుకోని వారు కూడా జనరల్ బోగీల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఉన్న ఒకే ఒక్క జనరల్ బోగీలో ఇసకేస్తే రాలనంత జనం కనిపిస్తున్నారు. సీట్ల కోసం గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. టాయ్‌లెట్స్ వరకు కూడా కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఆఖరుకు సీట్ల దగ్గర కాళ్లు పెట్టుకునే ప్రాంతంలో కూడా కూర్చోవాల్సి వస్తోంది.



అమృత్ భారత్‌లో పరిస్థితి దారుణం

పేదల కోసం రేటు పెంచి నడుపుతున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఇటీవల విజయవాడకు ఒకటి కేటాయించారు. ఈ రైల్లో అన్నీ సాధారణ సీటింగ్ బోగీలే. ఫస్ట్, సెకండ్, థర్డ్ క్లాస్ అంటూ వర్గీకరించారు. ఈ రైల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. బోగీలన్నీ కిటకిటలాడుతున్నాయి. ట్రెయిన్ రూఫ్‌కు దుప్పట్లను ఉయ్యాలలా కట్టుకుని అందులో కూర్చుంటున్నారు. రైళ్లలో ఒక జనరల్ బోగీని పెంచుతామని ఇటీవల కాలంలో రైల్వే అధికారులు గొప్పగా ప్రకటించారు. కానీ, ఇప్పుడున్న డిమాండ్ దృష్ట్యా కనీసం రైలుకు ఐదు జనరల్ బోగీలనైనా నడపాల్సిన అవసరం ఉంది.

ఇక వెళ్లండి..!

వైసీపీ వీర విధేయ పోలీసులకు ప్రభుత్వం ఝలక్

ఉమ్మడి కృష్ణాలో 12 మంది డీఎస్పీల బదిలీ

- ఒకరిద్దరికి మాత్రమే ప్రాధాన్య స్థానాలు
- మెజారిటీ డీఎస్పీలకు నో పోస్టింగ్
- జగన్‌పై గులకరాయి కేసులో విజయవాడ నార్త్ ఏసీపీ అతి
- జగన్ గుడివాడ పర్యటనలో డీఎస్పీ శ్రీకాంత్ అత్యుత్సాహం
- సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు సహా అంతా డీజీపీ కార్యాలయానికే..



నాడు వైసీపీకి వీర విధేయులుగా వ్యవహరించిన డీఎస్పీలకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. ఉమ్మడి కృష్ణా, పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 12 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. వైసీపీ ప్రభుత్వ పెద్దల మాటలే వేదాలుగా వ్యవహరించిన డీఎస్పీలను గుర్తించిన ప్రభుత్వం వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఎన్నికలకు ముందు ఇక్కడికి వచ్చిన వారిని, అంతకుముందు నుంచే వైసీపీ భజన చేసిన వారిని నేరుగా డీజీపీ కార్యాలయానికి పంపించింది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

వైసీపీ వీర విధేయులకు ఊస్టింగ్

- గుడివాడలో డీఎస్పీగా ఉన్న పి.శ్రీకాంత్.. జగన్ పర్యటన సమయంలో చిన్నచిన్న విషయాలకు తీవ్రంగా స్పందించారు. గుడివాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లను జగన్ లబ్ధిదారులకు అందజేశారు. ఆ సమయంలో టీడీపీ మహిళలు నల్లబెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి వేధించారు. తాజా బదిలీల్లో ఆయన్ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు.
- విజయవాడ సెంట్రల్ ఏసీపీగా ఉన్న పి.భాస్కరరావు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అరెస్టులో కీలకంగా వ్యవహరించారు. సీజీఎస్టీ అధికారుల నుంచి ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదును స్వీకరించి శరత్‌ను అరెస్టు చేశారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీలోని కొంతమంది పెద్దలు దీని వెనుక కథ నడిపారని తెలుస్తోంది. వారు చెప్పిన మాటల ప్రకారం శరత్‌పై కేసును నమోదు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన్ను కూడా డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు.
- గన్నవరం డీఎస్పీ జయసూర్యను భీమవరం డీఎస్పీగా బదిలీ చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడకు భూములిచ్చిన రైతులు పరిహారం కోసం ఆందోళనకు దిగారు. వారిని పరామర్శించడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెళ్లారు. ఆందోళన విరమించాలని హెచ్చరించి రైతులను అరెస్టు చేశారు. ఈ విషయం అప్పట్లో పెనుదుమారాన్ని రేపింది. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో జయసూర్యను భీమవరం డీఎస్పీగా నియమించడంతో కూటమి నేతలు అవాక్కవుతున్నారు.
- అజిత్‌సింగ్‌నగర్‌లో అప్పటి సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి కేసులో విజయవాడ నార్త్ ఏసీపీగా ఉన్న డీఎస్పీ ప్రసాద్ కీలకంగా వ్యవహరించారు. ఈ కేసుతో సంబంధం లేని మైనర్లను ఇరికించే ప్రయత్నం చేశారని విమర్శలు వచ్చాయి. చివరికి ఈ కేసులో నిందితుడిగా వేముల సతీష్‌కుమార్ బెయిల్‌పై జైలు నుంచి విడుదలైనప్పుడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. పోలీసులు తనకు తుపాకీ గురిపెట్టి నేరం అంగీకరించాలని బెదిరించారని ఆరోపించాడు. ఈ కేసులో ఏ2 ఉన్నాడని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఘటన జరిగి ఇన్నాళ్లయినా ఆ ఏ2 ఎవరో ఇప్పటికీ తెలియలేదు. ఇప్పుడు ఆయన్ను డీజీపీ కార్యాలయానికి పంపారు. తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న ఎం.రాజారావును విజయవాడ నార్త్ ఏసీపీగా నియమించారు.

బదిలీలు ఇలా..

కృష్ణాజిల్లా డీపీటీసీ (జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం)లో ఉన్న కె.రమేశ్‌బాబును రాజమహేంద్రవరం సెంట్రల్ డీఎస్పీగా బదిలీ చేశారు. నరసాపురంలో డీఎస్పీగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు కృష్ణాజిల్లా డీపీటీసీకి బదిలీ చేశారు. కృష్ణాజిల్లా దిశ పీఎస్ డీఎస్పీగా ఉన్న యు.నాగరాజును డీజీపీ కార్యాలయానికి పంపారు. గన్నవరం డీఎస్పీ జయసూర్యను భీమవరం డీఎస్పీగా బదిలీ చేశారు. 14వ బెటాలియన్‌లో ఉన్న కె.దామోదర్‌ను విజయవాడ సెంట్రల్ ఏసీపీగా నియమించారు. ఈయన గతంలో ఇక్కడే ఇన్‌స్పెక్టర్‌గా, ట్రాఫిక్ ఏసీపీగా పనిచేశారు. ఆయన్ను మళ్లీ ఇప్పుడు విజయవాడకు తీసుకొస్తున్నారు. విజయవాడ సౌత్ ఏసీపీగా ఉన్న జి.రత్నరాజును డీఎస్ఆర్బీ డీఎస్పీగా బదిలీ చేశారు. రత్నరాజు లోగడ విజయవాడలో ఇన్‌స్పెక్టర్‌గా, రైల్వేలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించినప్పుడు పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆయన్ను డీఎస్ఆర్బీ డీఎస్పీగా నియమించడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. ఇక్కడున్న బీవీఎస్ నాగేశ్వరరావును ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేశారు. విజయవాడ పశ్చిమలో ఉన్న పడాల మురళీకృష్ణారెడ్డిని డీజీపీ కార్యాలయానికి పంపారు. గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా ఉన్న వీవీ నాయుడును విజయవాడ ట్రాఫిక్-1 ఏసీపీగా బదిలీ చేశారు. విజయవాడ ట్రాఫిక్-1 ఏసీపీగా ఉన్న బి.జనార్ధనరావును తెనాలి డీఎస్పీగా నియమించారు. విజయవాడ సీఎస్బీ ఏసీపీగా ఉన్న బి.పార్థసారథిని కుప్పం డీఎస్పీగా పంపారు. విజయవాడ దిశ ఏసీపీగా ఉన్న కె.ప్రకాశ్‌బాబును రాజంపేట డీఎస్పీగా బదిలీ చేశారు. సీఐడీ ఎస్సీ, ఎస్టీ సెల్‌లో ఉన్న వి.మల్లికార్జునరావును దిశ ఏసీపీగా నియమించారు.


తహసీల్దార్ల బదిలీలు వివాదాస్పదంగా మారాయి. ఓవైపు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేయాల్సిందిగా సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేయగా, మరోవైపు బుధవారం అర్ధరాత్రి దాటాక కృష్ణాజిల్లాలో తహసీల్దార్ల బదిలీలు జరగడం గందరగోళంగా మారింది. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల కలెక్టర్లు కూర్చుని, మాట్లాడుకుని బదిలీలు చేసుకోవాల్సి ఉండగా, అదేమీ జరగకుండానే కృష్ణాలో తహసీల్దార్లను బదిలీ చేసేశారు. అక్కడి కలెక్టర్ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారడం, ఇష్టారాజ్యంగా చేయడమే ఈ మొత్తం గందరగోళానికి కారణంగా తెలుస్తోంది.

బదిలీల బంతాట!

గందరగోళంగా తహసీల్దార్ల బదిలీలు

ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రాతిపదికన బదిలీలు జరగాలని ఆదేశాలు

- కృష్ణాజిల్లాలో మాత్రం అర్ధరాత్రి హడావిడిగా బదిలీలు.. వివాదాస్పదం
- కృష్ణా నుంచి ఎన్టీఆర్ జిల్లాకు రావటానికి ఇప్పటికే తారాస్థాయిలో పైరవీలు
- మొన్నటి వరకు ఉన్న తహసీల్దార్ల ప్రాధాన్యతలు తారుమారు
- ప్రసన్నం చేసుకున్న ఎమ్మెల్యేలకు బైబై చెబుతూ వేరే వారి చుట్టూ చక్కర్లు
- ఏం జరుగుతుందో అర్థంకాక గందరగోళంలో ఎమ్మెల్యేలు
- ఈలోగా కృష్ణాలో బదిలీలు జరగడంతో అంతా తికమక



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇతర జిల్లాల నుంచి సొంత జిల్లాలకు వచ్చిన వారికి గతంలో పనిచేసిన పాత మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కలెక్టర్లకు మౌఖిక ఉత్తర్వులు ఇవ్వటం తీవ్ర విమర్శలకు దారి తీసిన సంగతి తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావటంతో నాలుక కరుచుకున్న సీసీఎల్ఏ గతంలో పనిచేసిన నియోజకవర్గంలో కాకుండా వేరేచోట పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. తాజాగా ఉమ్మడి జిల్లాల పరిధిలో బదిలీలు చేపట్టాలంటూ ఆదేశాలు ఇచ్చింది. దీంతో తహసీల్దార్ల బదిలీల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. ఉమ్మడి జిల్లా అంటే గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల కలెక్టర్లు ముగ్గురూ కూర్చుని ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతే బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక కృష్ణాజిల్లాలో 35 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ అక్కడి కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వులు ఇవ్వడం వివాదంగా మారింది. కాగా, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రాతిపదికన తహసీల్దార్ల బదిలీలు అనేసరికి ప్రాధాన్యతలు మారిపోతున్నాయి. దీంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఎన్టీఆర్ జిల్లాపైనే గురి

కృష్ణాజిల్లా పరిధిలో పనిచేసిన వారి చూపంతా ఇప్పుడు ఎన్టీఆర్ జిల్లాపై పడింది. సీసీఎల్ఏ ఆదేశాలతో మొన్నటి వరకు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఫలానా మండలంలో పోస్టు పొందాలని చూసిన వారంతా తాజాగా.. మరో ఆలోచన చేస్తున్నారు. దీంతో మళ్లీ కొత్త ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిన్నటి వరకు తమ దగ్గరకు వచ్చి బతిమాలుకుని, పనిచేయటానికి ఆసక్తి చూపించిన తహసీల్దార్లు ఉమ్మడి జిల్లా అనేసరికి ప్లేటు ఫిరాయిస్తుండటంతో ఎమ్మెల్యేలు కూడా తెల్లబోయే పరిస్థితి ఏర్పడింది. కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లంతా ఎన్టీఆర్ జిల్లాలో పోస్టింగ్‌లు వేయించుకోవటానికి ప్రజాప్రతినిధుల బాట పట్టిన సంగతి తెలిసిందే. నిన్నటి వరకు తమ దగ్గరకు వచ్చిన తహసీల్దార్లు నేడు కనిపించకపోవటం, కొత్త ముఖాలు తమ దగ్గరకు సిఫార్సులకు రావటంతో అసలేం జరుగుతుందో తెలియక ఎమ్మెల్యేలు సైతం కంగారు పడుతున్నారు.

'కృష్ణా'లో అర్ధరాత్రి హడావిడి బదిలీలు

ఉమ్మడి జిల్లా ప్రకారం బదిలీలపై ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల కలెక్టర్లు ముగ్గురు ఏక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అలాకాకుండా కృష్ణాజిల్లా కలెక్టర్ బుధవారం అర్ధరాత్రి ఆదేశాలు ఇచ్చేశారు. గన్నవరం తహసీల్దార్‌గా ఎస్.సీతపవన్‌కుమార్ ఎన్నికల విధుల నిమిత్తం గన్నవరం వచ్చారు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన ఆయన గడువు పూర్తయినా ఇక్కడే మళ్లీ పోస్టింగ్ ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం, రాజనగరంలో పనిచేసి, ఎన్నికల విధుల నిమిత్తం గన్నవరం వచ్చిన ఆయనను ఇంకా కొనసాగించడం వివాదాస్పదమవుతోంది. సీసీఎల్ఏ నుంచి వచ్చిన మోపిదేవి తహసీల్దార్ శ్రీవిద్యను అదే మండలంలో కొనసాగించడం గమనించదగ్గ అంశం. గతంలో మచిలీపట్నం తహసీల్దార్‌గా పనిచేసిన ఆమె ఎన్నికల కోడ్ సమయంలో మచిలీపట్నంలో అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే అంశంలో అనధికారికంగా సంతకాలు చేసి వివాదాస్పదంగా మారారు. బంటుమిల్లి తహసీల్దార్‌గా వీవీ భరత్‌రెడ్డి వస్తారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అందరూ అనుకున్నట్టుగానే ఆయనకు బంటుమిల్లి మండలాన్ని కేటాయించారు. గతంలో బందరు కలెక్టరేట్‌లో దీర్ఘకాలం పనిచేస్తూ ఎన్నికల ముందు, లేదా ఎన్నికల విధుల నిమిత్తం ఇతర జిల్లాలకు వెళ్లిన ఇద్దరు తహసీల్దార్లకు మళ్లీ అక్కడే పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం.

టికేటు గాడు



- కండక్టర్‌లా బస్సెక్కి ప్రయాణికుల నుంచి డబ్బు వసూలు
- ఇప్పుడే వస్తానంటూ టికెట్ డబ్బుతో పరార్
- పీఎన్‌బీఎస్‌లో నయా మోసం

కేటుగాళ్లను చూశాం కానీ, టికేటుగాళ్లను ఎప్పుడైనా చూశారా? నిత్యం రద్దీగా ఉండే నగరంలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో అలాంటి కేటుగాడే ప్రయాణికులను తేలిగ్గా మోసం చేసి పరారయ్యాడు. బుధవారం వేకువజామున 3.30 గంటల సమయంలో గుడివాడ ప్లాట్‌ఫాం వద్ద ఆర్టీసీ బస్సు నిలిపి ఉంచడంతో ప్రయాణికులంతా ఎక్కారు. ఇంతలో ఓ వ్యక్తి బస్సెక్కి టికెట్.. టికెట్.. అనగానే అతనే కండక్టరేమోనని ప్రయాణికులంతా డబ్బు చెల్లించారు. దాదాపు 15 మంది ప్రయాణికుల నుంచి రూ.1,200 వసూలు చేసిన ఆ కేటుగాడు.. ఇప్పుడే వస్తానని బస్సు దిగి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి ఎంతసేపటికీ రాకపోవడంతో మోసపోయామని ప్రయాణికులు గ్రహించారు. వీరిలో గుణదలకు చెందిన దంతనాల బసవాచార్యులు మాత్రం ఈ మోసంపై కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- బస్టాండ్

● తనిఖీ

మైలవరం రూరల్ మండలంలోని కొత్త మంగాపురం, చిలుకూరు వారిగూడెంలో బుధవారం కలెక్టర్ సృజన ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిల్లలకు మధ్యాహ్నం భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.



6లో..

రైల్వేస్టేషన్‌లో అక్రమ వసూళ్లకు బ్రేక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైల్వేస్టేషన్‌లో ఎలక్ట్రానిక్స్ గ్యాడ్జెట్ల విక్రయాలు జరిపే వారి నుంచి అనధికారికంగా ప్రైవేట్ వ్యక్తులు వసూలుచేసే వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పడింది. మాఫియానే భయపడిపోయి అక్రమ వ్యవహారాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేసింది. విక్రయాలు జరపొద్దని అక్రమంగా డబ్బు వసూలుచేసే శివ అనే వ్యక్తి.. గ్యాడ్జెట్ల విక్రయదారులను ఆదేశించాడు. దీంతో ప్రస్తుతం ఈ అనధికార విక్రయాలు, వారి నుంచి వసూలు ఆగిపోయాయి. ఇది తాత్కాలికమే అయినప్పటికీ రైల్వే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం గమనించాల్సిన విషయం. రైల్వేను అడ్డం పెట్టుకుని ఏడాదిన్నరగా రూ.3 కోట్ల వరకు ప్రైవేట్ వ్యక్తులు వసూలు చేస్తున్నా పోలీసులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో రైల్వే అధికారుల ప్రమేయం బయట పడుతుందన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దస్తావేజు నకలు ఇప్పించలేదని దాడి

- కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కలకలం
- ఒకరికి గాయాలు.. కేసు నమోదు



6లో..

కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందరూ చూస్తుండగానే వ్యక్తిపై దాడికి పాల్పడటం కలకలం రేకెత్తించింది. తనకు నకలు ఇప్పించడం లేదంటూ కంకిపాడుకు చెందిన దేవరపల్లి శ్రీనుపై గంగూరుకు చెందిన అబ్దుల్ జావేర్ రెహ్మాన్ పీలర్‌తో దాడి చేశాడు.



పార్లమెంట్ వేదికగా..

సైబర్ దాడుల అదుపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

» బందరు ఎంపీ బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల అదుపుచేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించారు. 2021 నుంచి 2023 సంవత్సరాల్లో 300శాతం సైబర్‌నేరాలు పెరిగినట్టుగా సింగపూర్‌కు చెందిన సెక్యూరిటీ సంస్థ ఇచ్చిన నివేదికపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని ఆయన ప్రశ్నించారు. వివిధ రంగాల్లో సేవల కంపెనీలు, అవుట్‌సోర్సింగ్ (బీపీవోలు), ప్రభుత్వ సంస్థలపై సైబర్‌దాడులు జరిగాయనే విషయంలో వాస్తవాలను ఆయన ప్రశ్నించారు. సైబర్‌నేరాలను అదుపు చేసేందుకు ప్రభుత్వం యోచన చేస్తోందా అని ఆయన అడిగారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సహాయమంత్రి జితిన్ ప్రసాద్ సమాధానమిస్తూ కంప్యూటర్‌లు, మొబైల్ ఫోన్లు, నెట్‌వర్క్‌లు, వివిధ సంస్థల డేటాను పరిరక్షించడానికి సీఈఆర్‌టీ-ఇన్ సర్వీసు ద్వారా హెచ్చరికలను జారీచేస్తున్నట్టు తెలిపారు. మోసపూరిత కార్యకలాపాలపై దర్యాప్తును వేగవంతం చేయడానికి సీఈఆర్‌టీ-ఇన్ సర్వీస్ ప్రొవైడర్లు, రెగ్యులేటర్ లాఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు పనిచేస్తున్నట్టు తెలిపారు. డేటా, నెట్‌వర్క్ భద్రత, యాక్సెస్ మేనేజ్‌మెంట్, అప్లికేషన్ సెక్యూరిటీ, తదితర అంశాలపై 2023లో ప్రభుత్వ సంస్థలకు భద్రతా పద్ధతులపై సీఈఆర్‌టీ-ఇన్ మార్గదర్శకాలను జారీచేయడం జరిగిందన్నారు.

ప్రధానమంత్రి మోదీకి ధన్యవాదాలు

కేంద్ర ప్రభుత్వం ఏపీలోని వివిధ రైల్వేప్రాజెక్టుల కోసం రూ.9151కోట్లను కేటాయించినందుకు ప్రధానమంత్రి మోదీకి ఎంపీ కృతజ్ఞతలు తెలియజేశారు. మచిలీపట్నం-నర్సాపురం రైల్వేలైను నిర్మాణంతోపాటు, మచిలీపట్నం-రేపల్లెల మధ్య రైల్వేలైను నిర్మాణాకిని అనుమతులు మంజూరు చేయాలని ఆయన కోరారు. గతేడాది అక్టోబరు నెలలో నిలిచిపోయిన మచిలీపట్నం-తిరుపతి రైలును పునరుద్ధరించాలని ఆయన కోరారు.



జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సృజన

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

» జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 31 : యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో సికింద్రాబాద్‌కు చెందిన ఎస్కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేఎల్ గ్రూప్ సంస్థల సౌజన్యంతో అమెజాన్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి బుధవారం గొల్లపూడిలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, యువత అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడే జీవితంలో స్థిరపడగలుగుతారన్నారు. కేఎల్ గ్రూప్ అమెజాన్ సంస్థ ప్రతినిధి రమణ మాట్లాడుతూ, నెల్లూరు సమీపంలో తడ వద్ద ఉద్యోగాల కల్పనలో కలెక్టర్ కోరిక మేరకు గిరిజన యువతకు అవకాశాలు ఇచ్చేందుకు ముందురు రావడం జరిగిందన్నారు. ఇంగ్లీష్ చదివి అర్థం చేసుకొనే పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. అర్హత పొందిన వారికి నామమాత్రపు రుసుముతో హాస్టల్ వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వారానికి ఐదు రోజులు పనిదినాలు ఉంటాయని, అదనపు పనిదినానికి రోజుకు రూ.1275 చెల్లించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనులను నిర్వహించవలసి వుంటుందని, ఇందుకు అవసరమైన శిక్షణ ఇస్తామని తెలిపారు. జాబ్‌మేళాకు 66 మంది గిరిజన యువత హాజరుకాగా 52 మందిని ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకురాలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె.సునీత తెలిపారు. జాబ్‌మేళాలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, జూలై 31 : షేర్‌మహ్మద్‌పేట వద్ద అక్రమంగా గంజాయి కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి బుధవారం తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గ్రామంలో చెరువు సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఒడిసాలోని కలహండి జిల్లా ఖైరుపడారు గ్రామానికి చెందిన సంతోష్ కానసమ అనే వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామంలో ఉంటూ ఆటోనగర్‌లోని కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్టు తెలిపారు. ఇటీవ స్వగ్రామానికి వెళ్లి వచ్చే సమయంలో గంజాయి తీసుకువచ్చినట్టు తెలిసిందన్నారు. తనకు గంజాయి తీసుకునే అలవాటు ఉందని అంతేకాకుండా ఇతరులకు కూడా విక్రయిస్తున్నట్టు తెలిపారు.

హైవేపై రూ.4 లక్షల దోపిడీ

పెదకాకాని, జూలై 31 : హైవేపై జి.కొండూరు వాసి దారి దోపిడీకి గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. జి.కొండూరు చెందిన పెద్ది సుబ్బారావు తాను తీసుకున్న అప్పులు తీర్చే నిమిత్తం పెదకాకానిలోని కుమార్తె ఇంటికి వచ్చాడు. పత్తిపాడు గ్రామ సమీపంలోని కోయవారిపాలెంలో డబ్బులు ఇచ్చేందుకు పెదకాకాని నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సుబ్బారావును తక్కెళ్లపాడు రోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఒక వ్యక్తి అడ్డగించాడు. కింద పడిన తన ఏటీఎం కార్డు తీసుకున్నావంటూ సుబ్బారావుతో గొడవ పడి, అతని వద్ద ఉన్న రూ 4 లక్షల నగదును లాక్కుని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పథకం.. రైతులకు ఊతం

» ఎన్టీఆర్ జిల్లాలో 1760 ఎకరాల్లో పండ్లు, పూల తోటల పెంపకం

» పుల్లూరులో కలెక్టర్ సృజన పర్యటన

» మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



మైలవరంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

మైలవరంరూరల్, జూలై 31 : ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ఊతం ఇస్తుందని, నూరుశాతం సబ్సిడీ కింద ఉద్యాన పంటలను చేపట్టి ఆర్థిక పరిపుష్టి కల్పిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. మండలంలోని పుల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తమంగాపురం, చిలుకూరువారిగూడెం గ్రామాలలో మంగళవారం కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేశారు. ఈసందర్భంగా కొత్తమంగాపురంలోని మల్లెతోటలను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. చిలుకూరువారిగూడెంలోని అప్పిడి సుబ్బారెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు బోధన ప్రణాళిక తీరును పరిశీలించారు. అధికారులకు మధ్యాహ్న భోజనం, టీచింగ్‌పై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సృజన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 1760 ఎకరాలలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల, పూల తోటల సాగును చేపట్టేలా రైతులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. 40 ఎకరాలలో రైతులు మల్లె, గులాబి తోటల పెంపకాన్ని చేపట్టారని, మిగిలిన 1720 ఎకరాలలో మామిడి, జామ, నిమ్మ, సపోట, నారింజ, తదితర పండ్ల మొక్కల పెంపకాన్ని చేపట్టారన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పండ్లు, పూల తోటల పెంపకం ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పండ్లు, పూలసాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ఉపాధి హామీ ద్వారా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్‌తోపాటు ఉపాధి హామీ పథకం ప్రాజెక్టర్ డైరెక్టర్ జె.సునీత, డీపీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, ఏపీవో వెంకటేశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజర్ కె.ఉషారాణి, వంశీకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీహరి, ఎంఈవో బాలు, ఎండీవో శ్రీనివాస్, ఏపీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ విభాగాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, పనులను వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో బుధవారం ఉపాధిహామీ పనులు, గృహనిర్మాణం, టిడ్కో, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణాలకు సంబంధించిన లేఅవుట్లలో, టిడ్కో గృహాల వద్ద అంతర్గత రహదారులు, విద్యుత్ కనెక్షన్లు, తాగునీరు తదితర మౌలిక వసతులను వేగవంతం చేయాలన్నారు. ఉపాధిహామీ పథకంద్వారా ఈ ఏడాది 2.11లక్షల జాబ్‌కార్డులు ఇచ్చి 59.11 లక్షల పనిదినాలను కల్పించామన్నారు. ఉపాధిహామీ పనుల ద్వారా రూ. 154.13 కోట్లను కూలీలకు వేతనంగా చెల్లించడం జరిగిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, టిడ్కో పీడీ బి చిన్నోడు, విద్యుత్‌శాఖ ఎస్ఈ మురళీమోహన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతగల ఉద్యమ నేత ఉపేంద్రబాబు

» ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

ధర్నాచౌక్, జూలై 31 : జి.ఉపేంద్రబాబు నిబద్ధగల జర్నలిస్టు ఉద్యమనేత అని జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టు ఐక్యతకు ఆయన ఎనలేని కృషి చేశారని ఐజేయూ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల మృతి చెందిన ఆంధ్రజ్యోతి పూర్వ డిప్యూటీ ఎడిటర్, ఏపీయూడబ్ల్యూజే మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్రబాబు సంతాప సభ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. తొలుత ఆయన చిత్రటానికి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల ఉద్యమ నిర్మాణానికి, విస్తరణకు ఆయన చేసిన కృషిని వివరించారు. జర్నలిస్టుల ఉద్యమానికి ఆయన అందించిన సేవలకు చిరస్మరణీయంగా ఆయన పేరిట ఒక కార్యక్రమానికి రూపకల్పన చేస్తామన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, విజయవాడ ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి పి.వెంకట్రావ్ తదితరులు మాట్లాడుతూ, ఉపేంద్రబాబు మృతి తీరని లోటన్నారు.



ఉపేంద్ర చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

చందు జనార్ధన్, ఎస్‌కే.బాబు, చావా రవి, ఉపేంద్ర కుమారుడు జి.అజయ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా తదితరులు పాల్గొని ఉపేంద్రబాబుకు ఘనంగా నివాళులర్పించారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

లింగ నిర్ధారణ పరీక్ష నేరం

మచిలీపట్నం టౌన్, జూలై 31: స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో గీతాబాయి హెచ్చరించారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాల్లో ధరలపట్టిక, హెచ్చరిక బోర్డులు ఉంచాలని గీతాబాయి సూచించారు. జనాభాలో స్త్రీ, పురుష నిష్పత్తుల్లో వ్యత్యాసం లేకుండా వ్యవహరించాలని ఆమె సూచించారు. సమావేశంలో వైద్యులు మహేష్, ఎస్ అమృత, పి.చాందిని, ఐ.వినిల్, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, కరెడ్ల సుశీలతో పాటు కార్యాలయ సిబ్బంది శివసాంబిరెడ్డి, రాజేంద్రకుమార్, మస్తానమ్మ, శివసుధ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ

వన్‌టౌన్, జూలై 31 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి బుధవారం 22 బృందాలకు చెందిన 1250 మంది మహిళా భక్తులు ఆషాఢ సారె సమర్పించుకున్నారు. విజయవాడ నుంచి టీ రవీనా, చిట్టినగర్ కుండలమార్కెట్ గంగ దుర్గ మారెమ్మ విశ్వేశ్వరస్వామి దేవస్థానం నుంచి 500 మంది,వర్మ బృందం 100 మంది రాణి బృందం 70 మంది ఇలా పలు ప్రాంతాలనుంచి 22 బృందాలకు చెందిన 1250మంది అమ్మవారికి సారె సమర్పించి పూజలలో పాల్గొన్నారుఅర్చకులు ఆశీస్సులు అందచేశారు సారెతీసుకువచ్చిన బృందాలకు ఈవో రామరావు ఆధ్వర్యంలో అధికారులు స్వాగతం పలికి మార్గదర్శనం చేశారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

కాకినాడ జగన్నాధపురానికి చెందిన తేజో మూర్తుల సూర్యకుమార్ , కుటుంబ సభ్యులు బుధవారం ఆలయానికి విచ్చేసి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అన్నవితరణ కార్యక్రమానికి 1166 యూఎస్ డాలర్లు, మరో 2350 నగదును అధికారులకు అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి చర్యలు

ఉంగుటూరు, జూలై 31 : పౌరసరఫరాల శాఖద్వారా రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఉంగుటూరు ఎస్సీకాలనీ, రామాలయం వీధిలో ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీలత, పీడీఎస్ ఉప తహసీల్దార్ ప్రధాన్‌తో కలిసి బుధవారం సాయంత్రం ఆమె సర్వే నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న రేషన్ పంపిణీ విధానం, పెరుగుతున్న ధరల గురించి ప్రజల నుండి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈసందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ ప్రజాపంపిణీలో మరిన్ని నిత్యావసరాలు అందించడంపై ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. ప్రజలకు అందజేస్తున్న బియ్యంతోపాటు అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనపథకంలో వినియోగించే సరుకుల నాణ్యతను పరిశీలించి మరింత మెరుగైన నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామాల్లో సర్వే జరుపుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ, పీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



కాలనీలో మహిళల అభిప్రాయాలు తెలుసుకుంటున్న డీఎస్‌వో

దస్తావేజు నకలు ఇప్పించలేదని దాడి

» కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కలకలం

» ఒకరికి గాయాలు.. కేసు నమోదు



సబ్ రిజిస్ట్రార్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై తాతాచార్యులు, ఇన్‌సెట్‌లో రెహ్మాన్

కంకిపాడు, జూలై 31 : కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందరు చూస్తుండగానే వ్యక్తిపై దాడికి పాల్పడం స్థానికంగా కలకలం రేకెత్తించింది. తనకు నకలు ఇప్పించడం లేదంటూ కంకిపాడుకు చెందిన దేవరపల్లి శ్రీనుపై గంగూరుకు చెందిన అబ్దుల్ జావేర్ రెహ్మాన్ పీలర్‌తో దాడి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని విజయవాడలో ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు రెహ్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడుకు చెందిన దేవరపల్లి శ్రీను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద టీ, కాఫీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి అవసరమైన భోజనాలు, వారి పనులకు సహకరిస్తూంటాడు. ఆ క్రమంలో గంగూరుకు చెందిన రెహ్మాన్ తన తండ్రికి గూడవల్లిలో 62 సెంట్లు భూమి ఉందని, సదరు భూమికి సంబంధించిన నకలు ఇప్పించాలంటూ శ్రీనుకు రూ.50 వేలు ఇచ్చాడు. గత కొద్ది రోజులుగా నకలు ఇవ్వకుండా రెహ్మాన్ తిప్పించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన శ్రీనుపై రెహ్మాన్ పీలర్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో శ్రీనుకు గాయాలయ్యాయి. స్థానికులు రెహ్మాన్‌ను పోలీసులకు అప్పగించారు. బాధితుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్సై 2 తాతాచార్యులు తెలియజేశారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ త్రినాథ్‌ను వివరణ కోరగా ఘటనతో తమకు, కార్యాలయ సిబ్బందికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కార్యాలయంలోని సిబ్బందికి శ్రీను టీ, కాఫీలు, భోజనాలు అందిస్తూ ఉంటాడన్నారు.



మంగినపూడి బీచ్‌ను సందర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర

మంగినపూడి పర్యాటకంగా అభివృద్ధి

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 31 : ఐదేళ్ల వైసీపీ పాలనలో పర్యాటక రంగాన్ని పూర్తిగా విడిచిపెట్టారని, కూటమి ప్రభుత్వం పర్యాటకరంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఆ దిశగా అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగినపూడి బీచ్‌ని మంగళవారం అర్బన్ ఇన్‌ఫ్రాటెక్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతినిధి కిరణ్‌తో కలిసి సందర్శించారు. పర్యాటకులతో మాట్లాడారు. బీచ్ అభివృద్ధికి చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. మంగినపూడి అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అవసరమైన మేరకు హోటల్స్, రిసార్ట్స్ నిర్మిస్తామన్నారు. భద్రత కల్పిస్తామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి రామలక్ష్మణ్, టీడీపీ నేతలు కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పేదల పక్షపాతి : నెట్టెం



జగ్గయ్యపేట, జూలై 31 : గృహనిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లు లేని వారికి గ్రామాల్లో 2 సెంట్లు, పట్టణాల్లో 3 సెంట్లు, సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పేదలకు రూ.4లక్షలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించాయని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. బుధవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం కేవలం సెంటు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోమని మోసం చేసిందని, కేంద్రం గృహ నిర్మాణానికి ఇచ్చిన రూ.5వేలకోట్లను కూడా దారి మళ్లించారని ఆరోపించారు. పేదలకు నివేశన స్థలాల పేరుతో జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు తక్కువ ధరకు స్థలాలు కొని ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించి రూ. కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం యూనిట్‌కు ఇచ్చే రూ.1.80లక్షలు తప్ప జగన్ ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదని, అనేకమంది ఇళ్లను కట్టుకోకుండా మిగిలిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు పొంది ఇల్లు కట్టుకోలేని వారికి పీఎంఏవై 2.0 వర్తింపచేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఏటా 1.25లక్షల మందికి ఇళ్లు కట్టించాలని దృఢ సంకల్పంతో ఉన్నారని చెప్పారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలు షురూ.. : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్, జూలై 31 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ 2029 నాటికి శాశ్వత గృహవసతి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడం ముదావహమన్నారు. పింఛన్ రూ.4వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. రైతుల పాస్‌పుస్తకాలపై రాజముద్ర అభినందనీయమన్నారు. ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తానని ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి 5లక్షల ఇళ్లను కూడా సకాలంలో నిర్మించలేకపోయారన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందీ టీచర్ల పోస్టులు భర్తీ చేయండి

» మంత్రి నారా లోకేష్‌కు వినతి

అజిత్‌సింగ్‌నగర్, జూలై 31 : దామాషా ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హిందీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి షేక్ గైబువలి కోరారు. ఈ మేరకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు బుధవారం మెయిల్ ద్వారా వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హిందీ ఉపాధ్యాయుల కొరత ఉందని, దీంతో విద్యార్థులకు హిందీ భాషా బోధనలో సరైన న్యాయం జరగడం లేదన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు హిందీ భాషను ఎంపిక చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. మన దేశ అధికార భాష హిందీని నేర్చుకోవడానికి ప్రపంచ దేశాలు ఆశక్తి కనబరుస్తున్నాయని, విదేశాంగ లెక్కల ప్రకారం వందల సంఖ్యలో పలుదేశాల్లో యూనివర్సిటీల్లో హిందీ భాషా విభాగాలు వెలిసాయన్నారు. వచ్చే డీఎస్సీ, జేఎల్, డీఎల్ నోటిఫికేషన్లలో అవసరమైన హిందీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

వైసీపీ నేతలపై చర్యలు తీసుకోండి

» రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం డిమాండ్



మచిలీపట్నం టౌన్, జూలై 31 : గన్నవరం మండలం తెంపల్లి గ్రామ సర్పంచ్ కొలుసు శిరీషపై దౌర్జన్యానికి దిగిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ నాయకుడు గల్లా తిమోతి డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నంలో జరిగిన సమావేశంలో తిమోతి మాట్లాడారు. సచివాలయ అధికారులు ఎందుకు ఆలస్యంగా వచ్చారని అడిగిన సర్పంచ్ శిరీషను తెంపల్లి వైసీపీ కన్వీనర్ చిదంబరకుమార్ ఇష్టారాజ్యంగా దుర్భాషలాడుతూ దాడికి యత్నించారన్నారు. దీనిపై గన్నవరం ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని గల్లా తిమోతి చెప్పారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘ నాయకులు చిలకలపూడి పాపారావు, వరి శ్రీదేవి, పంచకర్ల సురేష్, బొమ్మసాని నరేష్, చేబ్రోలు మౌనిక, ఆరేపల్లి జేజమ్మలతో పాటు శిరీష పాల్గొన్నారు.

రైతు బజార్లలో దేశవాళీ కందిపప్పు విక్రయాలు

ధర్నాచౌక్, జూలై 31 : ఏపీ సివిల్ సప్లయిస్ కార్యాలయంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం వర్తక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తకులు, రైస్‌మిల్లర్లతో మంత్రి చర్చించి రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు దేశావళీ రకం రూ. 150, స్టీమ్ బియ్యం ఒక రకం రూ. 48, మరో రకం రూ. 47లకు అమ్మకం చేసేందుకు ఒప్పించడం జరిగిందని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు తెలిపారు. గురువారం నుంచి వీటిని విక్రయించేలా ఏర్పాట్లు చేయాలని జేసీలను మంత్రి ఆదేశించారని భాస్కరరావు పేర్కొన్నారు.

నాసా పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

పెనుగంచిప్రోలు, జూలై 31 : 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయిలో నాసా వారు నిర్వహించిన పరీక్షల్లో పెనుగంచిప్రోలు శ్రీ చైతన్య విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మొత్తం ఈ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలకు పలు రకాల ప్రాజెక్టులను నిర్వహించారు. వీటిలో పది మంది విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులకు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పది మంది విద్యార్థులను సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ జి.పూర్ణచంద్రరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎంజి మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్ కుమార్, కో-ఆర్డినేటర్ సురేష్, డీన్ కౌసల్యదేవి, నాసా ఇంచార్జి శిరీష తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

మద్యం మత్తులో వీరంగం

» యూపీ యువకుడికి దేహశుద్ధి

విజయవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉన్న యూపీ యువకుడు నైజాం గేటు వద్ద బుధవారం రాత్రి హల్‌చల్ చేశాడు. మత్తులో రైల్వే ట్రాక్ దాటుతున్న యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఉత్తరాది నుంచి వస్తున్న రైలు నుంచి ఈ యువకుడు నైజాం గేటు వద్ద దిగినట్టు తెలుస్తోంది. అప్పటికే అతడు మత్తులో ఉన్నాడు. నైజాం గేటు వద్ద అటుఇటూ తిరుగుతూ ఆలజడి చేశాడు. చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో చొరబడే ప్రయత్నం చేయడంతో స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతడ్ని స్టేషన్‌కు తరలించారు. అతడు మద్యం మత్తులో ఉన్నాడా, గంజాయి మత్తులో ఉన్నాడా అన్న దానిపై పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

వన్‌టౌన్, జూలై 31: కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం రోడ్డుపై నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైంది.

గుంటూరు జిల్లా కంతేరుకు చెందిన గుంటుపల్లి వాణి శ్రీ కృష్ణలంకలోని ఐడియల్ స్కూల్ వద్ద ఉన్న తన కుమార్తెను చూసేందుకు వచ్చింది. తిరిగి వెళుతున్న సమయంలో వెనుక నుంచి స్కూటర్‌పై వచ్చిన యువకుడు (20)ఆమె మెడలోని 50 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సురక్షిత నీటిని సరఫరా చేయండి

నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

వన్‌టౌన్, జూలై 31: రోగాల బారిన పడకుండా తీసుకునే జాగ్రత్తల క్రమంలో నగర ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన విద్యాధరపురంలోని కేఎల్ రావు హెడ్ వాటర్‌వర్క్స్‌లో నీటి సరఫరా తీరును పరిశీలించారు. మంచినీటి సరఫరాలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, వ్యాధులు ప్రబలుతున్నందున సురక్షిత నీటి సరఫరాను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. అనంతరం ఆయన ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు విద్యాధరపురం, హెచ్‌బీ కాలనీ, గాంధీజీ మహిళా కళాశాలల వద్ద నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్లలో జరుగుతున్న పనులను పరిశీలించి


నీటి పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఆగస్టు 5వతేదీ కల్లా క్యాంటీన్లను సిద్ధం చేయాలన్నారు. ఆయన హనుమాన్‌పేటలోని వెహికల్ డిపోలో వాహనాలను, స్టోర్‌ను పరిశీలించారు.

చెత్తను తరలించేందుకు అన్ని వాహనాలు నిరంతరం సిదంగా ఉండాలని, పాడైపోయిన వాహనాలకు మరమ్మతులు చేయించి వాటిని కూడా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అవసరమైతే మరికొన్ని వాహనాలను పెంచి చెత్త తరలింపులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ పి.రత్నావళి, ఎస్ఈ రామమోహనరావు, ఈఈలు ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, ఇంజనీరింగ్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా

కొండ ప్రాంతంలో గద్దె పర్యటన

గుణదల, జూలై 31: క్రీస్తురాజుపురం కొండపైన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయించి, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. క్రీస్తురాజురంలోని 5వ డివిజన్ కొండ ప్రాంతంలో బుధవారం గద్దె ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, కొండ దిగువన ఉన్నవారు మోటార్లు వేస్తుండటంతో కొండపైన ఉన్నవారికి కుళాయిల్లో నీరు రావడం లేదని స్థానికులు గద్దెకు వివరించారు. ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ ప్రకారం బడ్జెట్


కొండ ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గద్దె

నిధుల్లో 18శాతం ఎస్సీ ఎస్టీల ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిందేనని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సబ్‌ప్లాన్‌ను తిరిగి ప్రారంభించే విషయమై ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించి భవిష్యత్తులో నీటి కొరత లేకుండా చేస్తానని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, ఈతఈ స్వామ్రాజ్యం, పాలవలస కోటి, కోడూరు సుబ్రహ్మణ్యం, షేక్ షరీఫ్, దోమకొండ రవి, రాచమళ్ల ఆంజనేయులు, గద్దె రమేష్, నర్రా సుబ్బారావు, ఏసుపోగు మోజెస్, మాచర్ల ఆనంద్, సిద్దెల వివేక్, దండమూడి సన్నిధి, లవంగి మరియమ్మ పాల్గొన్నారు.

శాకంబరీ దేవి అలంకారంలో కాళీమాత



కృష్ణలంక, జూలై 31 : త్రిశక్తిపీఠంలోని శ్రీ కాళీమాత అమ్మవారు బుధవారం భక్తులకు శాకంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు సమర్పించిన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తదితరాలతో అమ్మవారిని అలంకరించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని మండపంలో కూరగాయలు, పండ్లతో చేసిన వివిధ ఆకృతులు భక్తులను ఆకర్షించాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు పాల్గొన్నారు.

సిప్ అబాకస్ విద్యార్థులకు అభినందన



పటమట, జూలై 31 : రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పటమటకు చెందిన సిప్ అబాకస్ విద్యార్థులకు బుధవారం ఆ సెంటర్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మానస మాట్లాడుతూ జోయల్ కీర్తన్, చిరుహాసిని, రుషికేష్ మొదటి స్థానం, నిహాల్, హేమాన్య, ఖ్యాతి, అఖిల్, ద్రుతి, అర్జున్, హన్విక ద్వితీయ స్థానాలు, శ్రీ వల్లీ పార్థికేష్, సూర్యవర్ధన్‌లు తృతీయస్థానం పొందారని తెలిపారు, ఇరవైమంది విద్యార్థులు బెస్ట్ పెర్ఫార్మన్స్ బహుమతి పొందినట్లు మానస తెలిపారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత

వన్‌టౌన్, జూలై 31: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు బాధితులకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి బుధవారం తన కార్యాలయ సిబ్బంది ద్వారా ఆర్థికసాయం అందజేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న కుమ్మరిపాలానికి చెందిన లింగంశెట్టి సత్యనారాయణ భార్య పుట్టమ్మ రూ. 5000, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డుకు చెందిన మాధవికి మందులు కొనుగోలు నిమిత్తం రూ. 2000 ఆర్థిక సహాయం అందించారు.

గోతుల్లో పడి గాయపడుతున్న వాహనదారులు

● 21వ డివిజన్‌లో సీపీఎం నాయకుల పర్యటన



కృష్ణలంక, జూలై 31 : స్థానిక 21వ డివిజన్‌లో డ్రైయినేజీ పైపుల కోసం కార్పొరేషన్ వారు రోడ్డు మధ్యలో తవ్వేసి సరిగ్గా పూడ్చకపోవడంతో గోతులమయంగా మారాయని, ఆ గోతుల్లో పడి ద్విచక్ర వాహనదారులు గాయపడుతున్నారని సీపీఎం రాష్ట్ర నాయకుడు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి డివిజన్‌లోని కల్పనా ప్రింట్స్ రోడ్డు, హైస్కూల్ రోడ్డు, బీచ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్పనా ప్రింట్స్ రోడ్డులో ఎత్తుగా మ్యాన్‌హోల్స్ ఉండటంతో అదుపు తప్పి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. తక్షణమే రోడ్డు నిర్మాణం చేయడంతో పాటు, పగులకొట్టిన రోడ్డు స్థానంలో కొత్తరోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ అధికారులు స్పందించకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని కాశీనాథ్ హెచ్చరించారు. సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, తాడి రమణ, కె.శివాజీ, రాజా, కుమ్మరి రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

టీఈఎం రాజు సేవలు అభినందనీయం

● కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 31 : గత 38 ఏళ్లుగా విధి నిర్వహణలో అంకిత భావంతో క్రమశిక్షణతో పనిచేసి అందరి మన్ననలు పొందిన టీఈఎం రాజు సేవలు అభినందనీయమని కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. విజయ వాడలో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా విశిష్ట సేవలందించిన టీఎంఎం రాజు పదవీ విరమణ సందర్భంగా బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అభినందన సన్మాన కార్యక్రమం జరిగింది. టీఈఎం రాజు ఏ హోదాలో ఉన్నా ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారంటూ వివిధ శాఖల అధికారులు ఆయనతో వున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు. అనంతరం టీఈఎం రాజును కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నిధి మీనా, డీఆర్‌ఓ వి.శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ కార్యాలయ సిబ్బంది, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


టీఈఎం రాజు దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ జి.సృజన

పేద మహిళకు గూడు నిర్మాణం చేయడం ఆనందంగా ఉంది

● టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్

గుణదల, జూలై 31: పేదింటి మహిళకు తన సొంత నిధులతో ఎమ్మెల్యే గూడు నిర్మాణం చేయడం చాలా ఆనందంగా ఉందని టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు.

ఎన్నికల ప్రచార సమయంలో 3వ డివిజన్ గంగిరెద్దుల దిబ్బ కొండ ప్రాంతంలో పర్యటించిన గద్దె రామ్మోహన్ కుంగిపోయిన ఇంట్లో ఉంటున్న ఉప్పు నరసమ్మ ఉమ్మడి కుటుంబంతో ఎదుర్కొంటున్న సమస్యను చూసి ఉన్న చోటే సొంత గూడు నిర్మించి ఇస్తానని ఇచ్చిన మాట ప్రకారం నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నిర్మాణ పనులు పరిశీలించేందుకు బుధవారం వచ్చిన గద్దె క్రాంతి కుమార్ పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని తాపీ మేస్త్రికి సూచించారు. జనసేన డివిజన్ అధ్యక్షుడు గుత్తికొండ కృష్ణమోహన్, తాడి బాబూరావు, గద్దె రమేష్, బండి కోమలి, పూలదాసు మారుతీమోహన్, ఏటూరి ప్రసాద్, గుణమాల రాజశేఖర్, కర్రి రాజేష్ పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదంటూ ఫిర్యాదు

వన్‌టౌన్, జూలై 31: తమ కుమార్తె కనిపించడం లేదంటూ గొల్లపాలెం గట్టుకు చెందిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాలిక మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో బయటకు వెళ్లింగి. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు చూడగా కుమార్తె కనిపించకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు గతంలో కూడా ఒకసారి బాలిక ఇంట్లోంచి వెళ్ళిపోయి కొన్నాళ్ళకు తిరిగి వచ్చినట్లు ఫిర్యాదులో తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పటమట, జూలై 31 : విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు డొంకరోడ్డు, బాపూజీ రోడ్, రామాయణపు వారి వీధి ప్రాంతాల్లో, ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్ష్మీపతినగర్, జేడీ నగర్, డొంకరోడ్డు, చిన్నవంతెన సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

జీప్లస్ త్రీ ఇళ్ల వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● విద్యుదాఘాతానికి గురైన బాలుడు ● ఆలస్యంగా వెలుగు చూసిన వైనం


విద్యుత్ ఘాతానికి గురైన బాలుడు (వృత్తంలో)

పాయకాపురం, జూలై 31: స్థానిక రాధానగర్‌లోని జీప్లస్ త్రీ ఇళ్ల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రెండు రోజుల క్రితం ఓ బాలుడు విద్యుదాఘాతానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అదృష్టవశాత్తు బాలుడికి ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ, సీపీఎం నేతలు బుధవారం జీప్లస్ త్రీ ఇళ్ల వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అలాగే ప్రమాదానికి గురైన కుంభ ద్వారక్(8)ను నేతలు పరామర్శించారు. టీడీపీ నేత పైడి శ్రీను పాయకాపురం విద్యుత్ శాఖ ఏఈని పిలిపించి పరిస్థితులను వివరించారు. స్పందించిన ఏఈ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బాలుడి ఇంటికి వెళ్లిన సీపీఎం నేతలు కె. దుర్గారావు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భవానీపురం తహసీల్దార్ కిషోర్‌బాబుకు ఘనంగా వీడ్కోలు

విద్యాధరపురం, జూలై 31: ఎన్నికల సమయంలో భవానీపురం తహసీల్దార్‌గా వచ్చి మళ్లీ బదిలీపై వెళుతున్న కిషోర్‌బాబుకు బుధవారం అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల ప్రజలు, సహచరులు, పోలీసు సిబ్బంది, ఆఫీసు సిబ్బంది, మీడియా ప్రతినిధుల సహకారంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించగలిగినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, అప్పారావు, వీఆర్‌ఓలు సిరి వెన్నెల, ఇంద్రజ, సాహిత్య, విజయలక్ష్మి, అరుణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫణి, జూనియర్ అసిస్టెంట్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితం ఆనందంగా గడపాలి

● ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమంలో సీపీ


పదవీ విరమణ చేసిన సిబ్బందితో సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు

గుణదల, జూలై 31: పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బంది వారి శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు సీపీ ఎస్.వి. రాజశేఖర్ బాబు తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఆరుగురు ఉద్యోగులకు బుధవారం సీపీ కార్యాల యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. వారిని కుటుంబ సభ్యులతో కలిపి సన్మానించి పోలీసుశాఖకు చేసిన సేవలను కొనియాడారు. వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను అందజేశారు. ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి, అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏవో రంగారావు, ఏఆర్ ఏసీపీ ప్రసాదరావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

● వెస్ట్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి హితవు


ప్రసంగిస్తున్న వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి

వన్‌టౌన్, జూలై 31: అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, గంజాయి మత్తు కు అలవాటు పడొద్దని వెస్ట్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి హితవు పలికారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజ నీరింగ్ కాలేజీలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గంజాయి సేవించడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. గంజాయిని అరికట్టేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను తెలిపారు. ప్రస్తుతం విస్తృతంగా జరుగుత్ను సైబర్ నేరాలు, మోసాలను వివరించారు. కళాశాల ఈసీఈ హెచ్‌వోడీ రంగారావు, సైబర్ క్రైం సీఐ శ్రీను, ఎస్ఐ రాజనరేంద్ర పాల్గొన్నారు. వెస్ట్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో వెస్ట్ ఏసీపీ, కొత్తపేట పోలీసు స్టేషన్ సీఐ గణేష్‌లు సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం, జూలై 31 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వివరాల ప్రకారం పాయకాపురం ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎం. శంకరరావు(52) పక్షవాతంతో బాధపడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం కాలకృత్యాలు తీర్చుకోవడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. కొంత సేపటికి బాత్‌రూమ్‌లో అతరె మూలుగుతున్న విషయాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతరిరి చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. సమాచారం అందు కున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతుడి తలపై గాయం ఉండటంతో బాత్‌రూమ్‌లో కాలుజారి పడ్డాడా, ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పాయకాపురం, జూలై 31 : చోరీ కేసులో ఓ వ్యక్తిని నున్న రూరల్ పోలీ సులు బుధవారం అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనప రచుకున్నారు. వివరాల ప్రకారం వాంబేకాలనీ బీ బ్లాక్‌లో ఉంటున్న వెల్లట్ల పద్మ ఇంట్లో ఈనెల 23న చోరీ జరిగింది. ఇంటి తాళం పగులకొట్టిన గుర్తు తెలియని వ్యక్తి రూ. 1.85 లక్షల నగదు, ఐదు కాసుల బంగారపు ఆభరణాలు, 80 తులాల వెండి వస్తువులు దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నున్న రూరల్ పోలీసులు చోరీ జరిగిన తీరుపై విచారణ చేపట్టారు. అదే కాలనీకి చెందిన దండుగుల ప్రభుకుమార్ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుకుమార్‌ను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీన పరచుకున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 1 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



నా దగ్గర ఆధారాలు ఉన్నాయి..
లీగల్‌గానే వెళతా

హీరో రాజ్‌తరుణ్, లావణ్యల వివాదం బుధవారం కొత్త మలుపు తిరిగింది. రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం జరిగితే అక్కడికి లావణ్య వచ్చారు. ఆ చిత్ర కథనాయిక, ఈ వివాదానికి కేంద్ర బిందువు అయిన మాల్వీ మల్హోత్రా కూడా వచ్చారు. రాజ్‌తరుణ్, మాల్వీ ఇద్దరూ వైట్ డ్రస్‌లో ఉండడం గమనార్హం. రాజ్‌తరుణ్ వస్తున్నాడని తెలియగానే మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'నా సినిమా హిట్ అయినప్పుడు కూడా ఇంత మంది మీడియా సభ్యులు రాలేదు' అంటూ రాజ్‌తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనపై వచ్చిన వివాదం గురించి ఆ మీడియా సమావేశంలో రాజ్‌తరుణ్ చెప్పిన మాటలు ఇవి.

- నాలో ఉన్న అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అందుకే లీగల్‌గా వెళుతున్నాను.
- నా వల్ల గర్భం వచ్చిందనీ, అబార్షన్ చేయించానని ఆరోపిస్తున్నారు. మరి ఆ విషయాన్ని పోలీసులకు ఇచ్చిన కంప్లయింట్‌లో ఎందుకు చేర్చలేదు? ఎందుకంటే అవి నిజాలు కావు కనుక. అందుకే ఈ విషయం గురించి నేను మాట్లాడను. మా లాయర్ ద్వారా ప్రొసీడ్ అవుతున్నా.
- నాకు ఇప్పుడు 32 ఏళ్లు. ఇన్నేళ్ల జీవితంలో ఎందరో పరిచయం అయి ఉంటారు. ఎంతో మందితో సాన్నిహిత్యం ఉంది. వాళ్లలో ఎవరైనా నేను మంచి వాడిని కాదు అని చెబితే పరిశ్రమ నుంచి తప్పుకొంటా.
- నేనూ మనిషినే. బాధలు ఉండవా! ఆ బాధ వల్లే 'పురుషోత్తముడు' చిత్రం ఫంక్షన్‌కు కూడా రాలేదు. ఆ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
- నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. అది ఇప్పుడు చెబుతున్న మాట కాదు. నా పాత ఇంటర్వ్యూలు చూస్తే అది మీకు తెలుస్తుంది.
- 'తిరగబడరా సామి' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఫ్యామిలీ అంతా చూడదగ్గ సినిమా ఇదనీ, మాల్వీ మల్హోత్రా మంచి నటి అనీ, ఆమెకు ఇదే తొలి సినిమా కనుక ఆదరించండి.

లావణ్య ప్రత్యక్షం



తనకు కనిపించకుండా తిరుగుతున్న రాజ్‌తరుణ్ ప్రసాద్ ల్యాబ్‌లో ఉన్నారని తెలియగానే లావణ్య అక్కడ ప్రత్యక్షమయ్యారు. రాజ్‌తరుణ్ కలుసుకోవాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతమంది మీడియా ప్రతినిధులు ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు లావణ్యను అక్కడ నుంచి పంపించేశారు. ఆ తర్వాత ఆమె మాదాపూర్‌లోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకొని అక్కడ కూడా ఆందోళనకు దిగారు. తలుపు తీసే వరకూ అక్కడ నుంచి వెళ్లనని అన్నారు. రాజ్‌తరుణ్ అడిగిన ఆధారాలు తెచ్చినట్లు చెప్పారు.

కట్టి పడేసే కియారా



రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా లుక్ పోస్టర్ విడుదల చేశారు. చూపు తిప్పుకోవడం కష్టం అనేంతగా ఉన్న కియారా గ్లామర్ లుక్ అభిమానుల్ని కట్టి పడేస్తోంది.

'గద్దర్ అవార్డ్స్‌పై కమిటీ ఏర్పాటు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిల్మ్ అవార్డ్స్ ను ఇకపై 'గద్దర్' అవార్డ్స్ పేరుతో ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై తెలుగు చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'నటుడిగా, గాయకుడిగా ఎంతో ప్రతిభ కలిగిన వ్యక్తి గద్దర్. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలనుకోవడం సముచిత నిర్ణయం. ఈ అవార్డుల విధివిధానాలు ఎలా ఉండాలో తయారు చేయడానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి ఓ కమిటీని నియమిస్తాయి. ఆ విధి విధానాలను ఎఫ్.డి.సి. ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి త్వరలో అందజేస్తాం' అని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్యామిలీ డ్రామా



కృష్ణవంశీ, మోక్ష జంటగా నటించిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమవతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఈ సినిమా నచ్చడంతో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇదనీ, కథ అనుకున్నప్పుడే కొత్త వాళ్లతో తీయాలని అనుకున్నామనీ దర్శకుడు చెప్పారు. ఈ జనరేషన్‌కు కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమను చిత్రంలో చూపించామనీ, కొత్త టాలెంట్‌తో సినిమా తీశామని నిర్మాతలు చెప్పారు.

బడ్డీనే హీరో



అల్లు శిరీష్ హీరోగా నటించిన 'బడ్డీ' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. జ్ఞానవేల్ రాజా, అధన నిర్మాతలు. శామ్ ఆంటోన్ దర్శకుడు. బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సెకండ్ హీరో. టెడ్డీ బేర్ ఫస్ట్ హీరో. టెడ్డీ చేసే యాక్షన్ సీన్లు అలరిస్తాయి' అని చెప్పారు. ఈ సినిమా విషయంలో నిర్మాత హ్యాపీగా ఉన్నారనీ, టీమ్ కూడా సంతోషంగా ఉందని దర్శకుడు చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో



నా గత చిత్రాలకు మల్లే 'శివం భజే' సినిమాలోనూ ఓ కొత్త థ్రిల్లింగ్ అంశాన్ని చూపించబోతున్నాం అని హీరో అశ్విన్ బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా అశ్విన్‌బాబు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కుటుంబ అనుబంధాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను స్పృశించాం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని బలంగా నమ్మే పాత్ర నాది. ఇందులో యాక్షన్ స్టైలిష్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

కీర్తి కామెడీ



కీర్తిసురేశ్ లీడ్‌రోల్ పోషిస్తున్న మహిళా ప్రాధాన్య చిత్రం 'రఘుతాత'. సుమన్ కుమార్ దర్శకుడు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. గడుసైన యువతి పాత్రలో కీర్తి కామెడీ పండించిన తీరు ఆకట్టుకుంది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

తుపాన్ లాంటి యాక్షన్



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుఫాన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బిచ్చగాడు' తర్వాత నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం యూనిట్ చాలా కష్టపడింది. విజయ్ ఆంటోని ఇందులో సరికొత్తగా కనిపిస్తారు. వినోదం,యాక్షన్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

ఒలింపిక్స్ ఐదో రోజును భారత అథ్లెట్లు ఆశావహంగా ముగించారు. పతకం లేకపోయినా.. బరిలో నిలిచిన ఆటగాళ్లలో చాలామంది విజయాలతో ముందంజ వేశారు. 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఫైనల్ చేరిన తొలి భారత షూటర్‌గా స్వప్నిల్ కుశాలె రికార్డులకెక్కగా.. బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ పతకానికి గెలుపు దూరంలో నిలిచింది. సింధు, లక్ష్యసేన్ నాకౌట్‌కు దూసుకెళ్లగా.. ఆర్చర్ దీపికా కుమారి వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి రౌండ్-16లో అడుగుపెట్టింది. తెలుగు టీటీ ప్లేయర్ ఆకుల శ్రీజ ప్రీక్వార్టర్స్‌కు చేరడం ద్వారా తన బర్త్‌డేను చిరస్మరణీయం చేసుకొంది.

అన్నీ మంచి శకునములే!

ప్రీక్వార్టర్స్‌కు సింధు, లక్ష్య



లక్ష్యసేన్



సింధు

- రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్లో స్వప్నిల్
- శ్రీజ, లవ్లీనా, దీపిక ముందంజ

పారిస్: ఒలింపిక్స్‌లో ఐదోరోజు భారత అథ్లెట్లు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకొన్నారు. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వప్నిల్ కుశాలె ఫైనల్‌కు చేరుకొన్నాడు. విశ్వక్రీడల్లో ఈ విభాగంలో పతక రౌండ్‌కు చేరుకొన్న తొలి భారత షూటర్‌గా నిలిచాడు. బుధవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో స్వప్నిల్ మొత్తం 590 పాయింట్లతో ఏడో స్థానంలో నిలవగా.. అతడి సహచరుడు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ 589 పాయింట్లతో 11వ స్థానం దక్కించుకొన్నాడు. 44 మంది తలపడిన అర్హత రౌండ్‌లో టాప్-8లో నిలిచిన షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. దీంతో స్వప్నిల్ ముందంజ వేయగా.. మెడల్ రౌండ్ నుంచి ఐశ్వరీ అవుటయ్యాడు. గురువారం ఫైనల్స్ జరగనున్నాయి. మహిళల ట్రాప్‌లో రాజేశ్వరీ కుమారి, శ్రేయాసి సింగ్ ఫైనల్‌కు చేరుకోలేక పోయారు. క్వాలిఫికేష్ రౌండ్‌లో వీరిద్దరూ చెరి 113 పాయింట్లు స్కోరు చేసి 22, 23 స్థానాల్లో నిలిచి, పతక రౌండ్ నుంచి అవుటయ్యారు.



స్వప్నిల్ కుశాలె

పతకానికి అడుగు దూరంలో

టోక్యో కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ క్వార్టర్స్‌కు చేరుకొంది. బాక్సింగ్ మహిళల 75 కిలోల రౌండ్-16 బౌట్‌లో లవ్లీనా 5-0తో సునీవా హాఫ్‌స్టాడ్ (నార్వే)ను మట్టికరిపించింది. అయితే, క్వార్టర్స్ పోరులో టాప్‌సీడ్ లి కియాన్ (చైనా)తో బొర్గొహైన్ రూపంలో కఠిన సవాల్‌ను ఎదుర్కోనుంది. ఈ బౌట్‌లో నెగ్గి సెమీస్ చేరితే లవ్లీనాకు రెండో ఒలింపిక్ పతకం ఖాయమవుతుంది. 54 కిలోల ప్రీక్వార్టర్స్‌లో ప్రీతి పవార్ 2-3తో యనీ మార్సెలా (కొలంబియా) చేతిలో పోరాడి ఓడింది.



లవ్లీనా

ధోనీ స్ఫూర్తిగా..

షూటర్ స్వప్నిల్‌కు క్రికెటర్ ధోనీ అంటే ఎంతో అభిమానం. కెరీర్ ఆరంభంలో రైల్వే టీటీగా మహీ చేసిన తరహాలోనే ఇతడు కూడా టీటీగా పనిచేస్తున్నాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లోని కంబల్వాడి గ్రామానికి చెందిన 29 ఏళ్ల కుశాలె 2012 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొంటున్నాడు. కానీ, ఒలింపిక్స్ అవకాశం కోసం పన్నెండేళ్లపాటు ఎదురుచూశాడు. అయితే, ఆడుతున్న తొలి మెగా ఈవెంట్‌లోనే తనదైన ముద్ర వేశాడు. 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఫైనల్ చేరిన తొలి భారత షూటర్‌గా నిలిచాడు. షూటర్‌గా ఎంతో ప్రశాంతంగా, కూల్‌గా ఉండాలి. ఈ విషయంలో ధోనీ తనకు ఆదర్శమని చెప్పాడు. మహీ బయోపిక్‌ను ఎన్నోసార్లు చూశానన్నాడు.

సేన్ సంచలనం

ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. గ్రూప్ స్టేజ్ చివరి మ్యాచ్‌లో సింధు అలవోకగా నెగ్గగా.. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, వరల్డ్ నెం:4 జొనాథన్ క్రిస్టీపై సేన్ సంచలన విజయం నమోదు చేశాడు. గ్రూప్-ఎంలో జరిగిన ఆఖరి, రెండో మ్యాచ్‌లో సింధు 21-5, 21-10 క్రిస్టీన్ కూబా (ఎస్తోనియా)ను చిత్తు చేసింది. 33 నిమిషాల్లోనే సింధు మ్యాచ్‌ను ముగించడం విశేషం. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఎల్‌లో చివరి మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21-18, 21-12 క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు జొనాథన్‌తో ఐదుసార్లు జరిగిన ముఖాముఖి పోరులో 4 మ్యాచ్‌ల్లో ఓడిన సేన్.. మెగా ఈవెంట్‌లో మాత్రం ఆకట్టుకొనే ప్రదర్శన చేశాడు.

ఆ బాక్సులో ఏముందంటే!



పారిస్ ఒలింపిక్స్ విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలతోపాటు ఓ పొడవాటి బాక్సును కూడా అందజేస్తున్నారు. ఆ బాక్సులో ఏదో ఖరీదైన గిఫ్ట్ ఉందని అనుకుంటే పొరపాటే. 40 సెంటీమీటర్ల ఆ కార్డ్‌బోర్డ్ బాక్స్‌లో పారిస్ ఒలింపిక్ అధికారిక పోస్టర్ మాత్రమే ఉందట. ఆ పోస్టర్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఆర్ట్ డైరెక్టర్ ఉగో గటోనీ రూపొందించాడు.

గోల్డ్ మెడల్ ఖరీదు ఎంతంటే..

ఒలింపిక్స్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఇచ్చే పతకాలకు ఒక ప్రత్యేకత, విశిష్టత ఉంది. అనాది నుంచి వాటి తయారీలోనూ నిర్వాహకులు చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇక.. ఈ పారిస్ ఒలింపిక్స్‌లో ప్రదానం చేస్తున్న పసిడి పతకం తయారు చేసేందుకు భారత కరెన్సీలో సుమారు రూ.86 వేలు ఖర్చు అవుతుంది. 1912 స్టాక్‌హోమ్ ఒలింపిక్స్ వరకు పసిడి పతకాలంటే పూర్తిగా బంగారంతోనే చేసేవారు. అయితే, మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఒలింపిక్స్ నిర్వహణ వ్యయాలను తగ్గించే క్రమంలో స్వర్ణ పతకం తయారీలో మార్పులు చేశారు. పసిడి పతకాన్ని స్వచ్ఛమైన వెండితో చేసి, పైన బంగారు తాపడం చేయడం ఆరంభించారు. ప్రస్తుతం స్వర్ణ పతకం బరువు 529 గ్రాములుండగా, అందులో బంగారం ఆరు గ్రాములే. అంటే గోల్డ్ మెడల్‌లో గోల్డ్ ఉండేది 1.3 శాతమే. అయితే రజత పతకాన్ని మాత్రం పేరుకి తగ్గట్టే వెండితో చేస్తున్నారు. కాంస్య పతకాన్ని కాపర్, టిన్, జింక్ వంటి ఖనిజాల మిశ్రమంతో తయారు చేస్తున్నారు.

పతకం దిశగా జొకోవిచ్

టెన్నిస్ సింగిల్స్‌లో క్వార్టర్స్‌కు

ప్రపంచ టెన్నిస్ స్టార్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ పారిస్ ఒలింపిక్స్‌లో పతకం దిశగా దూసుకెళుతున్నాడు. ఈ సెర్బియా కింగ్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ చేరాడు. బుధవారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్స్ పోరులో జొకోవిచ్ 7-5, 6-3తో జర్మనీకి చెందిన డొమినిక్ కోఫెర్‌ను వరుససెట్లలో ఓడించాడు. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో పాటు పలుమార్లు వరల్డ్ నెంబర్‌వన్ ర్యాంక్‌ను కూడా అందుకున్న 37 ఏళ్ల జొకోవిచ్ ఖాతాలో ఒలింపిక్స్ స్వర్ణ పతకం మాత్రం లేదు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అతను కాంస్యం గెలిచాడు. కాగా, ఒలింపిక్స్‌లో క్వార్టర్స్ చేరడం జొకోవిచ్‌కు ఇది నాలుగోసారి. దీంతో విశ్వక్రీడల్లో టెన్నిస్‌ను తిరిగి ప్రవేశపెట్టిన (1988) తర్వాత అత్యధికసార్లు క్వార్టర్స్ చేరిన ఆటగాడిగా జొకో రికార్డుకెక్కాడు.

ఆసీస్ చేపకే చిక్కింది

» 100 మీ. బ్యాక్‌స్ట్రోక్ టైటిల్ నిలబెట్టుకున్న కేలీ

» రెగాన్ స్మిత్‌కు రజతం



రేగన్ స్మిత్ / కేలీ మెక్యూయెన్

స్విమ్మింగ్ సంచలనం కేలీ మెక్యూయెన్ మళ్లీ కొట్టేసింది. ఆస్ట్రేలియాకు చెందిన ఈ క్వీన్.. మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో ఒలింపిక్స్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. టోక్యోలో టైటిల్ నెగ్గిన 23 ఏళ్ల కేలీ.. పారిస్‌లోనూ సత్తాచాటుతూ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ రేసును కేలీ 57.33 సెకన్లలో ముగించి వరుసగా రెండోసారి పసిడి పట్టేసింది. ఇక, గతనెల యూఎస్ ట్రయల్స్‌లో 57.13 సెకన్ల టైమింగ్‌తో కేలీ పేరిటనున్న ప్రపంచ రికార్డు (57.33 సె)ను బద్ధలుకొట్టి ఫేవరెట్‌గా పారిస్‌లో అడుగుపెట్టిన అమెరికా స్టార్ రేగన్ స్మిత్.. అసలు పోటీకొచ్చేసరికి తేలిపోయింది. రేగన్ స్మిత్ ఫైనల్ రేసులో 57.66 సెకన్లతో రజత పతకానికి పరిమితమైంది. కాగా, టోక్యో క్రీడల్లో కాంస్యంతోనే సరిపెట్టుకున్న 22 ఏళ్ల స్మిత్ ఈసారి మాత్రం పతక ప్రదర్శనను మెరుగుపరచుకోవడం విశేషం. అమెరికాకే చెందిన కేథరిన్ బెర్కాఫ్ (57.98 సె)కు కాంస్యం దక్కింది.

పారిస్‌లో నేటి భారతం




అథ్లెటిక్స్: పురుషుల 20 కి.మీ రేస్ వాక్ - పరమ్‌జీత్, వికాస్, ఆకాశ్ (ఉ. 11), మహిళల 20 కి.మీ రేస్ వాక్ - ప్రియాంక గోస్వామి (మ. 12.50)
గోల్ఫ్: పురుషుల వ్యక్తిగత ఫైనల్స్ - గగన్‌జీత్ భుల్లార్, శుభాంకర్ శర్మ (మ. 12.30);
షూటింగ్: పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్స్ - స్వప్నిల్ కుశాలె (మ. 1); మహిళల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫికేషన్స్- సిఫ్త్ కౌర్, అంజుమ్ మోద్గిల్ (మ. 3.30);
హాకీ గ్రూప్ దశ: భారత్ x బెల్జియం (మ. 1.30);
బాక్సింగ్: మహిళల 50 కిలోల ప్రీక్వార్టర్స్ - నిఖత్ జరీన్ x యూ వూ (చైనా) (మ. 2.30);
ఆర్చరీ: పురుషుల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ (1/32 రౌండ్) - ప్రవీణ్ జాదవ్ x కావో వెన్‌చావో (చైనా) (మ. 2.30);
టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్స్ (మ. 1.30);
సెయిలింగ్: పురుషుల డింగీ రేస్ 1, 2 - విష్ణు శవరణన్ (మ. 3.45); మహిళల డింగీ రేస్ 1, 2 - నేత్ర కుమనన్ (రా. 7.05).

శ్రీజ.. స్పెషల్ విన్



ఆకట్టుకొనే ప్రదర్శన చేస్తున్న తెలుగమ్మాయి శ్రీజ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. మహిళల సింగిల్స్ రౌండ్-32లో శ్రీజ 4-2తో జియాంగ్ జెన్ (సింగపూర్)పై గెలిచింది. తొలి గేమ్‌లో 9-11తో ఓడినా.. ఆ తర్వాత గొప్పగా పోరాడిన శ్రీజ.. తన 26వ పుట్టిన రోజును చిరస్మరణీయం చేసుకొంది. ప్రీ క్వార్టర్స్‌లో వరల్డ్ నెం:1 సన్ యింగ్‌షా (చైనా)తో శ్రీజ తలపడనుంది. కాగా, సింగిల్స్‌లో మనికా పోరాటం ముగిసింది. రౌండ్-16లో బాత్రా 1-4తో హినానో మ్యూ (జపాన్) చేతిలో ఓడింది.

అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూత



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్, చీఫ్ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూశాడు. కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 71 ఏళ్ల అన్షుమన్ బుధవారం రాత్రి బరోడాలో తుదిశ్వాస విడిచాడు. లండన్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న గైక్వాడ్ గతనెలలోనే స్వదేశం తిరిగొచ్చాడు. కాగా, ఇటీవల గైక్వాడ్ చికిత్సకు ఆర్థిక సాయం చేయాలంటూ టీమిండియా మాజీ కెప్టెన్లు కపిల్ దేవ్, గవాస్కర్ విన్నపం చేయడంతో.. భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) కోటి రూపాయలు విడుదలజేసిన సంగతి తెలిసిందే. బరోడాకు చెందిన గైక్వాడ్ 1975-87 మధ్యకాలంలో భారత్ తరఫున 40 టెస్టులు, 15 వన్డేల్లో ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో 1985 పరుగులు చేసిన గైక్వాడ్.. పాకిస్థాన్‌పై మ్యాచ్‌లో డబుల్ (201) సెంచరీతో అదరగొట్టాడు. ఈ మ్యాచ్‌లో 11 గంటలపాటు క్రీజులో నిలిచిన గైక్వాడ్.. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యంత నెమ్మదిగా ద్విశతకం సాధించిన క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. అలాగే జమైకా వేదికగా వెస్టిండీస్‌తో టెస్టు మ్యాచ్‌లో మైకేల్ హోల్డింగ్‌లాంటి అరివీర భయంకర పేసర్లను హెల్మెట్ లేకుండా ఎదుర్కొనడం గైక్వాడ్ కెరీర్‌లో ప్రత్యేకమైనది. గైక్వాడ్ రిటైర్మెంట్ అనంతరం టీమిండియా ప్రధాన కోచ్‌గానూ వ్యవహరించాడు. గైక్వాడ్ శిక్షణలో భారత జట్టు 2000 సంవత్సరంలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో రన్నరప్‌గా నిలిచింది. గైక్వాడ్ మృతిపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీసీసీఐ కార్యదర్శి జైషా, మాజీ క్రికెటర్లు సంతాపం ప్రకటించారు.

100 మీ. రేసు నుంచి వైదొలగిన షెరికా జాక్సన్



జమైకా స్టార్ అథ్లెట్ షెరికా జాక్సన్ పారిస్ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల రేసు నుంచి వైదొలగుతున్నట్టు బుధవారం ప్రకటించింది. కారణమేంటన్నది వెల్లడించని ఆమె.. 200 మీటర్ల రేసులో మాత్రం పోటీపడతానని స్పష్టం చేసింది. 30 ఏళ్ల షెరికా.. గత టోక్యో క్రీడల్లో వంద మీటర్లలో కాంస్య పతకం సాధించింది. షెరికా వైదొలగడంతో ఆమెకు గట్టిపోటీదారుగా భావిస్తున్న అమెరికా స్టార్, ప్రపంచ విజేత షా కారి రిచర్డ్‌సన్‌కు మార్గం సులువయ్యే చాన్సుంది. ఇక, ఈ రేసులో డిఫెండింగ్ చాంపియన్ అయిన ఎలాని థాంప్సన్ హెరా గాయం కారణంగా పారిస్ పోటీలకు దూరమైంది. జమైకాకు చెందిన వెటరన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ విజేత (2008, 2012) షెల్లీ అన్‌ఫ్రేజర్ కూడా 100 మీటర్ల రేసు బరిలో ఉంది.

ప్రీక్వార్టర్స్‌కు దీపిక

ఫామ్ కోసం తంటాలు పడుతున్న సీనియర్ ఆర్చర్ దీపిక కుమారి ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. రెండో రౌండ్‌లో దీపిక 6-2తో క్వింటీ రోఫెన్ (నెదర్లాండ్స్)పై సునాయాసంగా నెగ్గి రౌండ్-16కు చేరుకొంది. శనివారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో మిషెల్లీ క్రోపన్ (జర్మనీ)తో దీపిక తలపడనుంది. పురుషుల వ్యక్తిగత విభాగం తొలి రౌండ్‌లోనే తరుణ్‌దీప్ రాయ్ వెనుదిరిగాడు. రౌండ్-64లో రాయ్ 4-6తో టామ్ హాల్ (బ్రిటన్) చేతిలో ఓడాడు.

అనూష్ అవుట్..

ఈక్వెస్ట్రియన్‌లో బరిలోకి దిగిన తొలి భారత రైడర్ అనూష్ అగర్వాల ఫైనల్‌కు చేరుకోలేక పోయాడు. ఆసియాడ్ పతక విజేత అనూష్.. డ్రెస్సేజ్ ఈవెంట్ గ్రూప్-ఈ క్వాలిఫయర్స్‌లో 66.444 స్కోరు మాత్రమే చేసి తొమ్మిదో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు అర్హత సాధించలేక పోయాడు. అయితే, ఒలింపిక్స్ డ్రెస్సేజ్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన మొదటి భారత ఈక్వెస్ట్రియన్‌గా మాత్రం అనూష్ రికార్డులకెక్కాడు.

పన్వర్‌కు ఆరో స్థానం

పతకం రౌండ్ నుంచి అవుటైన రోయర్ బల్‌రాజ్ పన్వర్.. సింగిల్స్ స్కల్స్‌లో ఆరోస్థానంతో ఫైనల్ 'డి'కి చేరుకొన్నాడు. ఫైనల్ 'డి' అనేది 19-24 స్థానాల వర్గీకరణ ఈవెంట్.



'సూపర్ ఉమన్'

పారిస్ ఒలింపిక్స్ మహిళల రగ్బీ మ్యాచ్‌లో అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. బ్రిటన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ స్టార్ ఎరిన్ కింగ్ 'సూపర్ హ్యూమన్' తరహాలో తన శక్తియుక్తులను ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మరో ఐదు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. ప్రత్యర్థి బ్రిటన్ జట్టు క్రీడాకారిణులు బంతిని ఐర్లాండ్ జట్టు సభ్యురాలైన ఎమిలీ లేన్ లక్ష్యంగా విసిరేశారు. దీన్ని పసిగట్టిన ఎరిన్.. లిప్తపాటులో ఎమిలీని అమాంతం పైకి ఎత్తేయడం.. ఆమె బంతిని అందుకోవడం క్షణాల్లో జరిగిపోయాయి. అంతేకాదు, ఎంతబలంగా పైకి ఎత్తుకుందో అంతే చాకచక్యంగా ఎమిలీని గాయాలపాలవకుండా కిందకు దించిన ఎరిన్ 'సూపర్ ఉమన్'ను అనిపించుకుంది. కాగా, ఈ మ్యాచ్‌లో బ్రిటన్ 28 -12తో ఐర్లాండ్‌పై గెలిచింది.

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
చైనా	8	7	3	18
జపాన్	8	3	4	15
ఫ్రాన్స్	7	9	8	24
ఆస్ట్రేలియా	7	4	3	14
బ్రిటన్	6	6	5	17
కొరియా	5	3	3	11
అమెరికా	4	13	12	29
ఇటలీ	3	6	4	13
కెనడా	2	2	3	7
జర్మనీ	2	2	1	5
భారత్	0	0	2	2


గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.



అసలంకకే వన్డే పగ్గాలు

కొలంబో: శ్రీలంక జట్టు కొత్త వన్డే కెప్టెన్‌గా చరిత్ అసలంక నియమితుడయ్యాడు. ఆగస్టు 2 నుంచి భారత్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు లంక జట్టును సెలెక్టర్లు బుధవారం ప్రకటించారు. కుశాల్ మెండిస్ స్థానంలో అసలంకకు జట్టు పగ్గాలు అప్పగించారు. హసరంగ తప్పుకోవడంతో.. భారత్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు చరిత్ సారథిగా వ్యవహరించాడు. ఇప్పుడు వన్డే కెప్టెన్సీ కూడా అప్పగించారు.

ఉత్సాహం.. ఉద్వేగం.. ఉత్కంఠ!



నేటినుంచి ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు

పారిస్: చిరుతల్లా దూసుకుపోయే రన్నర్లు..కిలోమీటర్ల కొద్దీ అలవోకగా నడిచే అథ్లెట్లు..అడ్డంకులను సునాయాసంగా దాటేసే హర్డలర్లు..ఫ్యాన్స్‌లో ఉత్సాహం, ఉద్వేగం అంతకుమించి ఉత్కంఠ కలిగించే పోటీలు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లు. ఒలింపిక్స్‌కే తలమానికమైన ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలకు గురువారం తెరలేవనుంది. విశ్వక్రీడల్లో మొత్తం 32 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నా..ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లకు ఉండే క్రేజే వేరు. పురుషులు, మహిళల విభాగాల్లో 23 అంశాల చొప్పున, రెండు మిక్స్‌డ్ ఈవెంట్లు (4x400మీ. మిక్స్‌డ్ రిలే, 35 కి.మీ. మిక్స్‌డ్ రేస్ వాక్) కలిపి మొత్తం 48 అంశాల్లో అథ్లెట్లు ఈసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

వీటికి మరింత క్రేజ్: ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీల్లో 100 మీ. స్ప్రింట్‌కు ఉన్న క్రేజే వేరు. అమెరికన్ ద్వయం నోవా లైల్స్, షా కారీ రిచర్డ్‌సన్ ఈ సారి పురుషులు, మహిళల 100 మీ. పరుగులో హాట్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. పురుషుల విభాగంలో ఇటలీకి చెందిన ఒలింపిక్ చాంపియన్ మార్సెల్ జాకబ్ నుంచి నోవాకు తీవ్ర పోటీ ఎదురయ్యే అవకాశముంది. అమెరికాకే చెంది న ఇరియాన్ నైటన్, లెసిలీ టెబాగో (బోట్స్వానా) కూడా గట్టి పోటీ ఇచ్చే చాన్సుంది. ఇక మహిళల 100 మీ.లలో రెండుసార్లు డిఫెండింగ్ చాంపియన్ ఎలానీ థాంప్సన్ (జమైకా) లేకపోవడం టైటిల్ రేసులో రిచర్డ్‌సన్‌కు కలిసి రానుంది. అలాగే జమైకా స్ప్రింటర్ షెరికా జాక్సన్ ఈసారి 100 మీ.లకు దూరంగా ఉన్నట్టు ప్రకటించడంతో రిచర్డ్‌సన్‌కు మరింత సానుకూలం కానుంది. అయితే ఐదో, ఆఖరి ఒలింపిక్స్‌లో తలపడుతున్న జమైకా క్వీన్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్..రిచర్డ్‌సన్‌కు సవాలు విసురుతోంది. ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్ అర్మాండ్ డుప్లాంటిస్ పురుషుల పోల్‌వాల్ట్‌లో వరల్డ్ రికార్డుకు గురిపెట్టాడు. మహిళల 400 మీ హర్డిల్స్‌లో సిడ్నీ మెక్‌లాలిన్ ప్రపంచ రికార్డును బద్దలుగొట్టాలని పట్టుదలగా ఉంది. కెన్యా సూపర్ స్టార్ ఫెయిత్ కిపోయేగన్ మహిళల 1500 మీ. పరుగులో చారిత్రక హ్యాట్రిక్ పసిడి పతకమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. మహిళల హైజంప్‌లో యరోస్లావా మహూచిక్ గతనెలలో తాను నెలకొల్పిన వరల్డ్ రికార్డును మరోసారి తిరగరాయాలని భావిస్తోంది. చిరకాల ప్రత్యర్థులు ఎలుద్ కిప్చోగే (కెన్యా), కెనీనిసా బెకెలె (ఇథియోపియా) పురుషుల మారథాన్‌లో స్వర్ణం కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు.

ఆశలన్నీ చోప్రాపైనే..

మొత్తం 29 మంది భారత అథ్లెట్లు ట్రాక్ అండ్ ఫీల్డ్ బరిలో దిగుతున్నారు. 16 పతక విభాగాల్లో మనోళ్లు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నా..జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే అందరి దృష్టి నిలిచింది. టోక్యో ఒలింపిక్స్‌లో చారిత్రక స్వర్ణ పతకం సొంతం చేసుకున్న 26 ఏళ్ల నీరజ్ మళ్లీ ఆ ఫీట్‌తో ఇంకోసారి చరిత్ర తిరగ రాస్తాడని బలంగా విశ్వసిస్తున్నారు. తెలుగు అథ్లెట్లు యర్రాజీ జ్యోతి (100 మీ. హర్డిల్స్), జ్యోతిక శ్రీ దండి (4x400మీ. రిలే) తొలి ఒలింపిక్స్‌లో ఎలా రాణిస్తారో చూడాలి.

నేడు బరిలో ప్రియాంక, ఆకాశ్, వికాస్, బిస్త్

ట్రాక్ అండ్ ఫీల్డ్ తొలిరోజు పోటీలలో భారత్ తరఫున ప్రియాంక గోస్వామి మహిళల 20 కి.మీ రేస్ వాక్‌లో, పరమ్‌జీత్‌సింగ్ బిస్త్, ఆకాశ్‌దీప్, వికాస్ సింగ్ పురుషుల 20 కి.మీ. రేస్ వాక్‌లో పోటీపడనున్నారు.

కౌన్సెలింగ్

నా వయస్సు 35 ఏళ్లు. ఈ మధ్యకాలంలో చాలా విషయాలు మర్చిపోతున్నాను. దీనికి కారణాలేమిటి? నాకు ఏదైనా వ్యాధి వచ్చిందా?

Q A

మర్చిపోతున్నారా?

మీ వయస్సులో మతిమరపు రావటానికి నిద్రలేమి, ఒత్తిడి, సరైన ఆహారం తీసుకోకపోవటం వంటివి ప్రధాన కారణాలని చెప్పవచ్చు. ఈ కింది సూచనలు పాటిస్తే- మతిమరుపు తగ్గుతుంది.

మెదడుకు పదను పెట్టాలి: మెదడు ఎప్పుడూ పనిచేస్తూ ఉండాలి. దానికి పదును పెట్టినప్పుడే అది మరింత చురుకుగా పనిచేస్తుంది. అందువల్ల సమయం దొరికినప్పుడు పజిల్స్, క్రాస్ వర్డ్స్ వంటివి చేస్తూ ఉంటే మెదడు చురుకుగా పనిచేస్తుంది.

వ్యాయామం అవసరం: చాలా మంది మెదడుకు శరీరానికి మధ్య సంబంధం ఉండదనుకుంటారు. కానీ శారీరకంగా చురుకుగా ఉంటే రక్తప్రసరణ బాగా జరుగుతుంది. రక్తప్రసరణ బాగా జరిగితే మెదడు చురుకుగా పనిచేస్తుంది. అంతే కాకుండా వ్యాయామం చేస్తే కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. ఇవి మెదడులో న్యూరాన్ల విడుదలకు సాయం చేస్తాయి.



ఆరోగ్యకరమైన ఆహారం: మెదడు చురుకుగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం, పళ్లు, కూరలు ఎక్కువగా తినటం వల్ల మతిమరుపు తొలగిపోతుంది. చిన్నప్పటి నుంచి ఆరోగ్యకరమైన ఆహారం తినేవారిలో మెదడు చురుకుగా పనిచేస్తుందని నిపుణుల పరిశోధనల్లో తేలింది.

నిద్ర కూడా: మతిమరుపునకు నిద్ర లేమి కూడా ఒక కారణం. మనం నిద్రపోయినప్పుడు మెదడు జ్ఞాపకాలను ఒక క్రమపద్ధతిలో పెట్టుకుంటుంది. అవి అవసరమయినప్పుడు బయటకు వస్తూ ఉంటాయి. సరిగ్గా నిద్రపోకపోతే మెదడు పనితీరు అస్తవ్యస్తమవుతుంది. ఎక్కువ విషయాలు గుర్తుకురావు. అందువల్ల రోజుకు కనీసం 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం.

ఒత్తిడి: మానసిక ఒత్తిడి వల్ల కూడా మతిమరుపు వస్తుంది. ఈ ఒత్తిడిని తొలగించుకోవటానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి. దానితో పాటుగా వ్యక్తిగత క్రమశిక్షణ కూడా అవసరమే!

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/4LCZTYMలో చదవండి.



ఉక్రెయిన్ యుద్ధంలో పోరాడిన ఒక సైనికురాలు శివభక్తురాలిగా మారి, పురాతన బ్రహ్మసూత్ర శివలింగాల కోసం అన్వేషణ ప్రారంభిస్తే? ఆ అన్వేషణలో భాగంగా- థాయ్‌లాండ్‌లోని కొన్ని పురాతన గుళ్లను పునరుద్ధరిస్తే? ఇదంతా చదువుతుంటే సినిమా కథలా అనిపిస్తోంది కదా.. కానీ ఇది లిదియా లక్ష్మీ కథ. కొన్ని వేల ఏళ్ల క్రితం అగస్త్య మహాముని ప్రతిష్ఠించాడని భావించే బ్రహ్మసూత్ర శివలింగాల వెతుకులాట గురించి ఆమె మాటల్లోనే..



నా అన్వేషణ



"ఈ ప్రపంచంలో అత్యంత పురాతనమైనది సనాతన ధర్మమని నేను నమ్ముతాను. దీన్ని అనుసరిస్తే ఈ ప్రపంచమంతా సుఖశాంతులతో ఉంటుందనేది నా భావన. ఈ ధర్మ ప్రచారం కోసం అనేకమంది గొప్పవారు భారత దేశం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించారు. అక్కడ మన ధర్మాన్ని ప్రవచించారు. రెండేళ్ల క్రితం- 'శివపురాణం' చదువుతున్న సమయంలో కొన్ని విషయాలు నా దృష్టిని ఆకర్షించాయి. సుమారు రెండువేల ఏళ్ల క్రితం దక్షిణ భారత దేశానికి చెందిన కొందరు బ్రాహ్మణులు- శివ మత ప్రతిష్ఠాపన కోసం ఇప్పటి థాయ్‌లాండ్, వియత్నాం వంటి ప్రాంతాలకు ప్రయాణం సాగించారు. వీరు ఈ ప్రాంతాలకు వెళ్లటానికి ఒక కారణం ఉంది. కొన్ని వేల ఏళ్ల క్రితం అగస్త్య మహాముని- భారత దేశం నుంచి ఈ ప్రాంతాలకు వెళ్లాడు. అక్కడ అనేక ఆలయాలను నిర్మించాడు. వాటిలో బ్రహ్మసూత్ర శివలింగాలను ప్రతిష్ఠించాడని మన పురాణాలలో ఉంది. ఆ మహాముని ద్వారా స్ఫూర్తి పొందిన కొందరు- ఆయన బాటలో ప్రయాణించారు. అనేక ఆలయాలను నిర్మించారు. వాటిలో కేవలం శివాలయాలు మాత్రమే కాదు... వేంకటేశ్వర స్వామి, అమ్మవారు, ఆదిపరాశక్తి, అఘోర గణపతి తదితర ఆలయాలు కూడా ఉన్నాయి. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. పురాణాలు అనగానే చాలామంది- చారిత్రక ఆధారం లేదని అనుకుంటారు. కానీ ఈ విషయంలో మాత్రం అనేక చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇప్పటికీ పురాణాల్లో పేర్కొన్న ప్రాంతాల్లో వివిధ ఆలయాలు, కొన్ని చోట్ల బ్రహ్మసూత్ర శివలింగాలు ఉన్నాయి. ఆ ఆలయాలను గుర్తించి... వాటి విశిష్టతను, చరిత్రను ప్రపంచానికి తెలియజేయాలనే సంకల్పంతో యాత్రను ప్రారంభించాను. అయితే మార్గమధ్యంలో మా యాత్ర మరో మలుపు తిరిగింది. దీనికి కారణం- తామ్ర లింగం. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన లింగం అది. సూర్య భగవానుడు- సూర్యవంశస్థులకు దాన్ని ఇచ్చాడని, దానికి వారు నిత్యం పూజ చేసేవారని, వారి పూజలకు భంగం కలిగే పరిస్థితులు రావటంతో... దాన్ని వారు ఇతర దేశాలకు పంపేశారనే కథలు వినిపిస్తూ ఉంటాయి. ఈ కథల విషయం పక్కన పెడితే- అత్యంత పురాతనమైన ఈ లింగం చాలాకాలం థాయ్‌లాండ్‌లోని దక్షిణ భాగంలో ఉండేది. ఆ తర్వాత దాన్ని కొందరు వియత్నాంకు తరలించారు. ప్రస్తుతం అది వియత్నాంలోనే ఉంది. దాన్ని ఎలాగైనా గుర్తించి, ఆలయం కట్టించాలనే సంకల్పమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది.

> **బ్రహ్మసూత్ర లింగమంటే..**
> సాధారణంగా శివలింగాలు నున్నగా ఉంటాయి. కానీ కొన్ని శివలింగాలపై కొన్ని ప్రత్యేకమైన ఆకృతులు చెక్కబడి ఉంటాయి. వీటినే బ్రహ్మసూత్ర లింగాలంటారు. వీటిని శక్తిమంతమైన లింగాలుగా భావిస్తారు.

తొలి అడుగులు..

పురాణాల ఆధారంగా చరిత్రను పునర్నిర్మించే దిశగా నా తొలి అడుగు పడింది థాయ్‌లాండ్‌లోని నకోన్ సి తామ్‌రాత్‌లో. దక్షిణ థాయ్‌లాండ్‌లోని ఈ ప్రాంతానికి 'తామర్లింగ్' అనే పేరు కూడా ఉంది. ఇక్కడకు సమ్రాట్ అశోకుడు కూడా వచ్చాడని, శివలింగ పూజ చేశాడని ఇక్కడివారు చెబుతూ ఉంటారు. ఈ ప్రాంతంలో అనేకచోట్ల శివలింగాలు లభ్యమయ్యాయి. అవన్నీ బ్రహ్మసూత్ర శివలింగాలు కావటం విశేషమనే చెప్పాలి. థాయ్‌లాండ్ ప్రభుత్వానికి చెందిన పురావస్తుశాఖ ఆ ప్రాంతంలో అనేక తవ్వకాలు జరిపి.. అశోకుడి కాలంనాటి అనేక శివలింగాలను వెలికితీసింది. వీటిలో ఒక అతి శక్తిమంతమైన బ్రహ్మసూత్ర శివలింగం కూడా ఉంది. 2018లో ప్రభుత్వాలు, స్థానికుల సహకారంతో ఒక గుడిని నిర్మించి, దానిలో ఆ లింగాన్ని ప్రతిష్ఠించాం. కొన్ని వేల ఏళ్ల తర్వాత మళ్లీ ఈ శివలింగం పూజలు అందుకోవటం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని పాలకొల్లుకు చెందిన కొందరు పండితులతో పాటు భారత, థాయ్ ప్రభుత్వ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఆ తరువాత... అక్కడ నుంచి మన పూర్వీకులు ప్రయాణించిన ప్రాంతాలను పేర్ల ఆధారంగా గుర్తిస్తున్నాం. దక్షిణ థాయ్‌లాండ్‌లో అనేక ప్రాంతాల్లో మనకు బ్రహ్మసూత్ర శివలింగాలు కనిపిస్తాయి. వీటి వెనక ఉన్న చరిత్రకు కూడా ఆధారాలు ఉన్నాయి. ఉదాహరణకు ఇటీవలే ఈ ప్రాంతంలో కొన్ని శాసనాలను గుర్తించాను. థాయ్ పరిశోధకులు వీటిని చోళుల కాలానికి చెందినవిగా భావిస్తూ వచ్చారు. కానీ ఈ శాసనలు బ్రహ్మీ లిపిలో ఉన్నాయి. వాటి ఫొటోలను, వీడియోలను హైదరాబాద్‌లోని 'ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' (ఏఎస్ఐ) సిబ్బందికి పంపితే- ఇవి 6 నుంచి 8వ శతాబ్దం నాటివిగా నిర్ధారించారు. అంటే ఆ సమయానికి థాయ్‌లాండ్‌లో మన హైందవ మతం వ్యాప్తి చెంది, పరిఢవిల్లుతోందని చెప్పవచ్చు.

> **అనుభవాలెన్నో...**
> తామర్లింగ్ ప్రాంతంలో ఒక గొప్ప బ్రహ్మసూత్ర శివలింగం ఉంది. 2016లో దాన్ని అక్కడి స్మగర్లు విదేశాలకు తరలించటానికి ప్రయత్నిస్తుంటే అధికారులు పట్టుకొన్నారు. తిరిగి తామర్లింగ్ ప్రాంతానికి చేర్చారు. దానికి అక్కడే గుడి కట్టాం. అయితే ఈ క్రమంలో ఆశ్చర్యకరమైన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆ లింగాన్ని తరలించటంలో 35 మంది పాత్ర ఉందని పోలీసులు నిర్ధారించారు. వారిలో స్మగ్లర్లు, కస్టమ్స్ అధికారులు, పోలీసులు- ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరూ ఏడాది తిరిగే లోపు రకరకాల కారణాల వల్ల మరణించారు. శివలింగాన్ని తరలించటానికి వారు చేసిన ప్రయత్నాలే చావులకు కారణమయ్యాయని స్థానికులు భావిస్తూ ఉంటారు.

తుది లక్ష్యం..

అగస్త్య మహాముని పూజించిన తామ్రలింగాన్ని గుర్తించి దాన్ని భారతదేశానికి తిరిగి తీసుకురావటమే నా లక్ష్యం. ఈ ప్రయాణంలో నాకు మరచిపోలేని అనేక అనుభవాలు ఎదురవుతున్నాయి. అగస్త్య మహాముని రకరకాల లోహాలతో చేసిన లింగాలను అనేక ప్రాంతాల్లో ప్రతిష్ఠించాడని కూడా చెబుతారు. అలాంటి లింగాలను ఇప్పుడు మనం వియత్నాం పురావస్తు ప్రదర్శనశాలల్లో చూడవచ్చు. ఇదే విధంగా తామ్రలింగం కూడా వియత్నాంలోనే ఉందనటానికి అనేక ఆధారాలున్నాయి. వీటిని వెతుకుతూ త్వరలోనే వియత్నాం చేరుకుంటాను. ఈ ప్రయత్నంలో నాకు సహకరిస్తున్న సహచరులందరికీ కృతజ్ఞతలు చెప్పాలి. నాకు శృంగేరీ పీఠం ఇస్తున్న నైతిక మద్దతు వెలకట్టలేనిది. అలాగే అనేక రకాలుగా సహకరిస్తున్న థాయ్, భారత ప్రభుత్వాలకు కూడా ధన్యవాదాలు చెప్పితీరాలి. మన పురాణాలలో ఉన్నదంతా కల్పన కాదు. దానిలో చరిత్ర కూడా ఉంది. దాన్ని వెలికితీస్తే మన దేశం మరోసారి విశ్వగురువుగా మారుతుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

బిజినెస్

అమెరికాలో వడ్డీ రేట్లు యథాతథం

వాషింగ్టన్: స్వల్పకాలిక వడ్డీ రేట్లను యథాతథంగా 5.25-5.5 శాతం వద్ద కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్' నిర్ణయించింది. బుధవారం చైర్మన్ జెరోమ్ పోవెల్ అధ్యక్షతన జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గత ఏడాది కాలంగా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇదే స్థాయిలో కొనసాగిస్తోంది. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం దిగువకు వస్తే సెప్టెంబరులో జరిగే భేటీలో వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందని పోవెల్ స్పష్టమైన సంకేతం ఇచ్చారు.

ఇన్ఫోసిస్‌కు 32,403 కోట్ల జీఎస్‌టీ నోటీస్

న్యూఢిల్లీ: దేశంలోని రెండో పెద్ద ఐటీ సర్వీసుల కంపెనీ ఇన్ఫోసిస్‌కి రూ.32,403 కోట్ల జీఎస్‌టీ ఎగవేతకు సంబంధించి ప్రీ షోకాజ్ నోటీసు జారీ అయింది. బీఎస్ఈకి పంపిన సందేశంలో ఇన్ఫోసిస్ ఈ విషయం వెల్లడించింది. 2017 జూలై నుంచి 2022 మార్చి నెలల మధ్య కాలానికి కర్ణాటక రాష్ట్ర జీఎస్‌టీ అధికారులు ఈ నోటీసు జారీ చేశారని, ఆ నోటీసుకు తమ స్పందన కూడా తెలియచేశామని పేర్కొంది. ఇన్ఫోసిస్‌కు చెందిన విదేశీ కార్యాలయాలు చేసిన ఖర్చులపై జీఎస్‌టీ చెల్లించలేదన్నది ఆ నోటీసు సారాంశమని, కాని అలాంటి వ్యయాలపై జీఎస్‌టీ వర్తించదని తాము విశ్వసిస్తున్నామని కంపెనీ తెలిపింది. చెల్లించాల్సిన జీఎస్‌టీ బకాయిలన్నింటినీ ఇన్ఫోసిస్ కట్టేసిందని, తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలన్నీ తాము పాటిస్తున్నామని కంపెనీ స్పష్టం చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▲	64,000 ▲	91,000 ▲
ముంబై	69,309 ▲	63,487 ▲	82,974 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	513	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	103
కరీంనగర్	94	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	103
కర్నూలు	94	నెల్లూరు	103
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

ఓరియంట్ రేసులో

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్!

ప్రమోటర్లకు చెందిన 63.9% వాటా కొనుగోలుకు చర్చలు

అదానీ, అల్ట్రాటెక్‌లతో పోటీ పడే యోచన



న్యూఢిల్లీ: దేశ సిమెంట్ రంగంలో పోటీ తీవ్రమవుతోంది. పెద్ద కంపెనీలు చిన్న కంపెనీలను టేకోవర్ చేసే ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. తాజాగా సజ్జన్ జిందాల్ నాయకత్వంలోని జేఎస్‌డబ్ల్యూ సిమెంట్.. సీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన ఓరియంట్ సిమెంట్‌ను టేకోవర్ చేసేందుకు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఇందుకోసం సీకే బిర్లా, ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉన్న 63.9 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఇందుకోసం రూ.4,546 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే రెండు కంపెనీలు ఈ వార్తలపై నోరు మెదపడం లేదు.

ఎందుకంటే ?

ఓరియంట్ సిమెంట్‌కు తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దేవాపూర్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 85 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. దీనికి తోడు పెద్దమొత్తంలో నాణ్యమైన సున్నపురాయి నిక్షేపాల గనులు ఉన్నాయి. ఈ గనుల నుంచి ఏటా 80 లక్షల టన్నుల సున్నపు రాయిని వెలికి తీయవచ్చు. ఈ నిక్షేపాలతో కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 1.6 కోట్ల టన్నులకు విస్తరించే అవకాశం ఉంది. దీంతో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్.. ఓరియంట్ సిమెంట్‌పై ఆసక్తి చూపిస్తోంది. ఈ టేకోవర్ ద్వారా సిమెంట్ మార్కెట్లో అదానీ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలతో గట్టిగా పోటీపడవచ్చని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ భావిస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ, ఇండియా సిమెంట్‌ను టేకోవర్ చేస్తున్న సమయంలోనే జేఎస్‌డబ్ల్యూ సిమెంట్.. ఓరియంట్ సిమెంట్ టేకోవర్ కోసం చర్చలు జరుపుతున్నట్టు వార్తలు రావడం విశేషం.

> **వాల్యుయేషన్ దగ్గరే పీటముడి**
> నిజానికి ఓరియంట్ సిమెంట్ ఈక్విటీలో ప్రమోటర్లకు ఉన్న మెజారిటీ వాటా కొనుగోలు కోసం అల్ట్రాటెక్ కంపెనీ కూడా చర్చలు జరుపుతోంది. అయితే వాల్యుయేషన్ దగ్గరకి వచ్చేసరికి ఈ చర్చలు ముందుకు సాగడం లేదు. ప్రమోటర్ సీకే బిర్లా, ఆయన కుటుంబ సభ్యులు.. కంపెనీ ఆస్తులు, అప్పులతో కలిపి టన్నుకు 110 నుంచి 112 డాలర్లు (సుమారు రూ.9,209-రూ.9,376) అడుగుతున్నట్టు తెలుస్తోంది. ఇందుకు అంగీకరిస్తే ఓరియంట్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పరమవుతుందని భావిస్తున్నారు. మొత్తం మీద సిమెంట్ రంగంలో మరో భారీ టేకోవర్‌కు రంగం సిద్ధమవుతోంది.

మార్కెట్..అదే జోరు
కొత్త శిఖరాలపై సూచీలు

ముంబై: చారిత్రక గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలని ఎన్ని హెచ్చరికలు వెలువడుతున్నా ఈక్విటీ మార్కెట్లో జోరు యథాతథంగా కొనసాగుతూనే ఉంది. వరుసగా నాలుగో రోజు కూడా సూచీలు రికార్డు ప్రయాణం కొనసాగించాయి. మెటల్, పవర్, కొన్ని ఆటో రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో బుధవారం సెన్సెక్స్ 285.94 పాయింట్లు లాభపడి 81,741.34 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 372.64 పాయింట్ల మేరకు దూసుకుపోయి 81,828.04 పాయింట్లను తాకింది. అలాగే నిఫ్టీ 24,969.35 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకి చివరికి 93.85 పాయింట్ల లాభంతో 24,951.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు ఇంట్రాడేలోను, ముగింపులోనూ చారిత్రక గరిష్ఠ స్థాయిలే నమోదు చేశాయి. సెన్సెక్స్ షేర్లలో 20 లాభపడగా 10 నష్టాలతో ముగిశాయి.

మరో కొత్త శిఖరంపై మార్కెట్ విలువ: బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ మరో కొత్త శిఖరాన్ని అధిరోహించింది. వరుసగా నాలుగో రోజు కూడా ఏర్పడిన ర్యాలీతో ఇది జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.462.38 లక్షల కోట్లకు (5.52 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

ఆగస్టు 6న రెండు ఐపీఓలు: ఈ నెల 6వ తేదీన రెండు ఐపీఓలు మార్కెట్లోకి రానున్నాయి. వాటిలో ఒకటి ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ ఇష్యూ కాగా రెండోది యునికామర్స్ ఈ-సొల్యూషన్స్ ఇష్యూ. రెండూ ఆగస్టు 8వ తేదీనే ముగుస్తాయి. బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ రూ.1,666 కోట్ల విలువ గల తాజా ఈక్విటీ షేర్లు మార్కెట్లో జారీ చేయనుంది.

మారుతి లాభంలో 47% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) నికర లాభం ఏకంగా 47 శాతం వృద్ధి చెంది రూ.3,650 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.2,485 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ నికర విక్రయాలు కూడా రూ.30,845 కోట్ల నుంచి రూ.33,875 కోట్లకు పెరిగాయి. కమోడిటీ ధరల్లో సానుకూలత, వ్యయాల తగ్గింపుపై దృష్టి పెట్టడంతో పాటు విదేశీ మారక లాభాలతో ప్రోత్సాహకర పనితీరును కనబరిచినట్లు మారుతి సుజుకీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతి తెలిపారు. జూన్ త్రైమాసికంలో కంపెనీ విక్రయాలు 5 శాతం వృద్ధితో 5,21,868 యూనిట్లుగా నమోదయ్యాయని ఆయన చెప్పారు.

జనవరిలో తొలి ఈవీ కారు ప్రదర్శన: వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న భారత్ మొబిలిటీ షోలో మారుతి తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని (ఈవీ) ప్రదర్శించనుందని రాహుల్ తెలిపారు. 2031 నాటికి ఆరు ఈవీ మోడల్స్‌ను మార్కెట్లోకి తీసుకురావాలని చూస్తున్నట్లు చెప్పారు.

ఎం అండ్ ఎం లాభం రూ.3,283 కోట్లు

ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.37,218 కోట్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూపై రూ.3,283 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.2,745 కోట్లు)తో పోల్చితే లాభం 20 శాతం, రెవెన్యూ (రూ.33,892 కోట్లు) 10 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీకి చెందిన అన్ని విభాగాలు పటిష్ఠమైన పనితీరును కనబరచటం కలిసి వచ్చిందని ఎం అండ్ ఎం ఎండీ, సీఈఓ అనీష్ షా పేర్కొన్నారు. జూన్ త్రైమాసికంలో కంపెనీ మొత్తం 2.12 లక్షల వాహనాలను విక్రయించింది. యుటిలిటీ వాహన విభాగ విక్రయాలు 14 శాతం వృద్ధితో 1.24 లక్షల యూనిట్లుగా నమోదు కాగా ఎస్‌యూవీ పోర్టుఫోలియో వాహన విక్రయాలు 18,000 యూనిట్ల నుంచి 49,000 యూనిట్లకు పెరిగాయని మహీంద్రా తెలిపింది.

వియత్నాంలో ఎస్ఎంఎస్ ఫార్మా జేవీ

500 హెక్టార్లలో ఫార్మా పార్క్ అభివృద్ధి

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ తన కార్యకలాపాలను వియత్నాంకు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆ దేశంలోని తన్ హోవా రాష్ట్రంలోని నఘి సోన్ ప్రత్యేక ఆర్థిక మండలిలో 500 హెక్టార్లలో జాయింట్ వెంచర్ (జేవీ) రూపంలో ఫార్మా పార్క్ ఏర్పాటుకు సిద్ధమైంది. వియత్నాంకు చెందిన ఒక స్థానిక సంస్థతో పాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే శ్రీ అవంతిక కాంట్రాక్టర్స్ అనే సంస్థతో కలిసి ఎస్ఎంఎస్ ఫార్మా ఈ ఫార్మా పార్క్ ఏర్పాటు చేయనుంది. ఎస్ఎంఎస్ ఫార్మా సీఎండీ రమేశ్ బాబు, శ్రీ అవంతిక కాంట్రాక్టర్స్ ఎండీ నరేంద్ర రెడ్డి ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్‌కు ఈ ప్రాజెక్టు గురించి వివరించారు. అవసరమైన అనుమతులు ఇస్తే 70 నుంచి 100 కోట్ల డాలర్లతో ఈ ఫార్మా పార్క్ తొలి దశ పూర్తి చేయాలని ఎస్ఎంఎస్ ఫార్మా, శ్రీ అవంతిక కాంట్రాకర్స్ భావిస్తున్నాయి. వచ్చే 10-12 సంవత్సరాల్లో ఈ పార్క్ కోసం 400-500 కోట్ల డాలర్లు ఖర్చు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని సహాయ సహకాలు అందిస్తామని వియత్నాం ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఐటీ రిటర్న్‌లు @7కోట్లు

న్యూఢిల్లీ: అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం బుధవారం రాత్రి 7 గంటల సమయానికి దాఖలైన ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌ల సంఖ్య 7 కోట్లు దాటింది. ఖాతాలు ఆడిట్ చేయాల్సిన అవసరం లేని అసెసీలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయడానికి బుధవారం చివరి రోజు కావడంతో ఈ ఒక్క రోజే 50 లక్షలకు పైగా రిటర్న్‌లు దాఖలయ్యాయయని ఐటీ శాఖ ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. గత ఏడాది (2022-23 ఆర్థిక సంవత్సరం) దాఖలైన ఐటీ రిటర్న్‌ల సంఖ్య 6.77 కోట్లు. కాగా చివరి రోజు జూలై 31న 64.33 లక్షల రిటర్న్‌లు దాఖలయ్యాయి.

మౌలికం 20 నెలల కనిష్ఠం

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామికాభివృద్ధికి కీలకమైన 8మౌలిక వసతుల రంగాల వృద్ధి రేటు జూన్‌లో 20 నెలల కనిష్ఠ స్థాయి 4 శాతానికి పడిపోయింది. క్రూడాయిల్, రిఫైనరీ ఉత్పత్తుల తయారీలో తగ్గుదల ఇందుకు దోహదపడింది. ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఇన్‌ఫ్రా రంగం గతంలో నమోదు చేసిన కనిష్ఠ స్థాయి 0.7%. 2022 అక్టోబరులో ఇది నమోదైంది. ఈ ఏడాది మే నెలలో ఇన్‌ఫ్రా రంగం వృద్ధి రేటు 6.4 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో 8.4 శాతం ఉంది. ఇదిలా ఉండగా ఏప్రిల్-జూన్ నెలల మధ్య కాలంలో అంటే మొదటి త్రైమాసికంలో కీలక రంగాల వృద్ధిరేటు 5.7 శాతం ఉంది.

విత్తలోటు 8.1 శాతం: తొలి త్రైమాసికం ముగిసే నాటికి ప్రభుత్వ విత్తలోటు పూర్తి సంవత్సర లక్ష్యంలో 8.1 శాతంగా నమోదైంది. నగదు పరిమాణంలో చూసినట్టయితే జూన్ చివరి నాటికి ఇది రూ.1,35,712 కోట్లుంది. గత ఏడాది ఇదే కాలంలో విత్తలోటు బడ్జెట్ అంచనాల్లో 25.3 శాతం ఉంది.

టాటా స్టీల్ లాభంలో 75 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన టాటా స్టీల్ నికర లాభం ఏకంగా 75% వృద్ధి చెంది రూ.918.57 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.424.85 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవటం ఎంతగానో కలిసి వచ్చిందని తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.60,666.48 కోట్ల నుంచి రూ.55,031.30 కోట్లకు పడిపోయింది. ఈ కాలంలో వ్యయాలు రూ.58,553.25 కోట్ల నుంచి రూ.52,389.06 కోట్లకు తగ్గాయి.

10% పెరిగిన బీఓబీ లాభం

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ).. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.4,458 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.4,070 కోట్లు)తో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.29,878 కోట్ల నుంచి రూ.32,116 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.26,556 కోట్ల నుంచి రూ.29,629 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 3.51 శాతం నుంచి 2.88 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.78 శాతం నుంచి 0.69 శాతానికి తగ్గాయి.

ప్రత్యక్ష రాజకీయాలకు

ధర్మాన గుడ్‌బై?

ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయం

- మొన్నటి ఎలక్షన్లలో కూడా అయిష్టంగానే పోటీ
- కొడుకును బరిలోకి దించాలనుకున్నా అంగీకరించని జగన్
- బలవంతంగా బరిలో దిగి ఘోర ఓటమి
- అస్త్రసన్యాసం దిశగా మరికొందరు వైసీపీ సీనియర్లు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



తన మాటతో ప్రత్యర్థులను సైతం ఆకట్టుకునే సత్తా కలిగిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు ధర్మాన ప్రసాదరావు ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ నిర్ణయాన్ని తక్షణమే అధికారికంగా ప్రకటించనప్పటికీ.. భవిష్యత్‌లో ఎన్నికల్లో పోటీచేయనని తన స్నేహితులు, సన్నిహితుల వద్ద స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో నాయకులంటే ఏ మాత్రం గౌరవం లేదని.. అనుభవం గల నేతల సలహాలు, సూచనలు తీసుకోవడం అటుంచి.. ముసలోడంటూ కించపరిచే తత్వం నాయకత్వాల్లో పెరిగిపోయిందని.. ఆత్మగౌరవాన్ని చంపుకొని రాజకీయాల్లో కొనసాగడం కంటే.. దూరంగా ఉండి పెద్దరికం నిలుపుకోవడం మంచిదన్న నిర్ణయానికి ధర్మాన వచ్చారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. తనకు 66 ఏళ్లు వచ్చాయని.. మధుమేహ వ్యాధి ఉన్నందున ఎన్నికల్లో పోటీచేయలేనని, విస్తృతంగా ప్రచారం చేయలేనని 2024 ఎన్నికల సమయంలోనే వైసీపీ అధ్యక్షుడు, నాటి సీఎం జగన్‌కు చెప్పారు. తన బదులు తన కుమారుడు రామ్‌మనోహర్‌నాయుడిని శ్రీకాకుళం అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దించాలని కోరారు. అయితే బందరు నుంచి పేర్ని నాని కుమారుడు కృష్ణమూర్తికి.. తిరుపతి నుంచి భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ్.. చంద్రగిరి నుంచి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి, గుంటూరు తూర్పు నుంచి షేక్ ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమా షేక్‌లకు అవకాశమిచ్చిన జగన్.. ధర్మాన కుమారుడికి మాత్రం టికెట్ ఇచ్చేందుకు నిరాకరించారు. ఐ-ప్యాక్ సర్వేల్లో ధర్మాన ఓడిపోతారని వచ్చినా.. ఆయనే పోటీచేయాలని జగన్ పట్టుబట్టారు. దీంతో అయిష్టంగానే బరిలోకి దిగారు. 52 వేలకుపైగా ఓట్ల తేడాతో తన రాజకీయ జీవితంలోనే ఘోరమైన పరాజయాన్ని ఆయన మూటకట్టుకున్నారు. ఈ ఓటమి ఆయన్ను కలచివేసింది. 1989, 99ల్లో నరసన్నపేట నుంచి, 2004, 09 ఎన్నికల్లో శ్రీకాకుళం నుంచి కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన ఆయన.. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలో పలు కీలక శాఖలు నిర్వర్తించారు. వాన్‌పిక్ కుంభకోణంలో 2012లో సీబీఐ కేసు నమోదు చేయడంతో.. మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయినా 2019లో గెలిచారు. జగన్ కేబినెట్‌లో రెవెన్యూ మంత్రిగా పనిచేశారు. నిజానికి రాజకీయాల్లో 66 ఏళ్లంటే ఏమంత పెద్ద వయసు కాదని.. మధుమేహం కూడా పెద్ద సమస్య కాదని ధర్మానకూ తెలుసు. అయితే జగన్ తీరు తన మనస్తత్వానికి సరిపోనందునే ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని ఆయన భావిస్తున్నారని సన్నిహితులు చెబుతున్నారు. వైసీపీలో ఎంతటి సీనియర్ నాయకుడైనా.. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నా.. జగన్ ముందు వంగి ఉండాల్సిందేనని అంటున్నారు. పైగా ఆయన్ను నలుగురిలో అయినా.. ఏకాంతంగా ఉన్నా.. 'సర్' అనాల్సిందేనని.. తమ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో తమకున్న చనువుకొద్దీ.. జగన్ అని సంబోధిస్తే సహించరని పార్టీ ముఖ్యులు అంటుంటారు. సంప్రదాయ రాజకీయాలకు అలవాటుపడిన ధర్మాన.. వైసీపీ, జగన్ తీరు చూశాక ఇక ప్రత్యక్ష రాజకీయాల్లో ఇమడలేనన్న నిర్ణయానికి వచ్చారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. వైసీపీలోని కొందరు సీనియర్లు కూడా ధర్మాన బాటలోనే ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

గనుల వెంకట రెడ్డిపై వేటు!

- సస్పెన్షన్, కేసు నమోదుకు రంగం సిద్ధం
- ముఖ్యమంత్రికి గనుల శాఖ సిఫారసు
- 'కోస్ట్ గార్డ్' నుంచి డిప్యుటేషన్‌పై ఏపీకి
- రెండు కీలక పదవులు ఇచ్చిన జగన్
- ఇసుక, బీచ్‌శాండ్, బొగ్గు, సర్వే రాళ్లపై అడ్డగోలుగా నిర్ణయాలు
- ప్రభుత్వానికి ఆర్థికంగా భారీ నష్టం
- నిన్నటితోనే ముగిసిన డిప్యుటేషన్
- సస్పెండ్ చేస్తే రిలీవ్ కావడం కుదరదు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో గనుల శాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీ ఎండీగా అడ్డగోలు దోపిడీకి సహకరించిన వీజీ వెంకటరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి ఆర్థికంగా తీవ్రంగా నష్టపరిచేలా నిర్ణయాలు తీసుకోవడం, అడ్డగోలుగా కాంట్రాక్టులు నిర్వహించడం, ఇసుకను ప్రైవేటుకు అప్పగించే టెండర్లలో అక్రమాలకు పాల్పడటం వంటి అనేకానేక అభియోగాలతో అయనను సస్పెండ్ చేయనున్నట్లు తెలిసింది. అంతేకాదు... ఆర్థికపరమైన అక్రమాలకు ఊతమిచ్చేలా నిర్ణయాలు తీసుకోవడం, కంపెనీలకు మేలు చేయడం వంటి పలు ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉండటంతో ఆయనపై క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వెంకటరెడ్డి సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తూ సీఎం చంద్రబాబు ఆమోదం కోసం గనుల శాఖ ఫైలు పంపింది. ఆమోదం వచ్చాక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

కోస్ట్‌గార్డ్ సర్వీసు నుంచి...

ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వెంకట రెడ్డి రక్షణ శాఖలో కోస్ట్ గార్డ్‌లో సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్. ఆయన 2019 డిసెంబరు 12న డిప్యుటేషన్‌పై ఏపీకి వచ్చారు. తొలుత విద్యాశాఖలో ఆయన కోసం స్పెషల్ సెక్రటరీ పోస్టు సృష్టించారు. ఆ తర్వాత గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించారు. కొంతకాలం తర్వాత గనుల శాఖలోని అతి కీలకమైన ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఎండీగా పోస్టులో కూర్చోబెట్టారు. ఇలా జగన్ ప్రభుత్వంలో వెంకటరెడ్డి రెండు అత్యంత కీలకమైన పోస్టులను నిర్వహించారు. ఆయన పోస్టింగ్ నిబంధనలకు విరుద్ధమని హైకోర్టులో కేసు నడుస్తోంది. డిప్యుటేషన్ కాలం 2023లోనే ముగిసింది. కానీ... మళ్లీ జగన్ సర్కారే వస్తుందన్న ధీమాతో తన డిప్యుటేషన్ కాలాన్ని పొడిగించాలని వెంకటరెడ్డి కోరడం, జూలై 31 వరకు రక్షణ శాఖ అంగీకరించడం జరిగిపోయింది. అంటే... బుధవారంతో ఆయన డిప్యుటేషన్ కాలపరిమితి ముగిసిపోయింది. ఆ వెంటనే ఏపీలో రిలీవ్ అయి రక్షణ శాఖ విధుల్లో చేరాలి. ఇందుకు ఏపీ ప్రభుత్వ అనుమతి, ఆమోదం తప్పనిసరి. ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయనున్నారు. అయితే... సస్పెన్షన్ వేటు పడితే ఆయన ఇక్కడ రిలీవ్ అయ్యే అవకాశం ఉండదు.

తీవ్రమైన ఆరోపణలు...

గనుల శాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీ ఎండీగా వెంకట రెడ్డి అచ్చంగా జగన్ కోసమే పని చేశారనే ఆరోపణలున్నాయి. అందులో కీలకమైనవి...

- ఇసుక టెండర్లను ఏపీలో కాకుండా బెంగాల్‌లో నిర్వహించేలా చక్రం తిప్పారు. మూడో కంటికి తెలియకుండా టెండరు డాక్యుమెంట్ తయారు చేయించారు.
- 2021-2023 సంవత్సరాల కాలంలో జేపీ వెంచర్స్ 1535 కోట్ల ఇసుక అమ్మకం కాంట్రాక్టు చేపట్టింది. ఆ సంస్థ 280 కోట్లే కట్టిందని, ఇంకా రూ.880 కోట్ల చెల్లించాల్సి ఉందని అధికారవర్గాలు గుర్తించాయి. అయినప్పటికీ.. ఎన్నికల ముందు వెంకటరెడ్డి జేపీ వెంచర్స్ సంస్థకు బ్యాంక్ గ్యారంటీ 120 కోట్లు విడుదల చేశారు. నాటి స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేదికి తెలియకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని కొత్త ప్రభుత్వం గుర్తించింది.
- జేపీ గ్రూపు 880 కోట్లు బకాయిలున్నా, ఎలాంటి బకాయిలు లేవని నో డ్యూస్ సర్టిఫికెట్, నిరభ్యంతర పత్రం జారీ చేసినట్లుగా నిర్ధారించారు.
- 2023-24 సంవత్సరాలకు ఇసుక టెండర్లు ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ కంపెనీలకు ఇచ్చారు. ఈ టెండర్‌లోనూ అక్రమాలు జరిగాయని ప్రభుత్వం పలు ఆధారాలు సేకరించింది.
- బీచ్‌శాండ్, బొగ్గు టెండర్లలోనూ ప్రభుత్వం భారీగా నష్టపోయేలా వ్యవహరించారని గుర్తించారు.
- సర్వే రాళ్ల కొనుగోళ్లకు సర్వే లేదా రెవెన్యూశాఖ నిధులు భరించాలి. కానీ, ఏపీఎండీసీ నిధులు 320 కోట్లు వ్యయం చేశారని, నిబంధనలకు విరుద్ధమని తేల్చారు. సర్వేశాఖతో సంబంధం లేకుండా ఏపీఎండీసీ నిధులు ఇవ్వాలని ఎవరు ఆదేశించారో నిర్ధారించే ఫైల్సు లేవు. పలు కీలకమైన ఫైళ్లు కనిపించడం లేదని నిర్ధారణకు వచ్చారు.
- ఎన్నికల కోడ్ రావడానికి ముందు, ఆ తర్వాత కూడా మైనర్ మినరల్స్‌కు పాత తేదీలతో లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ)లు జారీ చేశారని తేల్చారు.

ఆయనపై శాఖాపరమైన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు పెట్టాలని గనుల శాఖ సిఫారసు చేసింది.

96 మంది డీఎస్పీలు 'బదిలీ'

- 57 మందికి నో పోస్టింగ్
- శాంతి భద్రతల విభాగంలోనే 35 మంది బదిలీ

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అందులో.. వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించడంతోపాటు వివిధ కారణాలతో ఏకంగా 57 మందికి పోస్టింగ్ ఇవ్వకుండా పోలీసు ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమల రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ డివిజనల్ అధికారులతోపాటు సీఐడీ, ఇంటెలిజెన్స్, విజిలెన్స్‌లో పనిచేస్తున్న కొందరు డీఎస్పీలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వీరిలో శాంతి భద్రతల విభాగంలో పని చేస్తూ వైసీపీతో అంటకాగిన వారు.. చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలు లక్ష్యంగా ఏర్పాటు చేసిన 'సిట్, ఇంటెలిజెన్స్‌లో ఉంటూ పీఎస్సార్ ఆంజనేయులు కనుసన్నల్లో పని చేసిన వారు, సీఐడీలో విధులు నిర్వహిస్తూ తప్పుడు కేసులు పెట్టిన అధికారులు ఉన్నారు. శాంతిభద్రతల విభాగంలో 35 సబ్ డివిజన్లకు చెందిన 22 మంది డీఎస్పీలను అక్కడి నుంచి తప్పించారు. గన్నవరం డీఎస్పీగా ఉన్న జయసూర్యను మాత్రం భీమవరం బదిలీ చేశారు. మిగిలిన 21 మందికి కొత్తగా డీఎస్పీ పోస్టింగ్ లభించింది. వీరంతా ఐదేళ్లుగా లూప్‌లైన్‌లో ఉన్న వారే. శాంతి భద్రతల విభాగంలో పని చేస్తూ.. బదిలీ అయి పోస్టింగ్ దక్కని వారిలో... వై.శృతి (శ్రీకాకుళం), జి.నాగేశ్వర రెడ్డి (కాశీబుగ్గ), డి. బాలచంద్రా రెడ్డి (టెక్కలి), ఎ.ఎస్. చక్రవర్తి(చీపురుపల్లి), హనుమంత రావు (కాకినాడ), విజయ్ పాల్ (రాజమండ్రి సెంట్రల్), అంబికా ప్రసాద్ (రాజమండ్రి దక్షిణ), పి. శ్రీకాంత్(గుడివాడ), నారాయణ స్వామి రెడ్డి (భీమవరం), మురళీ కృష్ణా రెడ్డి (విజయవాడ వెస్ట్), ఎం. రమేశ్ (తెనాలి), రవికాంత్ (గుంటూరు నార్త్), మహబూబ్ బాషా (గుంటూరు సౌత్), శ్రీనివాసరావు (గురజాల), కిశోర్ బాబు (ఒంగోలు), అశోక్ వర్ధన్ (దర్శి), బాలసుందర్ రావు (మార్కాపురం), వీరాంజనేయ రెడ్డి (నెల్లూరు రూరల్), బాజీజాన్ సైదా (పెనుకొండ), సూర్యనారాయణ రెడ్డి (గూడూరు), శ్రీనివాస రెడ్డి (నాయుడు పేట), ఉమా మహేశ్వర రెడ్డి (శ్రీకాళ హస్తి), శ్రీనివాస రెడ్డి (డోన్), శ్రీనివాసులు (ఏలూరు), ప్రసాద రెడ్డి (మదనపల్లె), వినోద్ కుమార్ (పులివెందుల), మురళీధర్ (ప్రొద్దుటూరు), శివభాస్కర్ రెడ్డి (గుంతకల్), బి. శ్రీనివాసులు(కళ్యాణదుర్గం), వాసుదేవన్ (పుట్టపర్తి), విజయ శేఖర్ (కర్నూలు), రవీంద్రనాథ్ రెడ్డి (నంద్యాల) ఉన్నారు. వీరిలో చాలామంది గత ప్రభుత్వంలో వైసీపీ భక్తులుగా పనిచేసినట్లు ఆరోపణలున్నాయి.

శ్రీశైలం ఫుల్.. 8 గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్‌లో ఇంకా సగం ఖాళీ

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి భారీగా వచ్చిన వరదతో శ్రీశైలం జలాశయం దాదాపు నిండిపోయింది. శ్రీశైలం గరిష్ఠ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను 98.66 శాతం మేర 212.92 టీఎంసీలు చేరాయి. మరో 2.89 టీఎంసీల లోటు మాత్రమే ఉంది. బుధవారం సాయంత్రం ఆరున్నర గంటల సమయానికి శ్రీశైలం జలాశయంలోకి 3,80,113 క్యూసెక్కుల వరద వస్తుంటే.. దిగువన నాగార్జున సాగర్‌కు 3,09,600 క్యూసెక్కులు వదులుతున్నారు. మంగళవారం శ్రీశైలం జలాశయం పది గేట్లను పది అడుగుల మేర ఎత్తి జలాలను కిందకు వదిలిన అధికారులు.. బుధవారం వరద ప్రవాహం తగ్గడంతో రెండు గేట్లను మూసేశారు. 8 గేట్ల ద్వారా 3,09,600 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

సాగర్ జలాలు తాగునీటికి కేటాయిద్దాం: నిమ్మల

సాగర్ నుంచి విడుదలయ్యే కృష్ణా జలాలను తాగునీటికి వినియోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జల వనరుల శాఖ ఇంజనీర్లను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలంటూ కేఆర్ఎంబీని కోరాలని సూచించారు.

నిలకడగా గోదావరి

భద్రాచలం, ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి హెచ్చరిక



రాజమహేంద్రవరంలో నిండు గోదావరి

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), పోలవరం, జూలై 31: గోదావరి వరద తగ్గుముఖం పట్టి నిలకడగా కొనసాగుతోంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజి వద్ద బుధవారం రాత్రి 7 గంటల వరకూ నీటిమట్టం 12.10 అడుగులుగా నిలకడగా ఉంది. బ్యారేజీ నుంచి ఉదయం 5 గంటలకు 10,60,023 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. రాత్రి 7 గంటలకు 10,41,489 క్యూసెక్కుల వరద సముద్రంలోకి వెళుతోంది. భద్రాచలం వద్ద ఉదయం 8 గంటల కు 45 అడుగులుగా ఉన్న నీటిమట్టం స్వల్పంగా పెరిగి.. మధ్యాహ్నం 12 గంటలకు 45.10 అడుగులకు చేరింది. రాత్రి 7 గంటలకు కాస్త తగ్గి 44.80 అడుగులుగా ఉంది. ప్రస్తుతం ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. నీటిమట్టం 43 అడుగుల కంటే తగ్గితే దీన్ని ఉపసంహరించుకుంటారు.

పోలవరం వద్ద స్వల్పంగా పెరుగుదల..

ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 23.257 మీటర్లకు చేరుకుంది. 9,91,282 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్టు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. కాగా, పట్టిసీమ నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు 7,434 క్యూసెక్కులు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు.

బియ్యం, కందిపప్పు

ధరలు మళ్లీ తగ్గింపు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు, బియ్యం ధరలను మరో దఫా తగ్గించారు. కిలో కందిపప్పు ధరను రూ.160 నుంచి రూ.150కి, బియ్యం కిలో రూ.48 నుంచి రూ.46కు, స్టీమ్డ్ రైస్ కిలో రూ.49 నుంచి రూ.47కి తగ్గించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచే తగ్గింపు ధరలు అమలులోకి వస్తాయని, ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు.



పిఠాపురంలో మహారాజా మేనకోడలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కాకినాడ ఆర్డీవో కిషోర్

క్రిమినల్ చర్యలు తప్పవు

- పిఠాపురం మహారాజా మేనకోడలి ఇంటి వివాదంపై ఆర్డీవో హెచ్చరిక
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు డిప్యూటీ సీఎం పవన్ స్పందన

పిఠాపురం, జూలై 31: పిఠాపురం మహారాజా మేనకోడలి ఇంటి వద్దకు ఇతరులు ఎవరైనా వచ్చినా, దౌర్జన్యం చేసినా క్రిమినల్ చర్యలు తప్పవని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ హెచ్చరించారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు వీధిలో తాము అయిదున్నర దశాబ్దాలుగా నివాసముంటున్న ఇంటిని జిగటాల లక్ష్మి తదితరులు వచ్చి తాము కొనుగోలు చేశామని, ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం చేశారని పిఠాపురం మహారాజా మేనకోడలు విన్నపాల చంద్రలేఖ, ఆమె కుమారులు మాధవరావు, జనార్ధనకృష్ణ రంగారావు వ్యక్తం చేసిన ఆవేదనపై 'పవన్ సారూ.. మీరే దిక్కు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో బుధవారం ప్రచురితమైన వార్తపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. కలెక్టరు షాన్‌మోహన్‌తో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ఆర్డీవో కిషోర్...లక్ష్మితో మాట్లాడారు. వివాదం ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని, అప్పటివరకూ ఆ ఇంటి జోలికి పోవద్దని స్పష్టం చేశారు. ఎవరైనా వెళ్లినా, ఇంట్లో ఉంటున్న వారిని బెదిరించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీలో భారీగా

పట్టుబడిన డ్రగ్స్

- 2020-22 మధ్యకాలంలో 4.67 లక్షల కిలోలకు పైగా..: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం 2020-22 మధ్య కాలంలో ఏపీలో అత్యధికంగా గంజాయి ఆధారిత మాదక ద్రవ్యాలు పట్టుబడినట్లు వెల్లడైంది. దేశంలో మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలపై బుధవారం రాజ్యసభలో ఎంపీ జోస్ కె. మణి అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్న ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు ఈ మేరకు స్పష్టం చేశాయి. 2020లో ఏపీలో 1,06,042.775 కిలోలు, 2021లో 1,91,712.562 కిలోలు, 2022లో 1,69,201.893 కిలోల గంజాయి ఆధారిత మాదకద్రవ్యాలు, 20 కిలోల కొకైన్ పట్టుకున్నట్లు తెలిపింది.

విభజన అంశాలపై 34 సమీక్షలు

విభజనచట్టంలోని చాలాఅంశాలను అమలు చేసేశామని, మిగిలిన అంశాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. బుధవారం, రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'విభజన చట్టంలోని అంశాల అమలు పురోగతిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమయానుగుణంగా మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్లు, ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు 34 సమీక్షా సమావేశాలు నిర్వహించాం. పరస్పర అవగాహనతో వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా మాత్రమే వ్యవహరిస్తుంది' అని తెలిపారు.



భీమిలి బీచ్ భూములపై..

విజయసాయి పంజా

- ఇతరులు చేస్తే తప్పు...వైసీపీ చేస్తే ఒప్పు!
- ఆక్రమణలంటూ నాడు విశాఖ-భీమిలి రోడ్‌లో ప్రైవేట్, టీడీపీ ఆస్తుల కూల్చివేత
- కానీ అక్కడే విజయసాయి నిర్మాణపనులు
- భీమిలి బీచ్‌లో కుమార్తె పేరిట భూమి కొనుగోలు
- కొత్త ప్రభుత్వంలో మొదలైన చర్యలు
- అక్కడ నిర్మాణం కుదరదని తేల్చేసిన కోర్టు
- జీవీఎంసీ నోటీసుపై సాయిరెడ్డి కుటుంబం కారాలు.. మిరియాలు..

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిది వింత వైఖరి. పార్టీ అధినాయకుడి మాదిరిగానే ఏమైనా అంటే సహించలేని తత్వం. అందరినీ వారే ఇబ్బంది పెట్టాలి. ఎవరైనా తప్పుబడితే మాత్రం తట్టుకోలేరు. సచ్ఛీలురమని నిరూపించుకోవడానికి తాపత్రయపడతారు. ఈ కేసు అలాంటిదే. ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జిగా విజయసాయిరెడ్డి విశాఖలో పని చేసిన కాలంలో టీడీపీ సానుభూతిపరులను ఎంతో వేధించారు. విశాఖ నుంచి భీమిలి వరకు బీచ్ పక్కన వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారిని అక్కడి నుంచి లేపేశారు. పొక్లెయిన్లు పెట్టి విధ్వంసం చేశారు. గంటా శ్రీనివాసరావు అనుచరుడు కాశీ విశ్వనాథానికి చెందిన గో కార్టింగ్, అలాగే సీ హార్స్ రెస్టారెంట్ కూల్చేశారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజుకు చెందిన స్థలంలో ప్రహరీలు తొలగించారు. వీటిని నిబంధనల ప్రకారం చేసినట్టు ప్రకటించారు. ఆ తరువాత అదే విజయసాయిరెడ్డి భీమిలిలో టౌన్ సర్వే నంబర్లు 1516, 151, 1519, 1523లలో ఆక్వా కల్చర్ చేస్తున్న వారి నుంచి సుమారు 3.5 ఎకరాల భూమిని అవియాన్ రియల్టర్స్ పేరుతో కొనుగోలు చేశారు. ఇది ఆయన కుమార్తె నేహారెడ్డికి చెందిన సంస్థ. ఈ భూమి అంతా భీమిలిలో బీచ్‌ను ఆనుకొని కేవలం 30 మీటర్ల దూరంలోనే ఉంటుంది. అక్కడ పక్కా నిర్మాణాలు చేపట్టాలంటే సీఆర్‌జెడ్, ఏపీసీఎంజెడ్, ఇరిగేషన్ శాఖల అనుమతి అవసరం. కానీ అటువంటి అనుమతులు ఏమీ లేకుండానే, ప్రభుత్వం తమదేనన్న ధీమాతో చదును చేయించారు. ఈ భూమి సీఆర్‌జెడ్-1 పరిధిలోకి వస్తుంది. అక్కడ ఇసుక తిన్నెలు కదిలించకూడదు. కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ ఆయన చేపట్టారు. ఈ స్థలానికి రోడ్డుకు అవతల వర్షపు నీరు బీచ్‌లో కలిసేందుకు మార్గం ఉండేది. దానిని మూసేశారు. అటువైపు ఎవరూ రాకుండా 'జీవీఎంసీ వర్క్ ఇన్ ప్రోగ్రెస్' అంటూ బోర్డు పెట్టారు. అంటే అక్కడ ప్రభుత్వమే పనులు చేస్తోందని, ప్రైవేటు వ్యక్తులు కాదని నమ్మించే ప్రయత్నం చేశారు. ఇలా అనేక పనులు చేయడంతో జనసేన నేత పీతల మూర్తియాదవ్ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. సీజే ధర్మాసనం దానిని పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టకూడదని, వాటిని తొలగించాలని ఆదేశించింది. దాంతో జీవీఎంసీ అధికారులు ఈ నెల 18న కూల్చివేతకు నోటీసులు ఇచ్చారు. ఆ నిర్మాణాలు కూల్చివేయడం తగదని స్టేటస్ కో ఇవ్వాలని నేహారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అలాంటి ఆదేశాలు ఇవ్వలేమని కోర్టు స్పష్టంచేసింది.



భీమిలి సమీపాన బీచ్‌లో నిర్మాణాలు (ఫైల్)


స్టార్ హోటల్ కట్టాలని యోచన?

ఆ స్థలంలో రాడిసన్ బ్లూ మాదిరిగా సెవెన్ స్టార్ హోటల్ నిర్మించాలని సాయిరెడ్డి అండ్ కో ప్రణాళిక వేసిందని, పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే రుషికొండలో నిర్మాణం చేపట్టినట్టే...ఇక్కడ కూడా నిబంధనలు ఉల్లంఘించి పనులు చేసేవారని వైసీపీ వర్గాలే అంటున్నాయి.

శ్రీశైలానికి 'ప్లంజ్ పూల్' దెబ్బ!

- భారీ గొయ్యితో డ్యాం పునాదులు, గట్లకు ముప్పు!
- భారీ గొయ్యితో ప్రమాదమని ఈ ఏడాది ఫిబ్రవరిలో తేల్చిచెప్పిన ఎన్‌డీఎస్‌ఏ బృందం
- డ్రిప్-2 కింద రూ.203 కోట్లివ్వాలని కేంద్రానికి డ్యాం ఇంజనీర్ల ప్రతిపాదనలు
- అయినా రూపాయి కూడా రాని వైనం
- నేడు ప్రాజెక్టును సందర్శించనున్న చంద్రబాబు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)



శ్రీశైలం డ్యాం ఏరియల్ వ్యూ

రెండు తెలుగు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలనే గాక విద్యుత్ సైతం అందిస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు శ్రీశైలం ఇప్పుడు ప్రమాదంలో పడింది. డ్యాం గేట్లు ఎత్తినప్పుడు వరద ప్రవాహ తీవ్రతకు పంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గొయ్యి ఇంజనీర్లను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. శ్రీశైలం కుడి గట్టు విద్యుత్కేంద్రం (రైట్ పవర్ హౌస్)తో పాటు ప్రాజెక్టు పూర్తి కావడానికి 20 ఏళ్లు పట్టింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం (ఫ్లడ్ వాటర్ డిశ్చార్జ్ కెపాసిటీ) 13.20 లక్షల క్యూసెక్కులు. డ్యాంలో ఏటేటా పూడిక చేరడంతో.. 2011లో వరద లెక్కలు పరిశీలించి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా నిర్ధారించారు. ఇదిలాఉంటే.. 12 రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తినప్పుడు స్పిల్‌వే నుంచి వరద జలాలు కిందకు పడి.. మళ్లీ పైకెగిరి నదిలో పడే ప్లంజ్‌పూల్ ప్రాంతంలో భారీ గొయ్యి ఏర్పడింది. 2009 అక్టోబరులో కనీవినీ ఎరుగని రీతిలో వరదలు వచ్చాయి. డ్యాంకు 25.5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరింది. మళ్లీ ఆ స్థాయి వరద వస్తే డ్యాం తట్టుకోగలదా..? ప్లంజ్‌పూల్‌లో గొయ్యి వల్ల ప్రాజెక్టు భద్రతకు ముప్పు పొంచి ఉందా..? 2009 నాటి వరదలకు ఆనకట్ట సహా కుడి, ఎడమ గట్లు ఏమేరకు దెబ్బతిన్నాయో తెలుసుకునేందుకు చాలా కమిటీలు అధ్యయనం చేశాయి. మరమ్మతులకు సూచనలు చేస్తూ నివేదికలు కూడా ఇచ్చాయి. శ్రీశైలం సహా వివిధ ప్రాజెక్టుల భద్రతా, నిర్వహణ లోపాలను సమీక్షించేందుకు కేంద్ర జలవనరుల శాఖ 2014 సెప్టెంబరు 23న ఆయా రాష్ట్రాల ఇంజనీరింగ్ నిపుణులతో సమావేశం నిర్వహించింది. అప్పటి రాష్ట్ర ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ), ప్రస్తుత సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. శ్రీశైలం భద్రతపై అధ్యయనం కోసం ఎం.వెంకటేశ్వరరావు, కన్వీనర్ సభ్యులు కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ విశ్వేశ్వరరావు, సీడబ్ల్యూసీ హైడ్రాలజీ విభాగం డైరెక్టర్ భూపాల్‌సింగ్, ప్రాజెక్టు డిజైన్ డైరెక్టర్ ఎస్‌కే సిబాల్, ఫౌండేషన్ ఇంజినీరింగ్ డైరెక్టర్ వీఆర్‌కే పుల్లై, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సీఈ గిరిధర్‌రెడ్డి, రిటైర్డ్ సీఈ కేవీ సుబ్బారావు, తెలంగాణ క్వాలిటీ కంట్రోల్ సీఈ ఎం.కృష్ణారావు సభ్యులుగా నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ అదే ఏడాది అక్టోబరు 28న ప్రాజెక్టును పరిశీలించి.. డ్యాం భద్రత కోసం తీసుకోవలసిన చర్యలపై నివేదిక ఇచ్చింది. 2017 జూలై 13న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి నేతృత్వంలోని కమిటీ, 2018 జూన్ 11, 12న జలవనరుల శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ పి.రామరాజు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, రిటైర్డ్ ఈఈ కె.కృష్ణ కమిటీ, 2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, డ్యాం భద్రతా నిపుణుడు ఏబీ పాండ్యా నాయకత్వంలో కేంద్ర నిపుణుల కమిటీ డ్యాంను పరిశీలించాయి. ఏకమిటీ నివేదిక చూసినా స్పష్టంగా చెబుతున్న ప్రధాన అంశం ఒక్కటే. ప్లంజ్‌పూల్‌లో భారీగొయ్యి వల్ల డ్యాంకు ముప్పు పొంచి ఉంది.

ఎన్‌డీఎస్‌ఏదీ అదే మాట..

ఈ ఏడాది ఫిబ్రవరి 8న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి నాయకత్వంలో ఎన్‌డీఎస్‌ఏ సభ్యులు, కేంద్ర జలసంఘం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణులు, ఏపీ, తెలంగాణ ఇంజనీర్ల కమిటీ సభ్యులు శ్రీశైలం జలాశయాన్ని సందర్శించారు. ఆనకట్ట స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కింద పడే వరద మళ్లీ ఎగిరి పడే ప్రాంతం (ప్లంజ్‌పూల్)లో ఏర్పడిన భారీ గొయ్యిని పరిశీలించారు. ఈ గొయ్యి 45 మీటర్లు లోతు, 270 మీటర్లు వెడల్పు, 400 మీటర్లు పొడవు ఉంటుందని అంచనా వేశారు. ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గొయ్యి వల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండు వైపులా ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇప్పటికే నష్టం జరిగిన ప్రొటెక్షన్ సిలిండర్స్ రిహాబిటేషన్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కుడి, ఎడమ గట్లకు నష్టం జరగకుండా మరమ్మతులు చేపట్టాలన్నారు. కొంత కాలంగా రివర్స్ స్లూయిస్ గేట్ల నిర్వహణ సక్రమంగా లేదని, లీకేజీలు అరికట్టేందుకు గేట్లకు సీల్స్ ఏర్పాటు.. అత్యవసర సమయాల్లో పలు సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉండడంతో తక్షణమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. జలాశయానికి 780, 680, 490 అడుగుల మట్టంలో మూడు గ్యాలరీలు ఉన్నాయి. 490 అడుగుల గ్యాలరీలో పెద్ద ఎత్తున సీపేజీ ఎగదన్నుతోందని.. పలు చోట్ల మెట్లు, నేల దెబ్బతిన్నాయని.. వీటిని తక్షణ మరమ్మతులు, సీపేజీ నీటిని గ్యాలరీ కాలువకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని వివిధ నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికల్లో స్పష్టంగా సూచించారు.

నిధులివ్వరేం..?

ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల కోసం 'డ్యాం రిహాబిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' (డ్రిప్-2) కింద రూ.139 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్లు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు ఇవ్వకపోగా పలు కొర్రీలు పెట్టింది. రూ.190 కోట్లతో మరో ప్రతిపాదన పంపిస్తే దానిని కూడా ఆమోదించలేదు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు డాక్టర్ హ్యానిశ్ శాలం, అభిషేక్‌కుమార్ నెల రోజుల క్రితం శ్రీశైలం డ్యాంను సందర్శించారు. ఇప్పటికే వివిధ నిపుణుల కమిటీల సిఫారసుల మేరకు డ్యాం భద్రతకు రూ.203 కోట్లు నిధులు కావాలని కోరుతూ తాజాగా మరో ప్రతిపాదనను కేంద్రానికి పంపినట్లు కర్నూలు ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. డ్రిప్-2 కింద నిధులు ఇప్పించడంతో పాటు గొయ్యిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని సాగునీటి నిపుణులు, రైతాంగం సీఎం చంద్రబాబును, కేంద్రాన్ని కోరుతున్నారు.

ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీ

- బీసీఏ, బీబీఏ కోర్సులకు సర్కారు అనుమతి
- కోర్సుల కనీస ఫీజు రూ.18 వేలుగా ఖరారు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో కొత్త ట్రెండ్ మొదలైంది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలు తొలిసారి డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చాయి. సాంకేతిక కోర్సులు ప్రవేశపెట్టేందుకు ఏఐసీటీఈ అనుమతులు ఇవ్వడంతో ఈ ఏడాది బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ) కోర్సులను ప్రవేశపెట్టాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుమతించడంతో పాటు తాజాగా ఆ కోర్సులకు ఫీజులు ఖరారు చేసింది. ఇప్పటికే డిగ్రీ కాలేజీల్లో ఈ కోర్సులకు కనీస ఫీజు రూ.18వేలు కాగా, గరిష్ఠ ఫీజు రూ.30వేలు. మొదటిసారి కావడంతో కనీస ఫీజు పెట్టాలని ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ సిఫారసు చేసింది. ఫీజులు సవరించాలని ప్రభుత్వం ప్రయత్నించినా కమిషన్ అంగీకరించలేదని తెలిసింది. దీంతో కనీస ఫీజు రూ.18 వేలుగా ఖరారు చేశారు. రెండు కోర్సులకూ ఇదే ఫీజు వర్తించనుంది. ఒకట్రెండు రోజుల్లోనే దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఆ వెంటనే డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుంది. వాస్తవానికి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తికావాల్సి ఉండగా ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీ కోర్సులకు ఫీజుల ఖరారులో జాప్యంతో ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది.

1,62,750 మంది దరఖాస్తు

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ పదేపదే వాయిదా పడటంతో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. షెడ్యూలు ప్రకారం జూలై 10లోపే దరఖాస్తుల గడువు ముగిసింది. అదే సమయంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ జరిగింది. సమయం తక్కువ ఇవ్వడంతో మొదట 1.2లక్షల మంది విద్యార్థులే దరఖాస్తు చేసుకున్నారు. కానీ బీసీఏ, బీబీఏ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు రాకపోవడం, కాలేజీలకు అనుమతుల్లో జాప్యంతో అడ్మిషన్ల ప్రక్రియ వాయిదా వేశారు. తర్వాత ఫీజుల విషయంలో జాప్యంతో గత నాలుగు రోజులుగా ప్రతిరోజూ దరఖాస్తుల గడువును పొడిగిస్తున్నారు. ఇలా ఎక్కువ సమయం రావడంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటివరకూ 1,62,750 మంది డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా రాష్ట్రంలో 3.5 లక్షలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. బీసీఏ కోర్సుకు డిమాండ్ పెరగడంతో కొన్ని కాలేజీలు దాన్ని అవకాశంగా తీసుకొని అదనపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. మేనేజ్‌మెంట్ కోటాలో ఖరారు చేసిన ఫీజుకు గరిష్ఠంగా మూడు రెట్లు తీసుకోవచ్చు. దీంతో కొన్ని కాలేజీలు గరిష్ఠ ఫీజును వసూలు చేస్తున్నాయి.

కేబినెట్ భేటీ 2 నుంచి 7కు మార్పు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 2న జరగాల్సిన మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ఆగస్టు 7వ తేదీన మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 5, 6 తేదీల్లో వెలగపూడిలో జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ జరగనుంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగే సమావేశంలో మంత్రులు కూడా పాల్గొంటారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ అనంతరం మంత్రివర్గ సమావేశం నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే మంత్రివర్గ సమావేశం తేదీలో మార్పు జరిగింది. అజెండాలో ఎలాంటి మార్పు లేదు.

వెనక్కి వచ్చేయండి!

(మొదటి పేజీ తరువాయి)

పనిలేదనే భరోసా కల్పించాలని నిర్ణయించింది. ఐదేళ్లు కుంటుబడిన పరిశ్రమలను పరుగులు తీయించేందుకు ఐదు పారిశ్రామిక పాలసీలను తీసుకురావాలని కూడా నిశ్చయించింది. పరిశ్రమలశాఖ అధికారులతో సీఎం చంద్రబాబు బుధవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఇలా కీలక నిర్ణయాలెన్నో తీసుకున్నారు. ఐదు పాలసీలనూ వచ్చే వంద రోజుల్లోనే రూపొందించాలని ఆదేశించారు. తద్వారా పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు చేసుకున్న ఒప్పందాలు, వాటి అమలు, ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తయారు చేయాలనే లక్ష్యంతో పారిశ్రామిక పాలసీలను రూపొందించాలని సూచించారు. రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పారిశ్రామిక సంస్థలను తిరిగి రప్పించేందుకు గట్టిగా ప్రయత్నించాలన్నారు. కృష్ణపట్నం, నక్కపల్లి, ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్స్ అభివృద్ధి పనులపై చర్చించారు. నక్కపల్లిలో రూ.11,542 కోట్లతో ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్ పార్క్, రూ. 60వేల కోట్లతో ఏర్పాటయ్యే ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్, భవిష్యత్తులో రాష్ట్రంలో రూ.75వేల కోట్లతో ఆయిల్ రిఫైనరీ యూనిట్ ఏర్పాటు కోసం ప్రస్తుతం చర్చలు జరుపుతున్న బీపీసీఎల్ ప్రాజెక్టులపై సీఎం సమీక్షించారు.

ప్రగతి సాధన దిశగా...

రాష్ట్రంలో ప్రస్తుతం 4 పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని, మరో నాలుగు క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి.. కేంద్ర అనుమతులు పొందేందుకు త్వరగా ప్రక్రియను ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. కొత్త క్లస్టర్లలో ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఫుడ్‌ప్రాసెసింగ్, హార్డ్‌వేర్ సంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకోగా.. వైసీపీ ప్రభుత్వం అనుసరించిన అస్తవ్యస్త, కక్షపూరిత విధానాల వల్ల పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లిపోయారని, పరిశ్రమల కోసం కేటాయించిన భూములను కొన్ని కంపెనీలు ఇతర అవసరాలకు ఉపయోగించుకోవడంతో దుర్వినియోగమయ్యాయని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం వేధింపులతో భూకేటాయింపులు చేసిన తర్వాత కూడా అనేక కంపెనీలు తిరిగి వెళ్లిపోయాయని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో 1,382 ఎకరాలను ఇళ్ల పట్టాల కోసమంటూ తీసుకున్నారని తెలిపారు.

సడలిన నమ్మకాన్ని తిరిగి సాధిస్తాం..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పరిశ్రమలకు 66 శాతం ప్రోత్సాహకాలు చెల్లించగా.. వైసీపీ ప్రభుత్వం 34శాతమే చెల్లించిందని అధికారులు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని, తద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. 2014-19 కాలంలో 64 ఇండస్ట్రియల్ పార్కుల ద్వారా 14,125 ఎకరాలు అందుబాటులోకి తెస్తే.. 2019-24 మధ్య కేవలం 31పార్కులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇలాంటి పరిణామాల వల్లే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. గతంలో ఒప్పందాలు కుదుర్చుకుని.. తర్వాత వైసీపీ ప్రభుత్వ వేధింపులతో వెనక్కి వెళ్లిపోయిన పారిశ్రామికవేత్తలతో మళ్లీ సంప్రదింపులు జరపాలని, అవసరమైతే తాను కూడా వారితో మాట్లాడతానని చెప్పారు. పనులు ప్రారంభించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏడాదిలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులు పూర్తిచేసి 1,36,260 మందికి ఉపాధి కల్పించాలని చెప్పారు. ఉమ్మడి కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడను వైసీపీ ప్రభుత్వం వివాదాల్లోకి నెట్టేసి.. నిర్వీర్యం చేసిందని, అక్కడ భూముల ధరలు తగ్గించి.. పెట్టుబడులకు ఊతమివ్వాలని సీఎం ఆదేశించారు.

బాబు బ్రాండ్‌తోనే పెట్టుబడులు

సీఎం చంద్రబాబే రాష్ట్రానికి పెద్దబ్రాండ్ అని, ఆయనపై నమ్మకంతో పెత్తఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. బుధవారం సాయంత్రం సచివాలయం నాలుగో బ్లాక్‌లోని పబ్లిసిటీ సెల్‌లో మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వానికి రాజకీయ అజెండా తప్ప.. రాష్ట్రాభివృద్ధికి దోహదపడే నిర్దిష్ట పారిశ్రామిక విధానమే లేదని విమర్శించారు. "పారిశ్రామికవేత్తలకు ఇష్టముంటే వస్తారు. లేదంటే లేదు.. రెడ్‌కార్పెట్ వేసి స్వాగతించాల్సిన అవసరం లేదు" అనేదే గత పాలకుల విధానమని ఎద్దేవా చేశారు. అందుకే గత ఐదేళ్లలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి అనేదే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. గత పదేళ్లలో రూ.11లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా.. వాటిలో దాదాపు రూ.7లక్షల కోట్లకు సంబంధించిన ప్రాజెక్టులు 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయో దేవునికే తెలియాలని చెప్పారు.. ఎవరైనా పరిశ్రమ పెట్టడానికి వస్తే వైసీపీ నాయకులు వాటాలు అడిగేవారని, ఇవ్వకపోతే రకరకాలుగా వేధింపులకు గురిచేయడంతో అనేక కంపెనీలు తిరిగి వెళ్లిపోయాయని వివరించారు. రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు 5 కొత్త పాలసీలు రూపొందించాలని సీఎం ఆదేశించారని, వాటికి సంబంధించిన డ్రాఫ్టులను 15 రోజుల్లో రూపొందిస్తామని తెలిపారు.

ఇవీ ఐదు పాలసీలు..

1)నూతన ఇండస్ట్రియల్ పాలసీ 2)ఎంఎస్ఎంఈ పాలసీ 3) ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4)ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ క్లౌడ్ పాలసీ, 5) టెక్స్‌టైల్స్ పాలసీ

ఇవీ నాలుగు క్లస్టర్లు..

కుప్పం, మూలపేట, చిలమత్తూరు, దొనకొండ/పామూరు.

4 నెలలు.. 1.29 లక్షల కోట్లు

- ఓటాన్ అకౌంట్‌పై ఆర్డినెన్స్ జారీ
- రూ.1,29,972 కోట్ల వ్యయ అంచనాలకు గవర్నర్ ఆమోదం
- ఆర్థిక విధ్వంసంపై స్పష్టత వచ్చాకే పూర్తిస్థాయి బడ్జెట్

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాబోయే 4నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై బుధవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఆగస్టు నుంచి నవంబరు వరకు అవసరమైన ఖర్చుల అంచనాలను గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదించారు. ఈ 4నెలలకు గాను మొత్తం రూ.1,29,972కోట్ల వ్యయం అంచనాలతో ఆర్డినెన్సు జారీ చేశారు. ప్రభుత్వం కొత్తగా రావడం.. గత సర్కారు చేసిన లెక్కలేనన్ని అక్రమాలతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోవడంతో.. ఆర్థిక అరాచకాల వల్ల వాటిల్లిన నష్టాలపై ఒక స్పష్టతకు వచ్చాకే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని భావించినట్లు ఆర్డినెన్స్‌లో సర్కారు పేర్కొంది. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఆర్థిక అరాచకాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వం ఏప్రిల్ నుంచి జూలై వరకు జారీ చేసిన పాత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు జూలై 31తో ముగిసిపోతుండడంతో చంద్రబాబు ప్రభుత్వం మరో 4 నెలల బడ్జెట్ కోసం ఆర్డినెన్స్ జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు 1వ తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకు అంచనా వేసిన వ్యయం రూ.1,29,972.97 కోట్లకు గవర్నర్ ఆమోదం తీసుకుంది.

కీలక శాఖలకు కేటాయింపులు ఇవీ.. (రూ.కోట్లలో)

శాఖ	కేటాయింపు
పాఠశాల విద్య	9,875
ఉన్నత విద్య	736
నైపుణ్యాభివృద్ధి, శిక్షణ	606
వైద్య ఆరోగ్యం	6,782
పురపాలక, పట్టణాభివృద్ధి	3,550
గృహనిర్మాణం	2,014
సాంఘిక సంక్షేమం	2,732
బీసీ సంక్షేమం	8,879
వ్యవసాయం	3,689
పశుసంవర్థక, మత్స్య పరిశ్రమ	659
పంచాయతీరాజ్	4,032
గ్రామీణాభివృద్ధి	2,179

"రవాణా చార్జీలు భారంగా మారాయని ఇసుక వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఆ చార్జీలు ప్రభుత్వం వసూలు చేయడం ఏమిటి? రాష్ట్రమంతా ఆన్‌లైన్ పర్మిట్ విధానం తీసుకురండి. గ్రామ సచివాలయాల్లో ప్రజలు ఆన్‌లైన్ పర్మిట్లు తీసుకునేలా ఏర్పాట్లు చేయండి. ఇసుక బుక్ చేసుకున్నవారే, ఇసుక రవాణాకు వాహనాలు రీచ్‌కు లేదా డిపోకు తీసుకొని వెళ్లేలా అనుమతి ఇవ్వండి. దీని వల్ల రవాణా చార్జీలు ఏ మేరకు ఉంటాయో స్వయంగా వారికే తెలుస్తుంది. అలాగని, వాహనదారులు అడ్డగోలుగా రవాణా చార్జీలు వసూలు చేయకుండా నియంత్రించండి"

- అధికారులకు చంద్రబాబు ఆదేశాలు

ఇసుకలో ఎందుకీ గందరగోళం?

- గనుల్లో వైసీపీ అక్రమాలు తవ్వితీయండి: సీఎం ఆదేశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"ప్రజలకు మేలు జరగాలని తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం అమలులో గందరగోళం ఎందుకు వచ్చింది? గతంలో కన్నా ఇప్పుడే ధరలు పెరిగాయన్న విమర్శలు, ఆరోపణలు ఎందుకొస్తున్నాయి? తవ్వకం, రవాణా చార్జీలు ప్రభుత్వం తీసుకుంటుందా? ప్రజలు అలాగే భావిస్తున్నారా? ఈ సమస్య పరిష్కారంపై మీరు ఏ ఆలోచనలతో వచ్చారు?" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు... గనుల శాఖ అధికారులను ప్రశ్నించారు. చంద్రబాబు బుధవారం గనులశాఖపై సమీక్ష జరిపారు. ఇసుక తవ్వకం, రవాణా చార్జీల రూపంలో ప్రజలపై భారం పడకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలతో కూడా మాట్లాడి వారి సూచనలు, సలహాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుకపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇంకా మేలైన చర్యలకోసం వారితో మాట్లాడాలని సీఎం నిర్దేశించారు. ఇసుక ఇస్తున్నందుకు ప్రభుత్వం ఎలాంటి ఫీజులు వసూలుచేయడం లేదు. అయినా, ఇసుక తవ్వినందుకు లేబర్ చార్జీలు, రీచ్ నుంచి డిపోకు, అక్కడి నుంచి వినియోగదారునికి చేరడానికి రవాణా చార్జీలు చాలా ఎక్కువగా ఉంటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. గతంలో కంటే ఎక్కువగా ధరలు వసూలు చేస్తున్నారని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి ఇప్పటికే నివేదిక తెప్పించుకున్నారు. సమీక్షలో ఈ అంశాలనే ప్రస్తావించి ఈ పరిస్థితి ఎందుకొచ్చిందని అధికారులను ప్రశ్నించారు. అధికారులు సరిగ్గా స్పందించకపోవడంతో...." మీరు కూడా రొటీన్‌గా వస్తే ఎలా? అధ్యయనం చేసి పరిష్కారం కనిపెట్టండి" అని సీఎం హెచ్చరించినట్లు తెలిసింది. తవ్వకం చార్జీలు అన్ని రీచ్‌ల్లో ఒకేలా ఉండేలా చర్యలు తీసుకోవాలని బాబు సూచించారు. రవాణా చార్జీల విషయంలో ఏకరీతి విధానం తీసుకురాలేమా? అని ఆయన ప్రశ్నించారు. రవాణా భారం తగ్గించే విషయంలో అధికారులు ప్రజలతో మాట్లాడి వారి సూచనలు, సలహాలను తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలాఉంటే, పట్టా భూముల్లో ఉన్న ఇసుకకు సీనరేజీ కట్టించుకొని అమ్ముకునే అవకాశం కల్పించాలన్న అధికారుల ప్రతిపాదనలకు సీఎం ఆమోదం తెలిపారు.

అక్రమాలను తవ్వితీయండి

సిలికాసాండ్, క్వార్ట్జ్ తవ్వకాల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులున్నాయని, వాటిపై దృష్టిసారించాలని సీఎం ఆదేశించారు. అక్రమాలను నిరూపించేందుకు పక్కా ఆధారాలు సేకరించాలన్నారు. గత ప్రభుత్వంలో గనుల శాఖలో జరిగిన అక్రమాలను తవ్వితీయాలని ఆదేశించారు. కాగా, మంగంపేటలోని బెరైటీస్ టెండర్లపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని గనులశాఖ ముఖ్యకార్యదర్శి మీనా నివేదించారు. ధరలపై నిర్ణయం తీసుకున్నాకే టెండర్లపై స్పష్టత ఇస్తామన్నారు. సీనరేజీ, బొగ్గు కాంట్రాక్టులపై సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. కాగా, డీసిల్టింగ్ పాయింట్ల ఏర్పాటుకు 15 రోజుల సమయం ఇవ్వాలని అధికారులు కోరారు.

ఢిల్లీకి వెళ్లిన గవర్నర్

- హస్తినలోనే మూడు రోజులు.. 2, 3 తేదీల్లో గవర్నర్ల సదస్సు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఢిల్లీకి వెళ్లారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం విజయవాడ నుంచి బయలుదేరి దేశ రాజధానికి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం 2,3 తేదీల్లో నిర్వహిస్తున్న గవర్నర్ల సదస్సుకు ఆయన హాజరవుతారు. ఇందులో రాష్ట్రపతి ముర్ముతో పాటు ఉప రాష్ట్రపతి, ప్రధాని మోదీ, అన్ని రాష్ట్రాల గవర్నర్లు పాల్గొంటారు. కాగా, నేడు రాష్ట్రపతితో ద్రౌపది ముర్ముతో గవర్నర్ నజీర్ భేటీ కానున్నారు. రాష్ట్రంలో పరిస్థితిని ఆమెకు వివరిస్తారు. వివిధ అంశాలపై చర్చిస్తారు. గవర్నర్ల సదస్సు అనంతరం ఆయన తిరిగి 4వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రంలో ఎన్నికల ముగిసిన తర్వాత తొలిసారి గవర్నర్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు.

'సీలింగ్'కు తూట్లు

- పెద్దిరెడ్డి భార్యకు 160 ఎకరాలు
- పెద్దిరెడ్డి, మిథున్‌తో కలిపి 208 ఎకరాలు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గుర్తింపు
- రాగానిపల్లె భూములు ఇందుకు అదనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మదనపల్లె ఫైల్స్' కేసులో రెవెన్యూ శాఖ విచారణలో అనేక సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఓ వైపు అధికారులు ఇష్టారాజ్యంగా రికార్డులు తారుమారు చేసి పేదల పొట్ట కొట్టగా.. మరోవైపు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం పేరిట వందల కోట్లు విలువ చేసే వందల ఎకరాల భూములు ఉన్నట్టు విచారణలో తేలింది. పెద్దిరెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలత, కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి పేరిట మొత్తం 208 ఎకరాలపైనే భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఇందులో ఎక్కువగా అసైన్డ్ భూములు ఉన్నాయని తేలింది. సీలింగ్ చట్టాన్ని ఉల్లంఘించి భూములు సంపాదించారు. మిథున్‌రెడ్డి పేరిట 23.42 ఎకరాలు (పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి గ్రామంలో), పెద్దిరెడ్డి పేరిట 24 ఎకరాలు ఉండగా, స్వర్ణలత పేరిట ఏకంగా 160.58 ఎకరాలు ఉన్నాయి. ఇవన్నీ రెవెన్యూ రికార్డుల్లో నమోదైనట్లుగా లెక్క తీశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, రేణిగుంట, ఏర్పేడు, పుంగనూరు, చిత్తూరు, చౌడేపల్లి, మదనపల్లె, వీరబల్లి, పులిచెర్ల తదితర మండలాల పరిధిలో సాగు భూములున్నట్లు గుర్తించారు. కొనుగోలు చేసిన అసైన్డ్ భూములు కూడా స్వర్ణలత పేరిటే ఉన్నాయి. గడచిన 10 రోజుల్లో విచారణలో వెలుగులోకి వచ్చిన భూముల చిట్టా ఇది. రెవెన్యూ అధికారులు ఇంకా ఉమ్మడి చిత్తూరు జిల్లా భూమి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇప్పటి దాకా గుర్తించిన ఈ 208 ఎకరాలు.. పుంగనూరు మండలం రాగానిపల్లెలోని ఎస్టేట్ భూములకు అదనమని చెబుతున్నారు. రాగానిపల్లె భూముల్లో కొంత మేరనే పెద్దిరెడ్డి స్వర్ణలత పేరిట ఉన్నాయి. మిగతా భూమి ఇతరుల పేరిట ఉంది. పెద్దిరెడ్డికి తిరుపతి రూరల్ మండలం తిరుచానూరులో 17.31 ఎకరాలపైనే ఉన్నట్లు గుర్తించారు. అత్యంత విలువైన ప్రాంతంలోనే ఈ భూములున్నాయి. ఈ భూముల మార్కెట్ విలువ 200 కోట్లపైనే ఉంటుందని అధికారిక అంచనా. రేణిగుంట ఎయిర్‌పోర్టు రన్‌వే పక్కనే ఉన్న భూములు అంటే ఏర్పేడు మండలం వికృతమాల గ్రామం పరిధిలో 27 ఎకరాలు పెద్దిరెడ్డి స్వర్ణలత పేరిట ఉంది. ఈ భూమి విలువ 150 కోట్ల మేర ఉంటుందని అంచనా వేస్తున్నారు. రేణి గుంట మండలం సురప్పకశంలో పెద్దిరెడ్డి స్వర్ణలత పేరిట ఏడు ఎకరాల సాగుభూమితోపాటు 9 నివాస స్థలాలు ఉన్నాయి.

పెద్దిరెడ్డికి నో రూల్స్

ఆంధ్రప్రదేశ్ భూ గరిష్ఠ పరిమితి చట్టం-1973 ప్రకారం ఓ వ్యక్తికి మెట్ట భూమి 54 ఎకరాలు, మాగాణి (తరి) 27 ఎకరాలు ఉండొచ్చు. అంతకు మించి గజం ఎక్కువ ఉన్నా చట్ట ఉల్లంఘనే. మిగులు భూమిని సర్కారు స్వాధీనం చేసుకుంటుంది. ఆ తర్వాత అది ప్రభుత్వ భూమిగా రికార్డుల్లోకి ఎక్కుతుంది. రెవెన్యూ విచారణలో వెలుగు చూసిన భూముల్లో పెద్దిరెడ్డి భార్య పేరిట ఏకంగా 160.58 ఎకరాల భూమి ఉంది.

ఎన్నికల అఫిడవిట్‌లో దాచి...

భూమి అనేది ఆస్తి కిందకే వస్తుంది. ఎన్నికల్లో పెద్దిరెడ్డి అఫిడవిట్‌లో ఈ భూముల వివరాలు పేర్కొనాలి. కానీ, ఆయన అనేకం ప్రస్తావించలేదు. ఏర్పేడులోని వికృతమాల, తిరుచానూరు, రాగానిపల్లె గ్రామాల భూముల గురించి అఫిడవిట్‌లో పేర్కొనలేదని తెలిసింది. పెద్దిరెడ్డి సీలింగ్ చట్టాన్ని ధిక్కరించి వందలాది ఎకరాలు ఎలా కొన్నారు? రెవెన్యూ అధికారులు ఎలా అనుమతించారు? ఇంతవరకు ఆయన భూములపై సమీక్ష ఎందుకు జరగ లేదు? ఆయనను టచ్ చేసే ధైర్యం ఎవరూ చేయకపోవడం వల్లే ఈ భూబాగోతం ఇప్పటి దాకా బయటపడలేదని చెబుతున్నారు.

పుంగనూరు అభ్యర్థులందరినీ ప్రతివాదులుగా చేర్చాల్సిందే

- రామచంద్ర యాదవ్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వేసిన ఎన్నికల పిటిషన్(ఈపీ)లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రతివాదులుగా చేర్చాల్సిందేనని పిటిషనర్ బోడె రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు తేల్చిచెప్పింది. వారిని ప్రతివాదులుగా చేర్చకుండా కేసు విచారణ ముందుకెళ్లలేదని పేర్కొంది. పిటిషన్‌పై ఏం జరుగుతోందో తెలుసుకునే హక్కు పెద్దిరెడ్డితో పాటు పోటీ చేసిన అభ్యర్థులందరికీ ఉంటుందని స్పష్టం చేసింది. వారందరినీ ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశిస్తూ విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. పెద్దిరెడ్డి తన సతీమణికి సంబంధించిన 142 ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచలేదని, ఈ నేపథ్యంలో ఆయన్ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా రామచంద్ర యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. పెద్దిరెడ్డితో పాటు ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులందరినీ ప్రతివాదులుగా చేర్చాల్సిన అవసరం లేదన్నారు. అయితే కోర్టు ఆదేశిస్తే వారందరినీ ప్రతివాదుల జాబితాలో చేరుస్తామని తెలిపారు. ఈ వాదనలతో న్యాయమూర్తి విభేదించారు. ఎన్నికల పిటిషన్‌లో ఎవరి ఎన్నికనైతే సవాల్ చేస్తున్నారో.. ఆయనతో పాటు పోటీలో ఉన్న అందరినీ ప్రతివాదులుగా చేర్చాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

సంజయ్, పొన్నవోలుకు హైకోర్టు నోటీసులు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దర్యాప్తు దశలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కేసు వివరాలను నిబంధనలకు విరుద్ధంగా మీడియాకు వెల్లడించడంతో పాటు అందుకోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వ్యవహారంలో సీఐడీ పూర్వ అడిషనల్ డీజీ సంజయ్, మాజీ అడిషనల్ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి బుధవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వీరితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శికి కూడా నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 9కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. ఎస్.జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబుపై నాడు దాఖలు చేసిన స్కిల్ కేసు వివరాలను పత్రికా సమావేశాలు నిర్వహించి వెల్లడించడం ద్వారా నిబంధనలు అతిక్రమించిన సంజయ్, పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ యునైటెడ్ క్యాంపెయిన్ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.గిరిబాబు వాదనలు వినిపించారు. ఆంగ్లంలో తర్జుమా చేసిన వివరాలను కోర్టు ముందు ఉంచామన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

ఆషాఢం తర్వాతే పదవుల భర్తీ

- టీడీపీ నాయకత్వం యోచన

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆషాఢ మాసం తర్వాతే నామినేటెడ్ పదవుల భర్తీ చేసే ఆలోచనలో టీడీపీ అధినాయకత్వం ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆషాఢ మాసంలో కీలక నిర్ణయాల ప్రకటన సహజంగా ఉండదు. శ్రావణ మాసం శుభప్రదమన్న భావనతో పదవుల పంపకం ఆ సమయంలో చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. తొలి విడతలో సుమారు పాతిక వరకూ నామినేటెడ్ పదవుల భర్తీ చేపట్టాలని టీడీపీ భావిస్తోంది. జనసేనాని పవన్‌కల్యాణ్ బుధవారమిక్కడ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. నామినేటెడ్ పదవుల భర్తీ అంశం కూడా చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. ఈ పదవుల్లో కొన్ని జనసేన, బీజేపీ లభించే అవకాశం ఉంది.

రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మెండ లక్ష్మీనారాయణ

- ఉత్తర్వులు జారీ చేసిన న్యాయశాఖ
- ఏపీ చరిత్రలోనే మొదటిసారి ఓ బీసీకి పీపీ పదవి

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మెండ లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఆయన నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) సునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా హైకోర్టును సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీనారాయణను పీపీగా నియమించింది. పీపీ హోదాలో లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో క్రిమినల్ కేసులు, అప్పీళ్ల విచారణ తదితర కేసుల్లో వాదనలు వినిపిస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, విభజిత రాష్ట్రంలోకానీ హైకోర్టులో ఇప్పటివరకు బీసీ కులాలకు చెందిన న్యాయవాది పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమింపబడలేదు. ఓ బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి పీపీ కావడం ఇదే మొదటిసారి. టీడీపీని స్థాపించిన దగ్గర నుంచి ఉన్నత పదవులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇస్తోంది ఇప్పటికీ ఆ పార్టీ అదే ఒరవడిని కొనసాగిస్తోంది. పోలినాటి వెలమ(బీసీ) సామాజికవర్గానికి చెందిన లక్ష్మీనారాయణను పీపీగా నియమించడమే అందుకు నిదర్శనం. లక్ష్మీనారాయణది, శ్రీకాకుళం జిల్లా సొంతబొమ్మాళి మండలం చిన్నతుంగం పంచాయతీ పరిధిలోని కృష్ణచంద్రాపురం గ్రామం. తల్లిదండ్రులు తవిటమ్మ, కృష్ణమ్మ. నిరుపేద వ్యవసాయ కుటుంబంలో జన్మించిన లక్ష్మీనారాయణ శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో డిగ్రీ, విజయనగరంలో బీఈడీ, విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్సీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2009లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. టీడీపీ న్యాయ విభాగంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 2014-19 మధ్యకాలంలో ప్రత్యేక సహాయ పీపీగా పనిచేశారు.

ఏజీపీలుగా మరో 14 మంది నియామకం

- మొత్తం 28 మందిలో 17మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో 14 మంది సహాయ ప్రభుత్వ న్యాయవాదులను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.సునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాదులు ఎం.శ్రీనుబాబు, సీహెచ్ శాంసన్, మద్దాల సంధ్యాదీప్తి, మేకల అనూష, షహీనా ఖాతూన్, ఆర్ సూర్యనారాయణ, కొరిబిల్లి సందీప్, తుంగల రఘుప్రసాద్, ఆర్ఎస్ మణిధర్ పింగళి, జె.కృష్ణ ప్రణీత్, అరువ రఘురాం, పాతూరి శ్రీనివాస్, అప్పసాని వినీత్, కాటా సాంబశివరావు ఏజీపీలుగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు 28మంది ఏజీపీల నియామకం జరిగింది. వీరిలో 17మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారే. మొత్తం నియామకాల్లో వీరిది 61 శాతంగా ఉంది.

నంద్యాల, సత్యసాయి జిల్లాల్లో నేడు సీఎం చంద్రబాబు పర్యటన

అమరావతి, మడకశిర రూరల్/పుట్టపర్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): నేడు సీఎం చంద్రబాబు నంద్యాల, సత్యసాయి జిల్లాల్లో పర్యటించనున్నారు. గురువారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీశైలం సమీపంలోని సున్నిపెంటకు వెళ్తారు. అక్కడ నుంచి వాహనంలో శ్రీశైలం చేరుకొని మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను దర్శించుకోనున్నారు. అనంతరం శ్రీశైలం రిజర్వాయర్ వద్దకు చేరుకుని, కృష్ణా నదికి ఇచ్చే హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడే ఉన్న శ్రీశైలం పవర్ స్టేషన్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత సున్నిపెంటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమల గ్రామానికి వెళ్తారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తారు. మధ్యాహ్నం 1.45 గంటలకు గుండుమలకు చేరుకుంటారు. గ్రామంలో పింఛన్ లబ్ధిదారులు ఓబులమ్మ, రామన్న ఇళ్ల వద్దకు వెళ్లి, వారికి పింఛన్లు అందజేస్తారు. అనంతరం గ్రామం నడిబొడ్డున ప్రజావేదికలో పట్టు రైతులు, గుండుమల ప్రజలతో ముఖాముఖి మాట్లాడుతారు.

జగనన్న కాలనీ రోడ్లపై వరినాట్లు

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులో ఉన్న జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులపై అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం వినూత్న నిరసన చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు జగనన్న కాలనీలో ప్రధాన, అంతర్గత రహదారులన్నీ బురదమయంగా మారి నడవడానికి వీలులేని స్థితికి చేరాయి. ఈ నేపథ్యంలో ఏఐఎఫ్‌టీయూ నేతలు, కాలనీవాసులు ఈ రహదారులపై వరినాట్లు వేసి తమ నిరసన తెలిపారు. - గొల్లప్రోలు



కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్లపై వరినాట్లు వేస్తున్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు, కాలనీవాసులు

టీడీపీ ప్రధాన కార్యాలయంలో వినతిపత్రాల స్వీకరణ

- 14 వరకు పాల్గొనే మంత్రులు వీరే..

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణుల కోసం ఎన్టీఆర్ భవన్‌లో ఆగస్టు 1 నుంచి 14 వరకు అందుబాటులో ఉండనున్న రాష్ట్ర మంత్రులు, పార్టీ నేతల వివరాలను పార్టీ ప్రకటించింది. ఆగస్టు 1న ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, 2న గొట్టిపాటి రవికుమార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, 3న సీఎం చంద్రబాబు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, 5న మంత్రి అచ్చెన్నాయుడు, జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని రామారావు, 6న హోం మంత్రి వంగలపూడి అనిత, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, 7న మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, 8న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, 9న మంత్రి నిమ్మల రామానాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, 10న సీఎం చంద్రబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్, 12న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, 13న మంత్రి టీజీ భరత్, జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, 14న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, జాతీయ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని టీడీపీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, జనసేన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆగస్టు 1వ తేదీ నుంచి మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉండి ప్రజల నుంచి అర్జీలు, పార్టీ శ్రేణుల నుంచి అభ్యర్థనలు, సూచనలు స్వీకరిస్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నేడు రాజధాని అమరావతిలో పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు టెండర్ ఓపెన్

విజయవాడ: అమరావతి రాజధానిలో పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు రూ.36.50 కోట్ల వ్యయంతో పిలిచిన టెండర్లను గురువారం సీఆర్‌డీఏ తెరవనుంది. వాస్తవానికి ఈ నెల 25నే టెండర్లను తెరవాల్సి ఉండగా.. 29 వరకు పొడిగించారు. తర్వాత మరో రెండు రోజులు పొడిగించారు. కాంట్రాక్టర్ల సందేహాలను నివృత్తి చేసేందుకే టెండర్ల గడువును పొడిగించినట్టుగా తెలుస్తోంది. గురువారం సాయంత్రంలోపు పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది.

11 సీట్లతో అసెంబ్లీకి రావడానికి జగన్‌కు ముఖం చెల్లట్లేదా: వెలగపూడి

పెనమలూరు: ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అర్హత లేని ప్రతిపక్ష నాయక హోదా అడుగుతూ, అదే వంకతో అసెంబ్లీకి డుమ్మా కొడుతున్న సైకో జగన్‌రెడ్డి తనకు వచ్చిన కేవలం 11 సీట్లతో అసెంబ్లీకి హాజరవడానికి ముఖం చెల్లడం లేదా అని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ప్రశ్నించారు. బుధవారం కానూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైనాట్ 175 అని ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి 11 సీట్లతో చతికిలపడి కనీసం తాడేపల్లి ప్యాలెస్‌లో కూడా లేకుండా బెంగళూరు ప్యాలెస్‌కు మకాం మార్చాడని ఎద్దేవా చేశారు.

మడిచర్ల ఉపాధ్యాయురాలు సస్పెన్షన్

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండలం మడిచర్ల (ఎస్సీ) ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు రాధామాధవిని జిల్లా విద్యాశాఖాధికారి తాహేరా సుల్తానా సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఎంఈవో రాంబాలసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల విధులకు ఉపాధ్యాయురాలు గైర్హాజరవడంతో పాటు పాఠశాల విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విద్యాశాఖ జిల్లా ఉన్నతాధికారి సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంఈవో తెలిపారు. ఆ పాఠశాలకు సింగిల్ టీచర్ కావడంతో డిప్యూటేషన్‌పై వేలేరు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు మీరావలిని తాత్కాలికంగా నియమించినట్టు ఆయన తెలిపారు.

వలంటీర్ల వ్యవస్థను రద్దుచేయాలి: గోలి

ఉయ్యూరు: రాష్ట్ర ప్రభుత్వానికి పెనుభారమైన వలంటీర్ల వ్యవస్థను రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ అన్నారు. ఆకునూరులోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థను రద్దుచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఇటీవల ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు.

జగన్‌రెడ్డి ఫొటోల పిచ్చికి రూ.700 కోట్లా?

విద్యాధరపురం: మాజీ సీఎం జగన్‌రెడ్డి తన ఫొటోల పిచ్చికి రూ.700 కోట్లు వ్యయం చేశాడని టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు సోలంకి రాజుజైన్ విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విచ్చలవిడి, బాధ్యతారాహిత్యంతో ప్రజల సొమ్మును వ్యయం చేసే హక్కు ఆయనకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి ముఠా తిన్నదంతా సీఎం చంద్రబాబు కక్కిస్తారన్నారు.

నాసిరకం సరుకు కనిపిస్తే సహించం

- మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి



రామవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి

గుణదల, జూలై 31: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం సరుకులు కనబడితే సహించేది లేదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి హెచ్చరించారు. రామవరప్పాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలెంతమంది ఉన్నారు, వారి ఆరోగ్య స్థితిగతులేమిటి, పుష్టికరంగా ఉన్నారా.. లేదా, ఎత్తు, బరువులను స్వయంగా పరిశీలించారు. పప్పుధాన్యాలు పరిశీలించి క్వాలిటీని స్వయంగా పరిశీలించి చిన్నారులకు ఏ మోతాదులో ఫుడ్ అందిస్తున్నారన్నది తెలుసుకున్నారు. ప్రీస్కూల్ విధానాన్ని, పిల్లల్ని ఆడించే ఆటలు, తల్లుల ఆరోగ్య పరిస్థితులను సిబ్బందిని అడిగారు. కార్పొరేట్ ప్రీస్కూల్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి జి.ఉమాదేవి, రూరల్ మండల సీడీపీవో జి.మంగమ్మ, స్వర్ణకుమారి, జ్యోతి పాల్గొన్నారు.

కేసరపల్లి స్నేహపురి కాలనీలో..

గన్నవరం: మండలంలోని కేసరపల్లి స్నేహపురి కాలనీలో అంగన్వాడీ కేంద్రాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సూర్యకుమారి ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకిచ్చే సరుకులు, పౌష్టికాహారాన్ని చూశారు. ప్రీస్కూల్ సిలబస్ ప్రకారం జరుగుతుందా లేదా అని పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా సరుకులివ్వాలన్నారు. చిన్నారుల పట్ల అశ్రద్ధ వహిస్తే సహించేది లేదన్నారు. పీడీ సువర్ణ, సీడీపీవో పి.వెంకటలక్ష్మీ, సూపర్‌వైజర్ నాగ పద్మావతి, అంగన్వాడీ వర్కర్ స్వప్న పాల్గొన్నారు.

వైసీపీ నేతల రాయ'బేరాలు'

- ఎమ్మెల్యేతో మాట్లాడాలని టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలతో మంతనాలు
- అవసరమైతే తమ అక్రమ సంపాదనలో సగం ఇస్తామంటూ ప్రలోభాలు

పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్: గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలతో కోట్లకు పడగలెత్తిన వైసీపీ నేతలు మళ్లీ జగన్ ప్రభుత్వం వస్తుందనే ఆశతో సెంట్రల్‌లోని టీడీపీ నేతలను, కార్యకర్తలను, మహిళా కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురి చేశారు. అయితే వారి ఆశలు అడియాశలై ఎవరూ ఊహించని విధంగా ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. దీంతో అడ్డదిడ్డంగా అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తమ అక్రమాలను ఎక్కడ వెలికితీస్తుందోనన్న భయంతో పార్టీ మారేందుకు టీడీపీ నేతలతో రాయ'బేరాలు' చేస్తూ పార్టీ మారేందుకు తహతహలాడుతున్నారు. అనుకున్నది అనుకున్నట్టుగా తాము పార్టీ మారేలా సహకరించి పార్టీలో చేర్చుకుంటే తమ అక్రమార్జనలో సగభాగం ఇస్తామంటూ ద్వితీయస్థాయి నేతలను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఆయా డివిజన్లలోని ఎమ్మెల్యేకు సన్నిహితంగా ఉండేవారిని పట్టుకుని పార్టీలో చేరేందుకు విశ్వప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. దీంతో కొంతమంది నేతలు వారిని పార్టీలోకి తీసుకోవడానికి సమ్మతించాలని సంప్రదింపులు చేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న ఐదేళ్లు పార్టీ కోసం కష్టపడి వైసీపీ పాలనలో అక్రమ అరెస్టులు, దాడులు, బూతు పంచాగాలను భరించిన అసలైన టీడీపీ కార్యకర్తలను వేధించిన వైసీపీ కేటుగాళ్ల పట్ల ఎమ్మెల్యే అప్రమత్తంగా ఉండాలని, ఊసరవెల్లిలా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వచ్చి అక్రమ సంపాదనను కొనసాగించే వ్యక్తులను దూరంగా ఉంచాలని వారు కోరుతున్నారు.



ఎల్‌జీ ఓఎల్‌ఈడీ సీ4 టీవీని ఆవిష్కరిస్తున్న సంస్థ అధినేత రాకేష్

ఎల్‌జీ ఓఎల్‌ఈడీ సీ4 టీవీ ఆవిష్కరణ

లబ్బీపేట, జూలై 31: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ నుంచి నూతనంగా విడుదల చేసిన ఎల్‌జీ ఓఎల్‌ఈడీ సీ4 సిరీస్ టీవీని సాయిబాలాజీ ఎలక్ట్రానిక్స్ అధినేత ఎస్.రాకేష్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. బీఎస్ఎన్ఎల్ భవన్ వద్ద గల ఎల్‌జీ బెస్ట్ షాప్‌లో జరిగిన కార్యక్రమంలో ఎల్‌జీ సంస్థ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ పరుచూరి కిషోర్ బాబు మాట్లాడుతూ తమ ఉత్పత్తులు టీవీ రంగంలో సరికొత్త విప్లవాత్మక మార్పులను తీసుకొస్తుందన్నారు. వినియోగదారులకు ఈ టీవీ ఏఐ ఆధారంగా పనిచేస్తూ దాంతో పాటు డాల్బీ విజన్ డాల్బీ అట్మాస్ లాంటి ఆడియో వీడియో విభాగాల్లో సరికొత్త అనుభవాన్ని అందజేస్తుందన్నారు. ఎల్‌జీ ఏరియా మేనేజర్ కూచిపూడి వంశీకృష్ణ, మార్కెటింగ్ మేనేజర్ హేమంత్, సాయిబాలాజీ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమర్థవంతులైన డ్రైవర్లను నియమించుకోవాలి: ట్రాఫిక్ డీసీపీ

గుణదల, జూలై 31: సమర్థవంతులైన డ్రైవర్లను పాఠశాల, కళాశాలల బస్సు ఆపరేటర్లుగా నియమించుకోవాలని ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి తెలిపారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ వద్ద గల కమాండ్ కంట్రోల్‌రూమ్ నందు నగరంలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో ట్రాఫిక్ సమస్యపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల, పాఠశాల ప్రాంగణాల్లోనే విద్యార్థినీ, విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకునేలా చూడాలని రోడ్లపై ఆపి ఎక్కించుకోవడం వల్ల ఇతరులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. బందర్‌రోడ్డు, ఏలూరు రోడ్డులో ఇలా ఎక్కువగా జరుగుతున్నాయని దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా తయారైందన్నారు. ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లు మత్తుపానీయాలు తీసుకోకుండా చూడాలని వారికి హెల్పర్‌గా క్లీనర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ పరిక్షించుకోవాలన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను తిప్పడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద జీబ్రాగుర్తులు, స్పీడ్‌బ్రేకర్లు వేసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఏసీపీలు, సీఐలు, పాఠశాలలు, కళాశాలల యజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.



తుమ్మల రామబ్రహ్మం అవార్డు అందుకుంటున్న డాక్టర్ రమ్య

డాక్టర్ రమ్యకు తుమ్మల రామబ్రహ్మం రీసెర్చ్ అవార్డు

- పెద్దపేగు కేన్సర్ చికిత్సల్లో పరిశోధనకు దక్కిన గౌరవం

గుంటూరు (మెడికల్), జూలై 31: పెద్ద పేగు కేన్సర్ రోగులకు మెరుగైన వైద్యచికిత్సలు అందించేందుకు దోహదపడే పరిశోధనకు గుంటూరు వైద్య కళాశాల పాథాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కట్టా రమ్యకు ప్రతిష్ఠాత్మక డాక్టర్ తుమ్మల రామబ్రహ్మం రిసెర్చ్ అవార్డు లభించింది. వైద్య కళాశాల, ప్రభుత్వాస్పత్రికి చెందిన బోధన సిబ్బందిని పరిశోధన రంగంలో ప్రోత్సహించేందుకు, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) ప్రతినిధులు ఏటా ఈ అవార్డును అందజేస్తుంటారు. ఈ ఏడాది అందిన వాటిల్లో అత్యుత్తమ వైద్య పరిశోధనగా.. డాక్టర్ కట్టా రమ్య చేసిన పరిశోధనను ఎంపిక చేశారు. బుధవారం జీఎంసీ ప్రిన్సిపాల్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి, జింకానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ త్రిపురనేని, కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు తదితరులు ఆమెకు అవార్డును అందజేశారు. అవార్డు కింద ప్రశంసా పత్రం, 600 డాలర్ల నగదు బహుమతి అందజేశారు.

జూనియర్ లెక్చరర్లను రెన్యువల్ చేయండి: జేఏసీ

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల కాంట్రాక్టును రెన్యువల్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఏప్రిల్‌తో గతేడాది కాంట్రాక్టు గడువు ముగియగా, ఇప్పటివరకూ రెన్యువల్ ఉత్తర్వులు జారీ కాలేదని జేఏసీ నేతలు కుమ్మరకుంట సురేష్, కల్లూరి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా 3,618 మంది జేఎల్స్ జీతాల్లేకుండానే మూడు నెలలుగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రెన్యువల్ ఉత్తర్వులు ఇప్పించి జీతాలు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- శ్రీకాకుళం జిల్లా నందిగాంలో ఘటన
- బంధువులు, దళిత నాయకుల ఆందోళన
- విచారణకు ఆదేశించిన మంత్రి డోలా



అక్షిత

అమరావతి(ఆంధ్రజ్యోతి), నందిగాం, జూలై 31: గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. శ్రీకాకుళం జిల్లా నందిగాంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. గురుకుల ప్రిన్సిపాల్ బి.దమయంతి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురం దరి మహసింగి గ్రామానికి చెందిన లిమ్మక శ్రావణి, గిరి దంపతుల రెండో కుమార్తె లిమ్మక అక్షిత ఈ నెల 24న గురుకుల కళాశాలలో చేరింది. 26న హోమ్‌సిక్‌తో ఇంటికి వెళ్లి, తిరిగి 29న తల్లిదండ్రులతో గురుకులానికి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి బాత్రూమ్ కిటికీకి చున్నీతో ఉరేసుకుంది. బుధవారం వేకువజామున టాయిలెట్‌కు వెళ్లిన ఆరో తరగతి విద్యార్థిని కిటికీకి అక్షిత మృతదేహం వేలాడుతోందని సిబ్బందికి చెప్పడంతో ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులు రాకుండా మృతదేహాన్ని తరలించడంపై బంధువులు, దళితహక్కుల పోరాటసమితి నాయకులు ఆందోళన చేశారు. సమగ్ర విచారణ జరిపి, కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి గురుకులానికి చేరుకుని ప్రిన్సిపాల్, అక్షిత తల్లిదండ్రులతో చర్చించారు. అక్షిత పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదివిందని, ఇంటర్‌లో ఇంగ్లీష్ మీడియంలో చేరడం వల్లే అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి విచారణకు ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని ఆదేశించారు. ఈ ఘటన విచారకరమని, తన మనసును తీవ్రంగా కలచివేసిందని మంత్రి తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, విద్యార్థులు క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుని బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు.

రూ.300 కోట్లు గోల్‌మాల్ !

- మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంకు కేసు
- హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంకులో రూ.300 కోట్ల నిధుల గోల్‌మాల్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని ఆరు వేర్వేరు ప్రాంతాల్లో బ్యాంకు ప్రమోటర్ల ఇళ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది.. నకిలీ పత్రాలు సృష్టించడం, నిబంధనలకు విరుద్ధంగా రూ.300 కోట్లకుపైగా రుణాల మంజూరు, బ్యాంకు నుంచి రూ.18.30 కోట్లు దారి మళ్లింపు ఆరోపణలపై ఈడీ విచారణ చేస్తోంది. ఇందులో భాగంగా బ్యాంకు చైర్మన్ రమేష్ కుమార్ బంగ్, వైస్ చైర్మన్ పురుషోత్తమదాస్, ఎండీ ఉమేష్ చంద్‌కు సంబంధించిన ప్రాంతాల్లో సోదాలు చేసిన ఈడీ బృందాలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను సేకరించాయి. ఈ సమాచారం ఆధారంగా నిధుల దారిమళ్లింపుతో సంబంధం ఉన్న వెంకట్, మరో ఇద్దరు వ్యక్తుల ఇళ్లు, కార్యాలయాల్లోనూ సోదాలు చేశారు. కాగా, రూ.300 కోట్ల మేర నిధుల గోల్‌మాల్‌పై ఏపీ మహేష్ కో-ఆపరేటివ్ బ్యాంక్ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఈడీ విచారణ చేపట్టింది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

అగ్రిగోల్డ్ బినామీ ఆస్తుల కేసులో ఒకరి అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 31: అగ్రిగోల్డ్ సంస్థకు డిపాజిట్లు కట్టించుకుని ఆపై ఆస్తులకు బినామీగా వున్న వ్యక్తిని సీఐడీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ మేనేజ్‌మెంట్ భాగస్వామి అయిన అవ్వా హేమసుందర్ వరప్రసాద్ అలియాస్ రాజా వద్ద డ్రైవర్‌గా ఏలూరు చొదిమెళ్లకు చెందిన జుజ్జువరపు లక్ష్మణరావు పని చేస్తున్నాడు. అతని ద్వారా ఏలూరు చోడిదిబ్బకు చెందిన షేక్ బాజీ 70 వేలు ఆ సంస్థలో డిపాజిట్ చేయగా, ఆ నగదు తిరిగి ఇవ్వలేదు. ఆ కంపెనీపై అనేక కేసులు నమోదయ్యాయి. అయితే సీఐడీ అధికారులకు, ప్రభుత్వానికి ఆస్తులను తెలియనివ్వకుండా రహస్యంగా హేమసుందరవరప్రసాద్ ఏలూరు చొదిమెళ్లలో పదెకరాలు కొనుగోలు చేసి, లక్ష్మణరావు పేరు మీద రిజిస్టర్ చేయించారు. వీటిలో నాలుగు ఎకరాల 36 సెంట్లను ద్వారకా తిరుమల మండలం పోతేపల్లికి చెందిన అనిల్ అనే వ్యక్తికి విక్రయించారని, అదే విధంగా మిగిలిన ఆస్తులను లక్ష్మణరావు పేరు మీద ఉంచి ప్రజలను మోసగించారంటూ బాజీ సీఐడీ అధికారులకు 2020లో ఫిర్యాదుచేశారు. దీంతో అదే ఏడాది జూన్ 18న మంగళగిరి సీఐడీ ప్రధాన కార్యాలయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా లక్ష్మణరావును సీఐడీ అధికారులు బుధవారం అరెస్టు చేసి సాయంత్రం ఏలూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సి.పురుషోత్తమ కుమార్ ముందు హాజరుపరచగా, ఆగస్టు 13వ తేదీ వరకూ రిమాండ్ విధించారు.

వాలంటీర్ల జీతాలను జగన్ నుంచి రాబట్టాలి: నిరుద్యోగ జేఏసీ

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వాలంటీర్లకు చెల్లించిన జీతాలను మాజీ సీఎం జగన్ నుంచి రాబట్టాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్ డిమాండ్ చేశారు. వైసీపీ కార్యకర్తలను వాలంటీర్లుగా నియమించుకుని ఐదేళ్లలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వారికి జీతాలుగా ఇచ్చారన్నారు. ఒకవేళ ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తే ఎన్నికల సమయంలో రాజీనామాలు చేసిన వారిని తిరిగి తీసుకోవద్దని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



సత్తా చాటిన తైక్వాండో ప్లేయర్స్‌ను అభినందిస్తున్న హెచ్ఎం నిర్మల

రాష్ట్రస్థాయి తైక్వాండోకు సెయింట్ జోసెఫ్, డాన్‌బాస్కో విద్యార్థుల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, జూలై 31: రాష్ట్రస్థాయి తైక్వాండ్ చాంపియన్‌షిప్‌కు గుణదలలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ నిర్మల తెలిపారు. ఈ పోటీలు ఆగస్టు 2 నుంచి 4 వరకు అనంతపురంలో జరుగుతాయన్నారు. ఆంధ్రా లయోలాలో ఇటీవల జరిగిన జిల్లా తైక్వాండ్ చాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు 14 బంగారు, 5 రజిత, 1 కాంస్య పతాకాన్ని వశం చేసుకున్నారన్నారు. ఆర్ అక్షిత (స్వర్ణం), టి నిషాంత్ (స్వర్ణం), ఎం మహేష్ (స్వర్ణం), జి.మోహన్ వంశీ (రజతం), బి ఉషశ్రీ (స్వర్ణం) సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను, కోచ్ అంకమ్మరావును ఆమె అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

డాన్‌బాస్కో విద్యార్థుల సత్తా

నగరంలో ఇటీవల జరిగిన జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గుణదల కార్మెల్‌నగర్ డాన్‌బాస్కో సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు పలువురు సత్తా చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ తెలిపారు. అండర్-11 బాలికల విభాగంలో ఎం నిహారిక స్వర్ణాలు సాధించిందన్నారు. పి అభిషేక్ కాంస్యం, ఎం.రిట్సికా 4స్వర్ణాలు, రజతం, కె.డామిని 4 స్వర్ణాలు, కాంస్యం, సీహెచ్ జాహ్నవి (రజతం), టి.హాసిత (రజతం), జె.మీనా శ్రీ (రజతం), కె.ప్రణతి (కాంస్యం) సాధించారన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి: గోగులమూడి

గుణదల, జూలై 31: షూటింగ్ బాల్ క్రీడలో రాణించిన వారు ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి గోగులమూడి విజయ్ కుమార్ కోరారు. ప్రసాదంపాడులోని సెంట్ ఆన్స్ సీబీఎస్ పాఠశాలలో సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ఎంపికలకు హాజరైన ఈ పోటీలకు పరిశీలకులుగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నూతలపాటి జగదీష్ పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు చిత్తూరు జిల్లా కుప్పంలో ఆగస్టు 10, 11న జరగబోయే రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అక్కడ ప్రతిభ కనబరిస్తే జాతీయ పోటీలకు హాజరవుతారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అరుణ మేరీ, వ్యాయామ ఉపాధ్యాయుడు జలసూత్రం వెంకట్రావ్, పీఈటీలు పాల్గొన్నారు.

గత ఐదేళ్ల అరాచక పరిపాలనతో దెబ్బతిన్న ఏపీ

ఎమ్మెల్యే సుజనా చౌదరి



తిరుమల, జూలై 31(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అరాచక, చేతగాని పరిపాలనతో ఏపీ చాలా దెబ్బతిందని విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. స్వామి ఆశీస్సులతో కూటమిని ప్రజలే భారీ మెజార్టీతో గెలిపించుకున్నారన్నారు.స్వామిని దర్శించుకుని ఏపీకి మంచి జరగాలని కోరుకున్నట్టు తెలిపారు. అలాగే తన మనవడి పుట్టువెంట్రుకలు కూడా సమర్పించామన్నారు.

సావిత్రి కళాపీఠం కొత్త కార్యవర్గం

విజయవాడ కల్చరల్, జూలై 31: మహానటి సావిత్రి సాహిత్య సంస్కృతి కళాపీఠం కొత్త కార్యవర్గ మండలిని నియమించినట్టు సంస్థ అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి పేర్కొన్నార. ప్రధాన కార్యదర్శిగా తోట కిషోర్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ప్రభల శ్రీనివాస్, సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ జీవీఎస్ఆర్ఎస్ వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా పైడిపాటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొత్త జ్యోతి, సంయుక్త కార్యదర్శిగా రావి పద్మావతి, కో-ఆర్డినేటర్‌గా కోపూరు స్వాతి, వడ్లాది కామేశ్వరి, మట్టా శేష నారాయణ నియమితులయ్యారు. తలపురెడ్డి శ్రీనివాసరెడ్డి, నెలిబండ్ల బాల పాల్గొన్నారు.

యార్లగడ్డ చొరవతో మల్లవల్లికి మహర్దశ



గన్నవరం, జూలై 31: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో మల్లవల్లి పారిశ్రామిక వాడకు మహర్దశ పట్టనుంది. ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే ఆయన మల్లవల్లి పారిశ్రామికవాడలో పూర్తిస్థాయి పరిశ్రమల ఏర్పాటుకు కార్యచరణ చేపట్టారు. దీనిలో భాగంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఏపీఐఐసీ అధికారులతో మల్లవల్లి పారిశ్రామికవాడలో పర్యటించి పారిశ్రామిక వేత్తల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే పారిశ్రామికవాడలోని సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించాలని, పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పారిశ్రామికవాడలో భూములు పొందిన పారిశ్రామిక వేత్తలతో పలు దఫాలుగా సమావేశమై మల్లవల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్ బొల్లారంలోని పారిశ్రామికవేత్తలతో సమావేశమైన యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రావాలని ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు బుధవారం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల స్థాపనకు గతంలో భూములు పొందిన పారిశ్రామికవేత్తలను తిరిగి వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాలని, పారిశ్రామికవాడలో భూముల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మరో 4 ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం ప్రకటించారు. మల్లవల్లి పారిశ్రామికవాడలోని సమస్యలపై స్పందించిన సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధన్యవాదాలు తెలిపారు.




అమ్మవారికి సారె తీసుకువచ్చిన అన్నదాన విభాగం సిబ్బందితో ఈవో

దుర్గమ్మకు కొనసాగుతున్న సారె సమర్పణలు

వన్‌టౌన్ జూలై 31: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు బుధవారం అన్నదాన విభాగం అధికారులు, సిబ్బంది ఘనంగా సారె సమర్పించారు. తొలుత అన్నదాన విభాగంలో అమ్మవారి చిత్రపటానికి ఈవో రామారావు, అధికారులు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించి ఆరో అంతస్తులో పూజలో పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు. డిప్యూటీ ఈవో లీలాకుమార్, ఈఈ లింగం రమాదేవి, ఏఈవోలు చంద్రశేఖర్, ఎన్ రమేష్‌బాబు పర్యవేక్షకులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గొర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చక్రవర్తి ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి ఆషాఢసారె సమర్పించారు. వస్త్రాలు, పండ్లు, పూలు, పసుపు కుంకుమలు, గాజులు, తీపి పదార్థాలతో ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు. ట్రస్ట్ సభ్యులు ఎం పద్మప్రియ, గొర్తి లత, ఉదయలక్ష్మి, గోపాల్, జగన్, దుర్గామల్లేశ్వరి పాల్గొన్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు: సీపీఐ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకర్

ధర్నాచౌక్, జూలై 31: గనులు, పరిశ్రమలు, కార్మిక, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు మామూళ్ల మత్తులో జోగి పరిశ్రమలు, క్వారీల్లో భద్రతను పర్యవేక్షించడం లేదని, ప్రభుత్వాల ఉదాసీనత వల్లే కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. క్వారీల్లో ప్రమాదాలు, పరిశ్రమల కాలుష్యంపై ఈ నెల 2న ఇబ్రహీంపట్నంలో నిర్వహించే ధర్నా పోస్టర్‌ను స్థానిక దాసరిభవన్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అనధికారంగా నడుస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండపల్లి పారిశ్రామిక, వీటీపీఎస్ కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ ప్రమాద మృతులు వీవీ నాయక్, బత్తుల దుర్గారాజు, రాందేవ్ నాయక్ కుటుంబాలకు రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ జిల్లా శ్రేణులు, అనుబంధ సంఘాల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, పార్టీ జిల్లా సహాయకార్యదర్శి బుడ్డి రమేష్, బుద్దవరపు వెంకట్రావ్, పెయ్యల వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు పాల్గొన్నారు.

ఎజెండాలోని పలు అంశాలు ఏకగ్రీవం

ఉయ్యూరు, జూలై 31: నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఏజెండాలో పలు అంశాలు ఏకగ్రీవంగా ఆమోదమయ్యాయి. శివాలయంలో రోడ్డులోని అన్న క్యాంటీన్ రూ.6.66 లక్షలతో మరమ్మతు పనులతో పాటు పలు అంశాలకు ఆమోదం లభించింది. 2021 నుంచి ఇప్పటి వరకు నగరపంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధికి సంబంధించి వివరాలు తెలపాలని వైస్ చైర్మన్ సోలె సురేశ్ వివరణ కోరారు. 14వవార్డులో అసంపూర్తిగా నిలిచిన వాటర్ ట్యాంకు నిర్మాణం ఎందుకు నిలిచిపోయింది, ఎప్పుడు పూర్తవుతుందని ప్రశ్నించగా. గుత్తేదారు వారంలో పనులు ప్రారంభించి 2నెలల్లో పూర్తిచేస్తారని ఏఈ రాజేశ్ వివరణ ఇచ్చారు.

ఆస్తి, కుళాయి పన్నుపై రీసర్వే

నగర పంచాయతీ పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్నుపై రీసర్వే చేపడుతున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆస్తిపన్నుకు సంబంధించి పలుచోట్ల తేడాలున్నాయని దీనికోసం చేపడుతున్న సర్వేకు కౌన్సిలర్లు సహకరించాలన్నారు. ఆస్తిపన్ను వసూలు ముమ్మరం చేస్తామని తెలిపారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతానికి చర్యలు: పార్వతి

ఉంగుటూరు, జూలై 31: పౌరసరఫరాల శాఖద్వారా రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఉంగుటూరు ఎస్సీ కాలనీ, రామాలయం వీధిలో ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీలత, పీడీఎస్ ఉప తహసీల్దార్ ప్రధాన్‌తో కలిసి బుధవారం సాయంత్రం ఆమె సర్వే నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న రేషన్ పంపిణీ విధానం, పెరుగుతున్న ధరల గురించి ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ ప్రజాపంపిణీలో మరిన్ని నిత్యావసరాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రజలకు అందజేస్తున్న బియ్యంతోపాటు అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనపథకంలో వినియోగించే సరుకుల నాణ్యతను పరిశీలించి మరింత మెరుగైన నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామాల్లో సర్వే జరుపుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ, పీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు సినీ వినీలాకాశంలో హాస్య నక్షత్రం 'అల్లు'

విజయవాడ కల్చరల్, జూలై 31: తెలుగు సినీ వినీలాకాశంలో హాస్య నక్షత్రంగా చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి అల్లు రామలింగయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. అల్లు రామలింగయ్య 20వ వర్ధంతి బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు రామలింగయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, తెలుగు కళావాహిని సంస్థ అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, వివిధ పార్టీల నేతలు పోతుల బాలకోటయ్య, బాడిత శంకర్, అద్దూరి శ్రీరామ్, రుక్మిణి, శ్రీలక్ష్మి, కాకు మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు. శీరంశెట్టి నాగేంద్రరావు నిర్వహించారు. అలాగే వేముల చారిటీస్ చైర్మన్ హజరత్తయ్య గుప్తా ఆధ్వర్యంలో కళాక్షేత్రం ఆవరణలో అల్లు రామలింగయ్య వర్ధంతి నిర్వహించారు. నవనీతం సాంబశివరావు, దుట్ట మురళీకృష్ణ, సీహెచ్ రఘు, వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాస్, నారాయణరావు పాల్గొన్నారు.



పాడిరైతుకు మిక్చర్ దాణాను అందజేస్తున్న సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ

పాడి పరిశ్రమతో రైతులకు అధికలాభాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 31: పాడిపరిశ్రమ ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ అధికలాభాలు పొందవచ్చని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్ సూచించారు. మడిచర్ల రైతు సేవా కేంద్రం ఆవరణలోని బుధవారం డీఎల్‌డీఏ (డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డవలప్‌మెంట్ అసోసియేషన్) గన్నవరం ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. 85 పశువులకు గర్భకోశ వ్యాధులు, ఇతర పరీక్షలు నిర్వహించి మినరల్ మిక్చర్ దాణా, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ, పాల సొసైటీ అధ్యక్షురాలు అజ్మీరా నాగలక్ష్మి, పశువైద్యులు డాక్టర్ హరిత, డాక్టర్ అనామిక, డీఎల్‌డీఏ సిబ్బంది, పారావెట్స్, 1962 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

జగన్.. దమ్ముంటే అసెంబ్లీకి రా!

▸ గోబెల్స్ ప్రచారం చేస్తున్న పత్రికలపై చర్యలు తీసుకుంటాం: మంత్రి కొలుసు



అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): అబద్ధాలు ప్రచారం చేస్తున్న గోబెల్స్ పత్రికలపై చర్యలు తీసుకుంటామని, జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'జగన్ అసెంబ్లీకి రాకుండా అబద్ధపు పత్రిక, టీవీని పెట్టుకుని గోబెల్స్ ప్రచారం చేయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఎన్నికల హామీ ప్రకారం పెంచిన పింఛను ఇంటి వద్దకే అందించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే. క్రమం తప్పకుండా 1న పింఛన్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. చంద్రబాబు నాయకత్వంతో ఏదైనా సాధ్యమవుతుంది. గత ప్రభుత్వం చేతగానితనం వల్ల రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయింది. రాష్ట్రం ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడానికి అబద్ధాలు ప్రచారం చేస్తే మూల్యం చెల్లించుకుంటారు' అని హెచ్చరించారు.

సీఎంను కలసిన సింగపూర్, యుఎస్, యుఏఈ రాయబారులు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును పలు దేశాలకు చెందిన ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం సచివాలయానికి వచ్చిన ప్రముఖులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తొలుత చెన్నైలోని సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గార్ పాంగ్ చియాంగ్ కలిశారు. అనంతరం హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో, యుఏఈ రాయబారి అబ్దుల్‌నాసర్ జమాల్ అల్షాలీతో సీఎం భేటీ అయ్యారు. వీరికి ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు వివరించారు. ఆయా దేశాలతో మంచి సంబంధాలు కొనసాగుతాయని చెప్పారు. తమ యువతకు మంచి అవకాశాలు కల్పించాలని కోరారు.

అటవీ అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం అమరావతి సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలోని తన చాంబర్‌లో తొలిసారిగా అటవీశాఖ అధికారుల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్‌ను అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలిచ్చి ఘనంగా సత్కరించారు.

సలహాదారుకే తాత్కాలికంగా ఈఎన్‌సీ బాధ్యత

▸ వెంకటేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావుకే ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నియామక ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. జలవనరుల శాఖలో మేజర్ ఇరిగేషన్, కమిషనర్ ఆఫ్ టెండర్స్ ఈఎన్‌సీగానూ, కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీరుగానూ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సి.నారాయణరెడ్డి బుధవారం రిటైరయ్యారు. దీంతో ప్యానల్ చీఫ్ ఇంజనీర్ల పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం చీఫ్ ఇంజనీరుగా ఉన్న శ్రీనివాస్ కందికళ్లను ఇప్పటికే ఇంజనీర్ ఇన్ చీఫ్(పరిపాలన)గా నియమించారు. మరో ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు వెంకట నాగేంద్ర అంజి రత్నకుమార్ తోట, వెంకటాచార్యులు శ్రీనాథ్ కొలికందయ్‌ల పేర్లను ఈఎన్‌సీ నియామకానికి ప్రభుత్వం పరిశీలించింది. రెగ్యులర్ చీఫ్ ఇంజనీర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వీరిద్దరూ ఈఎన్‌సీ పోస్టుకు అర్హులేనని జల వనరుల శాఖ ఉన్నతాధికారులు అంగీకరిస్తున్నారు. అయితే ప్రాజెక్టులపైనా, రాష్ట్ర భౌగోళిక స్థితిగతులపైనా వీరికి పూర్తి స్థాయి అవగాహన లేదన్న అభిప్రాయం ప్రభుత్వానికి ఉంది. దీంతో కొద్దికాలం వేచి చూశాకే రెగ్యులర్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మేజర్ ఇరిగేషన్, కమిషనర్ ఆఫ్ టెండర్స్ ఈఎన్‌సీలుగా వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

సహకార సంఘాల్లో మెక్కిందంతా కక్కిస్తాం!

▸ రైతులకు ఒక్కరోజులోనే రుణం మంజూరుకు కృషి : మంత్రి అచ్చెన్న

అమరావతి(ఆంధ్రజ్యోతి), టెక్కలి, జూలై 31: రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాల పరిధిలో అవినీతి, అక్రమాలతో మెక్కిందంతా కక్కిస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తేల్చిచెప్పారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆప్కాబ్ అధికారులతో మంత్రి సమావేశమై చర్చించారు. రాష్ట్రంలో అనేకచోట్ల నకిలీ ధ్రువపత్రాలతో రుణాలు, రైతుల పేరుతో అదనపు రుణాలు, అధికారులే బినామీ పేర్లతో రుణాలు పొందిన అంశాలు తన దృష్టికి వచ్చాయని అచ్చెన్నాయుడు చెప్పారు. సహకార వ్యవస్థను ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రుణం కోసం రైతులు కాళ్లరిగేలా తిరిగే రోజులు పోవాలని, ఒక్క రోజులో వారికి రుణం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఆప్కాబ్, డీసీసీబీల నుంచి సహకార సంఘాల ద్వారా ఈ ఏడాది రూ.38.7వేల కోట్లు అందించేందుకు అంచనా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి ఉన్నారు.

ముంబైలో మంత్రి నారాయణ బృందం పర్యటన

▸ రోడ్ నెట్‌వర్క్, అభివృద్ధి ప్రాజెక్టులపై అధ్యయనం

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ బృందం మహారాష్ట్రలోని నవీ ముంబైలో పర్యటించింది. బృందంలో ఏపీసీఆర్‌డీఏ(ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) అధికారులు కూడా ఉన్నారు. నవీ ముంబై నగర ప్రణాళికలు, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సిడ్కో(సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులతో ఈ బృందం సమావేశమై చర్చించింది. అక్కడ అమలు చేస్తున్న గృహనిర్మాణ పథకాలు, ఆర్థిక, అభివృద్ధి ప్రణాళికలను సిడ్కో అధికారులు వివరించారు. నవీ ముంబై అభివృద్ధిపై సిడ్కో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవీ ముంబైలో రోడ్ నెట్‌వర్క్, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల గురించి బృందం అధ్యయనం చేసింది. నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ప్రభావిత నోటిఫైడ్ ఏరియాలోనూ ఈ బృందం పర్యటించింది. మంత్రి వెంట సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అదనపు కమిషనర్లు నవీన్, సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఉన్నారు.

ఏపీలోని రైల్వే సమస్యలను పరిష్కరించండి

▸ లోక్‌సభలో టీడీపీ ఎంపీ అప్పలనాయుడు

న్యూఢిల్లీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి విజయనగరం ఎంపీ అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. బుధవారం, లోక్‌సభలో ఆయన మాట్లాడారు. 'విశాఖపట్నం అభివృద్ధి చెందుతోంది. అందువల్ల కొత్త మెట్రోరైల్ ప్రాజెక్టును మంజూరు చేయాలి. రైల్వే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేందుకు కొత్త జనరల్ కోచ్‌లను ఏర్పాటు చేయాలి' అని ఎంపీ అప్పలనాయుడు కోరారు.

సెప్టెంబరు నుంచి పశుగణన

▸ పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి వెల్లడి

విశాఖపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు వరకు పశుగణన ప్రారంభమవుతుందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్ తెలిపారు. బుధవారం విశాఖలోని ఓ హోటల్‌లో పశుగణనపై నిర్వహించిన ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఐదేళ్లకొకసారి పశుగణన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొత్తం 16 రకాల జంతువుల వివరాలను ఇంటింటికీ వెళ్లి సేకరించాలని సూచించారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, జడల బర్రెలు, నాటు పందులు, సీమపందులు, పౌల్ట్రీ కోళ్లు, నాటు కోళ్లు, టర్కీ కోళ్లు, కుక్కలు తదితర జంతువుల వివరాలు నమోదు చేస్తామన్నారు. దీనికి ప్రత్యేకించి ఓ యాప్‌ను రూపొందించామన్నారు. కోళ్ల ఉత్పత్తిలో ఏపీ దేశంలో రెండో స్థానంలో, మేకలు/గొర్రెల ఉత్పత్తిలో నాలుగు, పాల ఉత్పత్తిలో ఐదో స్థానంలో ఉందన్నారు.


చిన్న బ్యాంకులకు టెక్నాలజీ అందించే సి-ఎడ్జ్ టెక్నాలజీస్‌పై ర్యాన్సమ్‌వేర్ దాడి

▸ స్తంభించిన పలు సహకార బ్యాంకుల కార్యకలాపాలు

న్యూఢిల్లీ, జూలై 31: దేశంలోని పలు చిన్న, సహకార బ్యాంకులకు బ్యాంకింగ్ టెక్నాలజీ అందించే 'సి-ఎడ్జ్ టెక్నాలజీస్' అనే సర్వీస్‌ప్రొవైడర్‌పై హ్యాకర్లు దాడిచేశారు. ఆ సంస్థ సర్వర్లను హ్యాక్ చేసి తాము అడిగిన మొత్తం చెల్లించాలని డిమాండ్‌చేశారు. దీంతో దేశవ్యాప్తంగా 300 చిన్న బ్యాంకుల్లో కార్యకలాపాలు మూడు, నాలుగు రోజులుగా నిలిచిపోయాయి. ఆయా బ్యాంకుల వినియోగదారులు ఏటీఎంల నుంచి డబ్బు తీసుకోలేకపోతున్నారు. యూపీఐ చెల్లింపులు జరపలేకపోతున్నారు. ఈ దాడితో అప్రమత్తమైన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. సీ-ఎడ్జ్ టెక్నాలజీస్ సంస్థకు రీటైల్ పేమెంట్ సిస్టమ్స్ యాక్సెస్‌ను నిలిపివేసింది. ఆ సంస్థ కార్యకలాపాల పునరుద్ధరణకు అధికారులు యుద్ధప్రాతిపదికన కృషిచేస్తున్నారు. గురువారం ఉదయానికల్లా పరిస్థితి చక్కబడుతుందని అంచనా వేస్తున్నారు.

చిక్కుల్లోనే విశాఖ ఉక్కు!

▸ కేంద్ర మంత్రి వచ్చి వెళ్లినా అదే పరిస్థితి
▸ మరింత తీవ్రమైన ముడిపదార్థాల కొరత
▸ ఒక్క రోజుకే సరిపోయే కోకింగ్ కోల్ నిల్వ
▸ పూర్తిగా అడుగంటిన ఇతర సరుకు నిల్వలు
▸ కార్మికులకు 1న జీతాలు ఇవ్వలేని దుస్థితి
▸ సాయంపై స్పందించని కేంద్ర ప్రభుత్వం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. సంస్థను ప్రైవేటీకరణ చేయబోమని ఎన్‌డీఏ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారే తప్ప ఎటువంటి సాయం చేస్తారనే విషయం వెల్లడించడం లేదు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఈ ప్లాంటును సందర్శించి 20 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకూ ఎటువంటి కదలిక లేదు. ప్రస్తుతం స్టీల్ ప్లాంటు ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాలకు తీవ్రమైన కొరత ఏర్పడింది. జిందాల్ నుంచి రూ.800 కోట్లు, టాటా, సెయిల్ నుంచి రూ.900 కోట్లు, స్థానిక ట్రేడర్ల నుంచి రూ.1,300 కోట్లు తీసుకున్న యాజమాన్యం వాటిని పప్పుబెల్లాల్లా వాడేసింది. గత నెలలో రూ.1,590 కోట్ల స్టీల్‌ను విక్రయించారు. వీటిద్వారా రూ.1,300 కోట్లు మాత్రమే వచ్చింది. మిగిలినవి పాత బకాయిల కింద జమ అయిపోయాయి. ప్రస్తుతం ప్లాంటులో ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాలు అడుగంటాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కోకింగ్ కోల్ 10వేల టన్నులు మాత్రమే ఉంది. అదీ ఒక్కరోజుకే సరిపోతుంది. బాయిలర్ కోల్ రెండో రోజులకు, పీసీఐ కోల్, హార్డ్ అండ్ సాఫ్ట్ కోల్ నిల్వలు బాగా తగ్గిపోయాయి. బ్లాస్ట్ ఫర్నేసులకు అవసరమైన డోలమైట్ నాలుగు రోజులకు, సైజ్డ్ ఓర్ ఐదు రోజులకు సరిపడా మాత్రమే ఉండగా, ఐరన్ ఓర్ లంప్స్ పూర్తిగా అయిపోయాయి. ఉక్కు శాఖ మంత్రి వచ్చి వెళ్లిన తరువాత ఉత్పత్తి మరింత తగ్గిపోయింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్‌ఎండీసీ ఐరన్ ఓర్‌ను తగినంత సరఫరా చేయకుండా ప్రైవేటు కంపెనీలకు విక్రయిస్తోంది. మంత్రి కనీసం ఆ మాత్రం మాట సాయం కూడా చేయలేకపోయారనే విమర్శలొస్తున్నాయి.

వాయిదా పద్ధతిలో జీతాలు

స్టీల్‌ప్లాంటులో గత ఆరు నెలలుగా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. వాయిదాల పద్ధతిలో ఇస్తున్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తి చేస్తే దానివల్ల వచ్చే వృథా వాయువులు, ఉష్ణోగ్రతల ద్వారా 450 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. తిరిగి గ్రిడ్‌కు ఇచ్చే పరిస్థితి ఉంటుంది. ఉత్పత్తి లేకపోవడం వల్ల ఇప్పుడు నెలకు విద్యుత్ బిల్లుకే రూ.93 కోట్లు కట్టాల్సి వస్తోంది. పూర్తి ఉత్పత్తి చేస్తే విద్యుత్ బిల్లు మొత్తంతో ఉద్యోగులు, కార్మికులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వవచ్చు.

అడిగిందేదీ ఇవ్వడం లేదు

▸ ముంబైలో బ్యాంకర్లతో సమావేశమైన రుణం కోరినప్పుడు అంతా నిరాకరించారు. కేంద్రం 'లెటర్ ఆఫ్ కంఫర్ట్' ఇస్తే తాము అప్పులు ఇస్తామని తేల్చిచెప్పారు. ఇదే విషయం ప్రభుత్వ పెద్దలకు చెబితే ఆర్థికశాఖ నుంచి ఆ లెటర్ ఇప్పిస్తామన్నారు. ఇంత వరకూ రాలేదు.

▸ ప్రిఫరెన్షియల్ షేర్ల కింద రూ.3,100 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. అది కూడా చేయలేదు.

▸ ఎన్‌ఎండీసీ నుంచి రూ.1,500 కోట్ల ఆర్థిక సాయం చేయిస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో స్టీల్‌ప్లాంటుకు చెందిన 1,067 ఎకరాల భూమిని లీజుకు ఇవ్వడం ద్వారా ఆ మొత్తం సమకూరుస్తామన్నారు. దానిని కూడా ప్రాసెస్ చేయలేదు.

▸ ఇప్పటివరకూ స్టీల్ ప్లాంటు రూ.54,380 కోట్లు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించింది. ప్రస్తుతం పరిస్థితి బాగాలేనందున మూడేళ్లు ట్యాక్స్ హాలీడే ఇవ్వాలని కోరారు. దీనిపైనా స్పందన లేదు.

▸ స్టీల్‌ప్లాంటు భూములన్నీ రాష్ట్రపతి పేరుపై ఉన్నాయి. వాటిని ప్లాంటు పేరిట రిజిస్టర్ చేస్తే బ్యాంకులు రుణాలు ఇస్తామని చెప్పాయి. ఈ మేరకు 10,200 ఎకరాలు రిజిస్టర్ చేయాలని సీఎండీ ప్రతిపాదన పంపారు. దానినీ పక్కన పెట్టేశారు.


అన్నీ ఉన్నాయి.. ముడిసరుకే లేదు

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో మెషినరీ ఉంది. కార్మికులు ఉన్నారు. మార్కెటింగ్ వ్యవస్థ ఉంది. కానీ ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముడిపదార్థాలే లేవు. వాటిని సమకూరిస్తే పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేసి, నష్టాలు నివారిస్తాం.

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పరిరక్షణ కమిటీ

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగించండి

▸ హైకోర్టులో ఏవీ రమణ దీక్షితులు పిటిషన్



అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఏవీ రమణదీక్షితులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యం పై విచారణ జరిపిన న్యాయస్థానం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవోకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఈ ఏడాది మార్చి 2న అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఏవీ రమణదీక్షితులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌కు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా టీటీడీ ఈవో అప్పట్లో వ్యవహరించారు. ఈవో ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి రమణదీక్షితులు ప్రధాన అర్చకుడిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలి" అని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

అన్నదాతకు అండగా ఉంటాం

▸ గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడి

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలో వెంగళరాయ సాగర్ (వీఆర్‌ఎస్) ప్రాజెక్టు నుంచి బుధవారం సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకూ సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీఆర్‌ఎస్ ప్రాజెక్టు ద్వారా 24,700 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబీనాయన, బోనెల విజయచంద్ర, ఇరిగేషన్ శాఖాధికారులు పాల్గొన్నారు.



వీఆర్‌ఎస్ నుంచి సాగునీరు విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు బేబీనాయన, విజయచంద్ర



సీపీఐ నాయకులు నారాయణ, రామకృష్ణ తదితరులతో భేటీ అయిన సీఎం చంద్రబాబు

వైసీపీ భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ చేయాలి

▸ బాబును కలసిన నారాయణ, రామకృష్ణ బృందం

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనంపై సమగ్ర విచారణ చేయాలని సీఎం చంద్రబాబును సీపీఐ నేతలు కోరారు. అమరావతి సచివాలయంలో చంద్రబాబుని, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, జల్లి విల్సన్, ఓబులేసు తదితరులు కలిశారు. పలు అంశాలపై సీఎంకు వినతి పత్రం అందించారు. 'ఒక్క కడప జిల్లాలోనే వేలాది ఎకరాల కబ్జాకు గురయ్యాయి. మూడు రాజధానుల పేరుతో విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం జిల్లాల్లో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం చేశారు. పేద, సామాన్య మధ్యతరగతి వర్గాల ప్రజలను బెదిరించి గత పాలకులు భూములు కాజేశారు. భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి. భూ కుంభకోణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అమరావతి, పోలవరం నిర్మాణం, విద్యుత్, ఆర్టీసీ చార్జీల భారాలు, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడినందుకు సీపీఐ నేతలు, అనుబంధ సంఘాల నేతలపై గత ప్రభుత్వం కేసులు బనాయించింది. వాటిని ఎత్తివేయాలి. అని వారు కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు, నారాయణ.. కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. నాడు చేసిన పోరాటాలు, విద్యార్థి రాజకీయాలను నెమరు వేసుకొని కాసేపు ఉల్లాసంగా గడిపారు.

చిన్నారిపై హత్యాచారం కేసులో దోషికి ఉరి శిక్ష ఖరారు

▸ తెలంగాణ హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఓ వలస కూలీ కుటుంబానికి చెందిన ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి చేసి, చంపేసిన వ్యక్తికి తెలంగాణ హైకోర్టు ఉరి శిక్షను ఖరారు చేసింది. జస్టిస్ పీ శ్యాంకోషీ, జస్టిస్ సాంబశివరావు నాయుడు ధర్మాసనం బుధవారం తుది తీర్పు వెలువరించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన దినేశ్ కుమార్ ధర్నె (25) నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్ ప్రాజెక్టు నిర్మాణంలో పనిచేస్తుండేవాడు. ఒడిశాకు చెందిన వలస కూలీ దంపతులు కూడా అక్కడే లేబర్ క్యాంప్‌లో ఉండేవారు. దినేశ్‌కుమార్ 2017 డిసెంబరు 12న ఆ దంపతుల ఐదేళ్ల కుమార్తెను చాక్లెట్ కొనిస్తానని తీసుకెళ్లాడు. కానీ మళ్లీ తీసుకురాలేదు. అతడిని బాలిక తల్లిదండ్రులు నిలదీయగా చాక్లెట్ కొనిపెట్టి ఇంటి వద్దే వదిలేశానని బుకాయించాడు. తర్వాత అతను పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించడంతో పాటు నార్సింగిలోని ఓ ఆస్పత్రి వద్ద పొదల్లో బాలిక మృతదేహాన్ని పడేసినట్లు చెప్పాడు. బాలిక మృతదేహం నుంచి తీసిన శాంపిల్స్‌కు నిందితుడి డీఎన్‌ఏకు సరిపోలడంతో పాటు బలమైన సాక్ష్యాలు ఉండటంతో రంగారెడ్డి జిల్లా ఎంఎస్‌జే కోర్టు జడ్జి బీ సురేశ్‌బాబు ఉరి శిక్ష విధించా రు. కాగా, నిందితుడి అప్పీల్‌తో పాటు ఉరి శిక్ష ధ్రువీకరణ పిటిషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించిన ధర్మాసనం.. దినేశ్‌కుమార్‌కు ఎంఎస్‌జే కోర్టు విధించిన ఉరి శిక్షను ఖరారు చేసింది.

కుప్పంలో సీను రివర్స్

▸ హోటల్ అమరావతిగా మారుతున్న వైసీపీ అద్దె కార్యాలయం



అధికారం కోల్పోయాక ఖాళీగా కనిపిస్తున్న వైసీపీ కార్యాలయ అద్దె భవనం



గేటుకు హోటల్ అమరావతి పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు

కుప్పం, జూలై 31: కుప్పంలో సీను మారుతోంది. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు వెల్లువలా సాగుతున్నాయి. అందుకు సాక్ష్యం అన్నట్టుగా ఒకప్పుడు నీలి, పచ్చ రంగుల్లో, కార్యకర్తలతో కళకళలాడిన కుప్పం బైపాస్ రోడ్డులోని వైసీపీ కార్యాలయం.. హోటల్ అమరావతిగా కొత్తరూపం పోసుకుంటోంది. ఎన్నికల తర్వాత కార్యాలయం ఖాళీ అయిపోవడంతో భవన యజమాని ఉన్న భవనాలు కూల్చేసి హోటల్‌గా మార్చేస్తున్నారు. త్వరలో హోటల్ అమరావతి ప్రారంభం అంటూ ఫ్లెక్సీలు సైతం వేలాడదీశారు. ఆ దారిన వెళ్లేవారు మాత్రం ఈ మార్పు చూసి.. ఔరా.. ఎంతలో ఎంత మార్పు అని నిట్టూరుస్తున్నారు.

దక్షిణాదిలో వరదలు.. ఉత్తరాదిలో వర్షాభావం

▸ తొలి 2 నెలల్లో అసాధారణ పరిస్థితులు
▸ ఏపీలో సాధారణం కంటే 34 శాతం అధిక వర్షపాతం

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి రెండు నెలలు దేశంలో అసాధారణ పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దక్షిణ, పశ్చిమ భారతంలో కుంభవృష్టి వర్షాలు కురవగా.. ఉత్తరాదిలో ప్రధానంగా వాయవ్య, తూర్పు భారతంలో అనేక ప్రాంతాలు తీవ్ర దుర్భిక్షంలో ఉన్నాయి. మొత్తమ్మీద దేశవ్యాప్తంగా సాధారణం కంటే రెండు శాతం అధిక వర్షపాతం నమోదవగా.. ఆంధ్రప్రదేశ్‌లో 34 శాతం ఎక్కువ వానలు కురిశాయి. జూన్‌లో ఈశాన్య భారతంలో అసోం, మేఘాలయ, ఉత్తరాదిలో ఉత్తరాఖండ్‌లో వరదలు సంభవించాయి. జూలైలో ముంబై, ఏపీలో గోదావరి పరీవాహక ప్రాంతం, కేరళ వరదలతో ఉక్కిరిబిక్కిరయ్యాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభానికి ముందే పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు హిందూ మహాసముద్రంలో అనుకూల పరిస్థితులు ఏర్పడడంతో సీజన్‌లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ మే 27న ప్రకటించింది. అయితే వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వర్షాల్లో సమతుల్యత దెబ్బతింది. దేశవ్యాప్తంగా ఉన్న 36 వాతావరణ సబ్ డివిజన్లలో.. 11 సబ్ డివిజన్లలో వర్షాభావం నెలకొంది. జమ్ము కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. దేశంలో జూన్ 1 నుంచి జూలై 31 వరకు 445.8మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 453.8 మి.మీ. (సాధారణం కంటే 2శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. అయితే కొన్ని చోట్ల కుంభవృష్టి, మరికొన్నిచోట్ల ఒక మోస్తరు, ఇంకొన్ని చోట్ల అతితక్కువ వర్షాలు కురిశాయి. ఢిల్లీలో జూన్ 27న 228.1మి.మీ. కురవడంతో 88ఏళ్ల రికార్డును అధిగమించినట్టయింది. ముంబైలో 1991 తర్వాత జూన్‌లో 1037.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. 1898 నుంచి పరిశీలిస్తే కేరళలో జూన్‌లో అత్యధికంగా 761.2 మి.మీ. నమోదైంది. దేశంలోని 742 జిల్లాల్లో 267 జిల్లాల్లో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

ఏపీలో విస్తారంగా వర్షాలు

ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి సీజన్ మొదటి రెండు నెలల్లో మంచి వర్షాలే కురిశాయి. కొద్ది ప్రాంతాలు తప్ప ఎక్కువ మండలాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి జూలై 31 వరకు రెండు నెలల్లో ఏపీలో 225.2 మి.మీ.కుగాను 301.4 మి.మీ. (సాధారణం కంటే 34 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. కోస్తాలో 268.1 మి.మీ.కుగాను 362 మి.మీ. (35శాతం ఎక్కువ), రాయలసీమలో 164.4 మి.మీ.కు 231.1 మి.మీ. (41% ఎక్కువ) నమోదైంది. సాధారణం కంటే పశ్చిమ గోదావరి జిల్లాలో 82 శాతం, అనకాపల్లిలో 77 శాతం, సత్యసాయి జిల్లాలో 67 శాతం, ఏలూరులో 64 శాతం, నంద్యాల, నెల్లూరు జిల్లాల్లో 62 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఒక్క ప్రకాశం జిల్లాలో మాత్రం సాధారణం కంటే ఐదు శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. గతేడాది జూన్, జూలై నెలల్లో సాధారణం కంటే 5 శాతం తక్కువ వర్షపాతం కురిసింది. మొత్తం 670 మండలాలకుగాను 240 మండలాల్లో వర్షాభావం నెలకొనడంతో గతేడాది కరవు పరిస్థితులు కొనసాగాయి.

హత్యాచారాన్ని ఆత్మహత్యగా చూపారు!

▸ టీడీపీ కార్యాలయంలో యువతి బంధువుల ఫిర్యాదు
▸ మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి బంధువులపై ఆరోపణ
▸ విచారణకు మంత్రి పార్థసారథి హామీ

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి బంధువులు బీసీ వర్గాలకు చెందిన ఒక యువతిపై అత్యాచారం చేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆమె బంధువులు ఆరోపించారు. బుధవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథిని, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మిని వారు, టీడీపీ నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లా వేణుగోపాలపురం మండలం పెనమలూరు గ్రామంలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని గత ఏడాది సెప్టెంబరు 29వ తేదీన నారాయణస్వామి బంధువులు బంధించి అత్యాచారం చేసి అతి దారుణంగా చంపి తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించి తప్పుదారి పట్టించారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లెపు మునుస్వామి ఆరోపించారు. ఆ యువతికి జరిగిన అన్యాయంపై విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. విచారణ చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భూ సమస్యలు, పింఛను, నిరుద్యోగ సమస్యలు, అక్రమ కేసులు, పెండింగ్ బిల్లులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కూడా వినతి పత్రాలు సమర్పించారు.

చంపి శవాన్ని కాలువలో పడేస్తామన్నారు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో బెదిరించి తన భూమి లాక్కున్నారని పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర మండ లం వెలగలేరుకు చెందిన కొవ్వూరి భాస్కరరెడ్డి ఫిర్యాదు చేశారు. మళ్లీ వైసీపీ గెలిస్తే నడిరోడ్డుపై చంపి శవాన్ని కాలువలో పడేస్తామని తనను బెదిరించారని, ప్రభుత్వం మారడంతో ఇప్పుడు బయటకు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయగలుగుతున్నామని ఆయన చెప్పారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలానికి చెందిన పార్వతి అనే మహిళ పొట్టకూటి కోసం 2013లో దుబాయ్ వెళ్లిందని, ఇంతవరకూ ఆమె జాడ లేదని.. ఆచూకీ కనుక్కుని ఇంటికి రప్పించాలని ఆమె బంధువు కోటేసు విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్ కేసు.. వీఐపీలతో లింకులు..!

▸ రకుల్ తమ్ముడికి, పాజిటివ్ వచ్చిన మరో 9 మందికి వీఐపీలతో పరిచయాలు

హైదరాబాద్ సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) పోలీసులు ఇటీవల ఛేదించిన నైజీరియా డ్రగ్స్ ముఠా కేసులో.. తవ్వినకొద్దీ విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల ఇద్దరు నైజీరియన్లు సహా.. ఐదుగురు డ్రగ్స్ పెడ్లర్లను అరెస్టు పోలీసులు.. వారి నుంచి రూ.35లక్షల విలువ చేసే 199 గ్రాముల కొకైన్‌ను సీజ్ చేసిన విషయం తెలిసిందే.! ఈ ముఠాను పట్టుకునే సమయంలో సినీనటి రకుల్ ప్రీత్‌సింగ్ అమన్ ప్రీత్‌సింగ్, మరో 12 మంది డ్రగ్స్ వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించగా.. అమన్ సహా.. 10 మందికి పాజిటివ్ ఫలితం వచ్చింది. తదుపరి దర్యాప్తులో భాగంగా పెడ్లర్లు అల్లం సత్యవెంకట గౌతమ్, సానబోయిన వరుణ్ కుమార్, మహమ్మద్ మహబూబ్ షరీఫ్, వినియోగదారులు-- రకుల్ సోదరుడు, మరో తొమ్మిది మంది మొబైల్ ఫోన్ కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌పై టీజీ న్యాబ్ పోలీసులు దృష్టి సారించారు. వీటిని విశ్లేషించిన పోలీసులు.. వీరికి వీఐపీలు, సినీ ఇండస్ట్రీకి చెందినవారు, బడా వ్యాపారుల పిల్లలతో లింకులున్నట్లు గుర్తించారు. గౌతమ్, వరుణ్‌కుమార్‌కు ఏపీలో కస్టమర్లు ఉన్నట్లు నిర్ధారించారు.

షుగర్ చిదిమేసింది!

▸ సకాలంలో గుర్తించక 12 ఏళ్ల బాలిక మృతి



కొండపి, జూలై 31: మధుమేహం మహమ్మారి 12 ఏళ్ల బాలికను చిదిమేసింది. షుగర్ వ్యాధి బారిన పడిన విషయాన్ని సకాలంలో గుర్తించకపోవడంతో ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ప్రకాశం జిల్లా కొండపి మండలంలోని తాటాకులపాలెంలో ఈ విషాదం చోటుచేసుకుంది. తాటాకులపాలెం గ్రామానికి చెందిన కదిరి శ్రీనివాసరెడ్డి, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ అక్కడే ఉండి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన పెద్ద కుమార్తె కదిరి మోక్ష (12) హైదరాబాద్‌లోనే 8వ తరగతి చదువుతోంది. ఆమె పదేపదే నీరసం అని అంటుండటంతో ఇటీవల హైదరాబాద్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు షుగర్ ఉన్నట్లు గుర్తించలేకపోయారు. నీరసం తగ్గడానికి మందులిచ్చి పంపారు. అయినప్పటికీ బాలిక ఆరోగ్యం కుదుటపడకపోడంతో తల్లిదండ్రులు మోక్షను తీసుకుని గత ఆదివారం స్వగ్రామానికి వచ్చారు. సోమవారం మోక్ష మరింత నీరసించడంతో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమెకు షుగర్ పరీక్ష చేయగా 700 పాయింట్లు ఉన్నట్లు తేలింది. వెంటనే తల్లితండ్రులు ఆమెను నగరంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. మంగళవారం సాయంత్రం షుగర్ అధికమై బ్రెయిన్‌డెడ్ కావడంతో చిన్నారి మోక్ష మరణించింది.

బియ్యం స్మగ్లింగ్ ఫుడ్ కమిషన్‌కు కనిపించలేదా?

▸ వైసీపీ కోసం తప్ప ప్రజల కోసం పనిచేయలేదు: నీలాయపాలెం ధ్వజం

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగిన రేషన్ బియ్యం స్మగ్లింగ్ చట్టబద్ధంగా ఏర్పాటైన ఆహార కమిషన్‌కు కనిపించలేదా? అని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ బుధవారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'కమిషన్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత గత రెండున్నరేళ్లలో ఒక్క కేసు కూడా ఈ స్మగ్లింగ్ మీద పెట్టలేదు. వైసీపీ కోసం పనిచేయడం తప్ప ప్రజల కోసం కమిషన్ ఛైర్మన్, సభ్యులు పనిచేయలేదు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం ఆహార కమిషన్‌కూ అదే గతి పట్టించింది. ఆహార కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప రెడ్డికి నెలకు రూ.ఐదున్నర లక్షల వేతనం. సభ్యులు జక్కంపూడి కిరణ్, కాంతారావు, లక్ష్మారెడ్డి తదితరులకు నెలకు ఒక్కొక్కరికి రూ.నాలుగున్నర లక్షలు. ఇంతింత జీతాలు తీసుకొంటూ గత రెండున్నర సంవత్సరాల్లో ఒక్కరి మీద కూడా చిన్న కేసైనా పెట్టలేదు. బయట తిరిగినట్లు వీడియోలు తీసి ఛైర్మన్ యూట్యూబ్‌లో పెట్టుకొంటున్నారు. కమిషన్ సమావేశం నిర్వహించి ఆరు నెలలైంది. ఛైర్మన్‌కు, సభ్యులకు హైకోర్టు న్యాయమూర్తికి ఉన్న అధికారాలు ఉంటాయి. ఆ అధికారాలను ఉపయోగించింది మాత్రం శూన్యం. కాకినాడ కేంద్రంగా వేల టన్నుల రేషన్ బియ్యాన్ని విదేశాలకు స్మగ్లింగ్ చేశారు. కూటమి ప్రభుత్వంలోని మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ స్మగ్లింగ్‌ను పట్టుకొన్నారు. ఇదే పనిని ఆహార కమిషన్ ఎందుకు చేయలేకపోయింది? వైసీపీ ప్రభుత్వం ఉండగా బియ్యం అక్రమ నిల్వలు ఎందుకు బయటపడలేదు?' అని నీలాయపాలెం ప్రశ్నించారు. ఇంతింత జీతాలు తీసుకొంటూ పార్టీ పని చేసుకొంటున్న ఆహార కమిషన్ ఛైర్మన్, సభ్యుల పనితీరుపై ప్రభుత్వం విచారణ జరపాలని, కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని నీలాయపాలెం డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 1 ఆగస్టు 2024

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఎన్ఐఏ-జైపూర్)- ఎమ్మెస్సీ(ఇంటర్ డిసిప్లినరీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్ర్కీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదలో ఎమ్మెస్సీ



స్పెషలైజేషన్‌లు-సీట్లు: పోషణాహార(ఆయుర్వేద డైట్ అండ్ న్యూట్రిషన్) 3, ఆయుర్వేద మాన్యుస్క్రిప్టాలజీ 4, ఆయుర్-యోగ ప్రివెంటివ్ కార్డియాలజీ 2, మర్మ చికిత్స-క్రీడ భేషజ్(మర్మాలజీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్) 1, సౌందర్య ఆయుర్వేద(ఆయుర్వేదిక్ కాస్మొటాలజీ) 1, వృక్షాయుర్వేద 1 చొప్పున మొత్తం 12 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/ బీయూఎంఎస్/బీఎన్‌వైఎస్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు అన్ని స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేసుకోవచ్చు. పోషకాహార స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(డైటెటిక్స్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్)/ఎమ్మెస్సీ(డైటెటిక్స్) పూర్తిచేసినవారు; ఆయుర్వేద మాన్యుస్క్రిప్టాలజీకి ఎంఏ(సంస్కృతం) ఉత్తీర్ణులు; మర్మ చికిత్స-క్రీడ భేషజ్‌కు బీఎస్ఎంఎస్/బీఎస్సీ స్పోర్ట్స్ మెడిసిన్/బీపీటీ పూర్తిచేసినవారు; సౌందర్య ఆయుర్వేద స్పెషలైజేషన్‌కు బీఎస్సీ స్కిన్ కేర్ అండ్ ఈస్థటిక్ మెడిసిన్ ఉత్తీర్ణులు; వృక్షాయుర్వేదకు బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/ఫారెస్ట్రీ)అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుర్-యోగ ప్రివెంటివ్ కార్డియాలజీకి కంపల్సరీ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.

స్ర్కీనింగ్ టెస్ట్: ఇందులో 50 శాతం ప్రశ్నలను సంబంధిత సబ్జెక్ట్ నుంచి ఇస్తారు. మిగిలిన ప్రశ్నలను జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ నాలెడ్జ్ నుంచి అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి ఏడాది రూ.37650 (రూ.8000లు రిఫండబుల్); రెండో ఏడాది రూ.26650
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 11
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 13
- **ఇంటర్వ్యూలు:** ఆగస్టు 16
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 20
- **అడ్మిషన్ విండో ఓపెన్:** ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 5 వరకు
- **సెషన్ ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, జొరావర్ సింగ్ గేట్, అమీర్ రోడ్, జైపూర్-302002.
- **వెబ్‌సైట్:** www.nia.nic.in

ఎన్ఐపీహెచ్ఎంలో ఆన్‌లైన్ కోర్సులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి మూడు నెలలు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కోర్సుకు సంబంధించిన రీడింగ్ మెటీరియల్ అందిస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

ప్లాంట్ బయోసెక్యూరిటీ: ఈ కోర్సులో ప్లాంట్ బయో సెక్యూరిటీ, ప్లాంట్ క్వారంటైన్ సిస్టం, ఇంటర్నేషనల్ అండ్ నేషనల్ రెగ్యులేషన్స్, ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రొసీజర్స్-ప్లాంట్స్ అండ్ ప్లాంట్ ప్రొడక్ట్స్, ఫైటో శానిటరీ ట్రీట్‌మెంట్, హార్మొనైజేషన్ ఆఫ్ ఫైటో శానిటరీ మెజర్స్ తదితర అంశాలు వివరిస్తారు. కోర్సు మొత్తమ్మీద 24 లెక్చర్స్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు కనీసం 20 ఏళ్లు నిండి ఉండాలి.

రోడెంట్స్ అండ్ హౌస్‌హోల్డ్ పెస్ట్ మేనేజ్‌మెంట్: ఈ కోర్సులో మూడు మాడ్యూల్స్ ఉంటాయి. మాడ్యూల్‌కు ఏడు చొప్పున మొత్తం 21 చాప్టర్స్ ఉంటాయి. కోర్సులో భాగంగా బయాలజీ అంశాలు; ఎలుకలు, దోమలు, ఈగలు, బొద్దింకలు, నల్లులు, చెదలు, కలుపు మొక్కల నివారణ పద్ధతులు వివరిస్తారు. వీడియో ప్రజంటేషన్స్ కూడా ఉంటాయి.

అర్హత: సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూప్‌తోనైనా ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు ఏదేని పెస్ట్ కంట్రోల్ సంస్థలో పనిచేసిన అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



- **కోర్సు ఫీజు:** రూ.2500.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 12
- **కోర్సు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **కోర్సు సంబంధిత ఆన్‌లైన్ సెషన్స్:** సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30 వరకు
- **వెబ్‌సైట్:** niphm.gov.in

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఏఎంపీబీఏ



ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)- అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్(ఏఎంపీబీఏ)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా మేనేజ్‌మెంట్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అప్లికేషన్స్ అంశాలకు సంబంధించి థియరీ సెషన్స్, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటాయి. ఫౌండేషనల్ ప్రాజెక్ట్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది హైబ్రిడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఇంజనీరింగ్, టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్, సైన్స్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్, ప్రోగ్రామింగ్ అంశాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. అడ్మిషన్ నాటికి కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 22
- **తరగతులు ప్రారంభం:** 2025 ఫిబ్రవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** isb.edu

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్‌ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంట్రప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **ఎక్స్‌ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in

జాబ్ కార్నర్

బీబీనగర్ ఎయిమ్స్‌లో ఫ్యాకల్టీ

పోస్టులు: 68

బీబీనగర్(తెలంగాణ)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)...కింద పేర్కొన్న విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ప్రొఫెసర్: **24 పోస్టులు**
2. అడిషనల్ ప్రొఫెసర్: **6 పోస్టులు**
3. అసోసియేట్ ప్రొఫెసర్: **16 పోస్టులు**
4. అసిస్టెంట్ ప్రొఫెసర్: **22 పోస్టులు**

విభాగాలు: అనస్తీషియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఎండ్రోక్రినాలజీ అండ్ మెటబాలిజం, రేడియో - డయాగ్నోసిస్.


అర్హత: సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,48,200, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,38,300, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.

వయోపరిమితి: ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏళ్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: దరఖాస్తులను రిక్రూట్‌మెంట్ సెల్, ఎయిమ్స్ బీబీనగర్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్(హెచ్ఎంఆర్), తెలంగాణ చిరునామాకు పంపాలి.



ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబరు 3

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 19

వెబ్‌సైట్: aiimsbibinagar.edu.in/

'సమీర్'లో ఉద్యోగాలు

పోస్టులు: 101

ముంబయిలోని సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్: **4 పోస్టులు**
2. రీసెర్చ్ సైంటిస్ట్: **34**
3. ప్రాజెక్ట్ అసిస్టెంట్: **29**
4. ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఎ/బి)- **34**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్/ఐటీ, ఫిజిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.39,200; రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.30,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.17,000; ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఎ)కు రూ.15,100; ప్రాజెక్ట్ టెక్నీషియన్(బి)కి రూ.19,100.

వయోపరిమితి: సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఎ)కు 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ టెస్ట్(సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్, రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టులకు): ఆగస్టు 17

ఇంటర్వ్యూలు: ఆగస్టు 21, 22, 23

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 12

వెబ్‌సైట్: https://sameer.gov.in/

ఎన్ఐబీలో జూనియర్ సైంటిస్టులు

నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 6

- సైంటిస్ట్ గ్రేడ్-1: **1 పోస్టు**
- సైంటిస్ట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
- జూనియర్ సైంటిస్ట్: **2 పోస్టులు**
- అసిస్టెంట్ -2: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, మెడికల్ పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థుల విద్యార్హత, రాత పరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 23

వెబ్‌సైట్: https://www.nib.gov.in/

ఐఓసీఎల్‌లో జూనియర్ ఇంజనీర్లు

పోస్టులు: 443

ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు

1. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్-4: **256 పోస్టులు**
2. జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్-4/జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్-4: **99 పోస్టులు**
3. జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్-4: **21 పోస్టులు**
4. ఇంజనీరింగ్ అసిస్టెంట్: **38 పోస్టులు**
5. టెక్నికల్: **29 పోస్టులు**

విభాగాలు: ప్రొడక్షన్, పీ అండ్ యూ, ఓ అండ్ ఎం, ఫైర్ అండ్ సేఫ్టీ, ఎలక్ట్రికల్, మెకానికల్, టీ అండ్ ఐ.

అర్హత: ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, షార్ట్‌లిస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులకు రూ.300.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21

వెబ్‌సైట్: https://iocl.com/

బీఐఎస్‌లో సైంటిస్ట్-బి పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 15

పోస్టు: సైంటిస్ట్-బి

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ(కెమిస్ట్రీ), బీటెక్(సివిల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతోపాటు గేట్ స్కోరు, పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.1,11,780

వయోపరిమితి: 2024 ఆగస్టు 16 నాటికి 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక: విద్యార్హత, గేట్ స్కోరు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా


దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16

వెబ్‌సైట్: https://www.bis.gov.in/

లిటిల్స్

కృతజ్ఞత నేర్పిన దొంగ


ఒక ఊరిలో సీతారామయ్యఅనే రైతు వద్దఒక గుర్రం ఉండేది. దానికి అక్కడ ఉండటం అసలునచ్చేది కాదు. 'నా పూర్వీకులంతా రాజుల కొలువుల్లో ఉండి మంచి సౌకర్యాలు అనుభవించారు. నేను ఇక్కడబానిస బతుకు మతుకుతున్నాను'అని ప్రతిరోజూ బాధ పడుతూ ఉండేది. వీలైనంత త్వరగా అక్కడినుండి తప్పించుకు పోవాలని అనుకుంటూ ఉండేది. ఒక రోజు రాత్రి, సీతారామయ్య ఇంట్లోకి ఒక దొంగ ప్రవేశించాడు అతను చేతికిఅందిన సొమ్ము, విలువైన వస్తువులు మూటగట్టుకుని పోతూ ఉంటే, గుర్రం గమనించిమౌనంగా ఉన్నది తీరాదొంగ వెళ్లిపోతుంటే, గుర్రం అతనితో దయచేసి, నా కట్లు విప్పి, నన్ను విడిపించుఅని అడిగింది.' నీ కట్లు విప్పితే నాకేం లాభం?అన్నాడు దొంగ .దానికి"కట్లు విప్పి, నన్ను కూడా నీతో తీసుకెళితే, నీకు 'సేవ చేస్తూ, నీ దగ్గరే పడిఉంటాను' అన్నది గుర్రం. ఆ మాటలు విన్న దొంగ 'నేను దొంగతనం చేస్తున్నాను అని నీకు తెలుసు, ఐనా నువ్వు నీ యజమానిని నిద్ర లేపడానికి, నన్ను ఆపడానికి ప్రయత్నించలేదు. చిన్న శబ్దమైనా చేయలేదు. ఇప్పటి యజమానిపట్ల ఇలా ఉన్న దానివి రేపు నాకు ఆపద కలిగినా ఇలాగే చేస్తావు కాబట్టి, నిన్ను నేను విడిపించను, నీకు కృతజ్ఞత లేదు' అని చెప్పి, ఆ దొంగ వెళ్లిపోయాడు. ఆ మాటలకు సిగ్గుపడిన గుర్రం ఆ రోజునుండి తన యజమాని చెప్పిన పని చేస్తూ, కృతజ్ఞతతో మెలగసాగింది.




15 తేడాలను గుర్తించండి?



సరైన నీడ ఏది?



ఏనుగులు ఎన్ని, ఖడ్గ మృగాలు ఎన్ని



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 372

					7	6		
	7		1	3		5	2	
			2	5	6			9
		7	8			4	3	1
3		4				7		5
6	5	1			4	8		
4			7	1	3			
	2	5		8	9		4	
		8	5					

సుడోకు - 371 సమాధానం

5	1	2	4	9	7	6	8	3
9	7	6	1	3	8	5	2	4
8	4	3	2	5	6	1	7	9
2	9	7	8	6	5	4	3	1
3	8	4	9	2	1	7	6	5
6	5	1	3	7	4	8	9	2
4	6	9	7	1	3	2	5	8
1	2	5	6	8	9	3	4	7
7	3	8	5	4	2	9	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.